మే
2026

241

సంపుటి : 21 సంచిక : 12

వెల రూ. 15/-

# MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

పెట్టుబడిదారీ విధానం-కార్ల్‌మార్క్స్
దోపిడీ పీడనలపై కార్మికుల తిరుగుబాటు
నొయిడా నోట్స్
మహిళా రిజర్వేషన్ బిల్లా? లేక బిజెపి పరిరక్షణ బిల్లా?
భారతదేశపు తరగతిగదుల విరాట్ కథనం
డిల్లీ సుల్తానుల కాలపు భూసంబంధాలు
సామ్రాజ్యవాదం నాడు-నేడు
ట్రంప్ టారీఫ్‌లు : అమెరికా హుళజాతిసంస్థలు
'సర్'తో పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ప్రమాదం


# పెట్టుబడిదారీ విధానం-కార్ల్‌మార్క్స్

**ప్రభాత్ పట్నాయక్**

పెట్టుబడిదారీ విధానాన్ని అర్థం చేసుకోవటానికి మార్క్స్ అనుసరించిన విధానాన్ని రెండు లోతైన అంశాల ద్వారా పరిశీలించటం ఉపయోగకరంగా ఉంటుంది. మొదటిది అదనపు విలువ ఉత్పత్తికి సంబంధించినది. సరుకులతో నిండిన ప్రపంచంలో, సరుకుల యజమానుల మధ్య-వారిలో కార్మికులు కూడా ఉంటారు- ఎటువంటి మోసాలు లేకుండా స్వచ్ఛందంగా, సమాన ప్రాతిపదికపై సరుకుల మారకం జరుగుతుంది. మరి ఈ విధంగా జరిగే మారకంలో అదనపు విలువ ఏ విధంగా వస్తుంది?

శ్రమకు, శ్రమశక్తికి మధ్య వ్యత్యాసాన్ని కనుగొనటం ద్వారా మార్క్స్ ఈ చిక్కుముడిని విప్పాడు. పెట్టుబడిదారీ విధానంలో కార్మికుని శ్రమశక్తి కూడా సరుకుగా మారింది. కార్మికుడు తన శ్రమను కాకుండా శ్రమశక్తిని, అంటే తాను పని చేయగల శక్తిని అమ్ముతున్నాడు. ఆయా సరుకులలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉన్న శ్రమకాలం ప్రాతిపదికగా అన్ని సరుకులకు ఏ విధంగా ధరలను నిర్ణయిస్తారో, అదే విధంగా ఒక నిర్దిష్ట కాలం పనిచేయగల శ్రమను ఉత్పత్తి, పునరుత్పత్తి చేయటానికి అవసరమైన సరుకుల విలువ ప్రాతిపదికగా శ్రమశక్తి విలువను నిర్ణయిస్తారు. కొనుగోలుదారుడు ఒక సరుకుగా శ్రమశక్తిని కొనుగోలు చేసి, వినియోగించుకొనే శ్రమ కాలంలో విలువను ఉత్పత్తి చేస్తుంది. తన స్వంత విలువ కన్నా శ్రమశక్తి ఉత్పత్తి చేసే విలువ ఎక్కువగా ఉండటం అదనపు విలువ ఉత్పత్తికి ప్రాతిపదికగా ఉన్నది. అందువలన సమానమైన విలువ కలిగిన సరుకుల మధ్య మారకం జరిగినప్పటికీ, అన్ని సరుకులూ సమాన విలువకే మారకం అవుతున్నప్పటికీ, ఈ విధంగా అదనపు విలువ ఉత్పత్తి అవుతున్నది.

ఈ విధమైన లోతైన అవగాహన అనేక ముఖ్యమైన అంశాలపై నిర్ణయాలకు దారి తీసింది. మొదటగా శ్రమశక్తి కూడా తనకు తానుగా ఒక సరుకుగా మారి, సరుకుల ఉత్పత్తి సర్వవ్యాపితమైన పెట్టుబడిదారీ విధానానికి ఒక నిర్దిష్టమైన నిర్వచనాన్ని ఇచ్చింది. సరుకులను ఉత్పత్తి చేసే సాధారణ ఆర్థికవ్యవస్థలో ఉపయోగపు విలువ-మారకపు విలువ, శ్రమచేసే క్రమం-అదనపు విలువ ఉత్పత్తి అయ్యే క్రమం, ఉత్పత్తి-సరుకు, నిర్దిష్ట



శ్రమ-అనిర్దిష్ట శ్రమ, కనీస జీవనావసరాలు -అస్థిర పెట్టుబడి, అదనపు ఉత్పత్తి-అదనపు విలువ తదితరాల ద్వంద్వ స్వభావం ఇపుడు మరింత విస్తృతంగా స్పష్టంగా కనిపిస్తున్నది.

రెండవది, పెట్టుబడిదారి వ్యవస్థలో మారకం జరిగే క్రమంలో కాకుండా, ఉత్పత్తి జరిగే క్రమంలో అదనపు విలువ ఉత్పత్తి అవుతున్నది. సరుకులను ఉత్పత్తి చేసే పెట్టుబడిదారీ సంస్థలు ఒకదానితో మరొకటి పోటీ పడటం వలన అధిక ధరలకు ఉత్పత్తి చేసే ఉత్పత్తిదారులు క్రమంగా ఉత్పత్తి రంగం నుండి నిష్క్రమిస్తారు. ఉత్పత్తి ఖర్చులను తగ్గించటం కోసం నిరంతరం ఎదురౌతున్న వత్తిడి కొత్త పద్ధతులను, కొత్త ఉత్పత్తులను రంగంలోకి తీసుకురావటానికి, అంటే ఉత్పత్తి విధానాన్ని నిరంతరం విప్లవాత్మకం చేయటానికి దారి తీస్తుంది. ఉత్పత్తి విధానాన్ని నిరంతరం విప్లవాత్మకం చేస్తుండటం గతంలోని ఉత్పత్తి విధానాలన్నింటి కన్నా పెట్టుబడిదారీ విధానాన్ని ప్రత్యేకమైనదిగా చేస్తున్నది. ఉత్పత్తి క్రమంలో అదనపు విలువ ఉత్పత్తి కావటంతో ఇది ముడిపడి ఉంది.

మూడవది, కొత్త పద్ధతులను ప్రవేశపెట్టటం పెట్టుబడి పరిమాణంపై ఆధార పడి ఉండటం వలన పెట్టుబడి ఎక్కువగా ఉన్న సంస్థలది పైచేయి అవుతుంది. ఇది కొద్దిపాటి పెట్టుబడులు ఉన్న సంస్థలను రంగంలో లేకుండా చేస్తుంది. అందువలన పెట్టుబడిని పోగు చేసుకోవటం ద్వారా తన పెట్టుబడి పరిమాణాన్ని పెంచుకోవాలనే వత్తిడిని ప్రతి పెట్టుబడిదారుడూ ఎదుర్కొంటాడు. ఈ వ్యవస్థ లోపల ఎదురౌతున్న పోటీ, వత్తిడి వలన ప్రతి పెట్టుబడిదారుడూ పెట్టుబడిని పోగుచేయటానికి పూనుకుంటాడు. డార్విన్ చెప్పిన విధంగా ఉనికి కోసం జరుగుతున్న పోరాటంలో మనుగడ సాగించాలని ప్రతి పెట్టుబడిదారుడూ తెగించి ప్రయత్నం చేస్తుంటాడు. పెట్టుబడి కేంద్రీకరణ అవుతూ, కాలక్రమంలో మరింత భారీ పెట్టుబడి ఉన్న సంస్థలు ఏర్పడుతూ ఉంటాయి. కాబట్టి కొందరు అనివార్యంగా నష్టపోతూ ఉంటారు (అంతిమంగా ఇది గుత్త పెట్టుబడిదారీ విధానానికి, పోటీని వదులుకోకుండానే ధరల నిర్ణయంపై పెట్టుబడిదారుల మధ్య రహస్య, బహిరంగ ఒప్పందాలు జరగటానికి దారి తీస్తుంది). అయినప్పటికీ పెట్టుబడిదారుల మధ్య పోటీ ఇతర రూపాలలో కొనసాగుతుంటుంది.

నాలుగవది, పెట్టుబడిదారులు అదనపు విలువను నిరంతరం సొంతం చేసుకొంటూ ఉండాలంటే తాను ఉత్పత్తి చేసే విలువ కన్నా శ్రమశక్తి విలువ ఎప్పుడూ తక్కువగా ఉండాలి. అంటే ఈ వ్యవస్థలో ఎప్పుడూ శ్రమ

(మిగతా 34వ పేజీలో)

# ఈ సంచికలో...


1. పెట్టుబడిదారీ విధానం-కార్ల్‌మార్క్స్
ప్రభాత్ పట్నాయక్.......2

2. దోపిడీ పీడనలపై కార్మికుల తిరుగుబాటు
జై భగవాన్..........4

3. నొయిడా నోట్స్
సిపి చంద్రశేఖర్........8

4. మహిళా రిజర్వేషన్ బిల్లా? లేక బిజెపి పరిరక్షణ బిల్లా?
పమేలా ఫిలిపోస్......11

5. భారతదేశపు తరగతిగదుల విరాట్ కథనం
మెర్లియా..షౌకత్.....13

6. ఢిల్లీ సుల్తానుల కాలపు భూసంబంధాలు
ఎంవిఎస్ శర్మ.......17

7. సామ్రాజ్యవాదం నాడు-నేడు
విజయ ప్రసాద్......21

8. ట్రంప్ టారీఫ్‌లు: అమెరికా బహుళజాతి సంస్థలు
క్రెయిగ్ మెడ్లిన్ .....26

9. 'సర్'తో పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ప్రమాదం
ఎ కోటిరెడ్డి .....31



సంపాదకుడు:
**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం:
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# కుట్రపూరితం

**చి**త్తం శివుని మీద, భక్తి ప్రసాదం మీద అన్న సామెత 'మహిళా రిజర్వేషన్- నియోజకవర్గాల పునర్విభజన'కు సంబంధించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు విషయంలో నరేంద్ర మోడీ ప్రభుత్వ వైఖరికి సరిగ్గా సరిపోతుంది. తాము చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తుంటే ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయి అని గగ్గోలు చేస్తున్న బిజెపి-ఎన్డీఎ పక్షాల అసలు ఉద్దేశ్యం మహిళలకు రిజర్వేషన్లు కాదనీ, దాన్ని అడ్డుపెట్టుకుని నియోజక వర్గాల పునర్విభజన కోసం రాజ్యాంగ సవరణ చట్టాన్ని నెగ్గించుకోవడమేననీ కాస్త రాజకీయ పరిజ్ఞానం ఉన్న ఎవరికైనా ఇట్టే తెలిసిపోతుంది. దీనికోసం అయిదు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరుగుతున్న సమయంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడమే మోడీ ప్రభుత్వ కపట నీతికి నిదర్శనం. నిజంగానే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను 2029 ఎన్నికల్లోనే అమలు చేయాలని నరేంద్ర మోడీ సర్కారు అభిమతమైతే ఆ బిల్లు ఆమోదించిన 2023 సెప్టెంబర్‌లోనే ఆ పని చేసివుండవచ్చు. కానీ అప్పుడు తాజా జనాభా లెక్కల ప్రాతిపదికపై నియోజకవర్గాల పునర్విభజన జరిపాకనే కొత్త చట్టం అమలు చేస్తామని చెప్పింది ఈ పాలకులే కదా! చట్టాన్ని వెంటనే అమలు చేయాలని ఆనాడు ప్రతిపక్షాలు పట్టుబట్టినా పాలక పార్టీ అందుకు తిరస్కరించింది కదా! అంతేగాక ఆనాడు జనగణన, నియోజకవర్గాల పునర్విభజన గురించి అంత గట్టిగా చెప్పినవారు ఇప్పటివరకు ఆ పని పూర్తి చేయనేలేదు. దాదాపు మూడేళ్లవుతున్నా పునర్విభజన కమిషన్‌ను నియమించలేదు. జనగణన పూర్తి స్థాయిలో ప్రారంభమే కాలేదు. అవేమీ చేయకుండా ఇప్పుడు పార్లమెంటు ప్రత్యేక సమావేశం అంటున్నారంటే, మహిళా రిజర్వేషన్ పేరుతో రాజకీయ లబ్ధి పొందడం కోసం, మరోవైపు నియోజకవర్గాల పునర్విభజన ద్వారా ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకోవడం కోసం మోడీ ప్రభుత్వం ఈ కుత్సిత ఎత్తుగడకు పాల్పడిందని అర్ధమవుతుంది.

బిజెపి ప్రభుత్వం ఖచ్చితమైన వివరణ ఏమీ ఇవ్వకుండానే పదేళ్లకొకసారి జరగాల్సిన జనాభా లెక్కలను అయిదేళ్ల పాటు వాయిదా వేసిందంటే దాని వెనక రాజకీయ తర్కమేమిటో గ్రహించడం పెద్ద కష్టమైన పనేమీ కాదు. 2021లో జనాభా లెక్కల సేకరణను వాయిదా వేసినపుడు కోవిడ్-19 కారణమని చెప్పారు. కానీ తర్వాత మళ్లీ మళ్లీ వాయిదా వేయడానికి ఎలాంటి కారణాలు చెప్పలేదు. తర్వాత 2026-27లో జనగణన జరుగుతుందని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాల మధ్య లోక్‌సభ స్థానాలను 1971లో వున్న సంఖ్య వద్ద స్తంభింపచేశారు. 2026 జనాభా లెక్కల ప్రకటన వెలువడే వరకూ అదే అమలులో వుండాలి. అంటే పునర్విభజన 2031 జనాభా లెక్కల ప్రకారం చేయాల్సి వుంటుంది. కానీ 2029 లోక్‌సభ ఎన్నికలకు కూడా అవి అందుబాటులో వుండబోవని గ్రహించినందువల్ల కావచ్చు- ప్రభుత్వం ఇప్పుడు 2011 జనాభా లెక్కల ప్రాతిపదికనే పునర్విభజన కానిచ్చేసేందుకు తెగ హడావుడి పడిపోతున్నది.

131వ రాజ్యాంగ ద్వారా లోక్‌సభలో ఇప్పుడున్న స్థానాల సంఖ్య 850కి పెరుగుతుంది. 2011 జనాభా లెక్కల వివరాల ప్రకారం చూస్తే సభలో వుండబోయే 850 స్థానాలు ప్రాంతాల వారీగా అత్యంత అసమానమైన పెరుగుదలకు దారితీస్తాయి. హిందీ ప్రాంతంలోని ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, చత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, ఢిల్లీలకు ఇప్పుడు 543లో 207 వుంటే పెరుగుదల తర్వాత 366 అవుతాయి. అంటే 77 శాతం పెరుగుతాయి. మొత్తం నియోజకవర్గాల్లో వాటి వాటా 38.1 నుంచి 43.1 శాతానికి పెరుగుతుంది. దక్షిణాదికి చెందిన తమిళనాడు, కర్నాటక, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కేరళ, పుదుచ్చేరిలకు ఇప్పుడు 132 వున్నవి 176కు మాత్రమే పెరుగుతాయి. అంటే కేవలం 33.6 శాతం పెరుగుదల మాత్రమే. వాటి మొత్తం వాటా 24.3 శాతం నుంచి 20.7 శాతానికి పడిపోతుంది. ఈ విధంగా దేశంలోని ప్రాంతాల మధ్య ఏర్పడే ఈ అసమానతలు సమాఖ్య వ్యవస్థకు నష్టం కలిగిస్తాయి. దీనిపై దేశవ్యాపితంగా పెద్ద ఎత్తున చర్చ జరపకుండా హడావిడిగా, మహిళా రిజర్వేషన్లతో లింకుపెట్టి ఆమోదింప జేసుకోడానికి బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రపూరిత ప్రయత్నం సహజంగానే ప్రజాతంత్ర వాదుల్లో ఆందోళన కలిగించింది. ఆ కారణం చేతనే ప్రతిపక్షాలు 131వ సవరణ బిల్లును ఓడించాయి.

అందువల్ల మహిళా రిజర్వేషన్‌ను జనగణన, పునర్విభజన అంశాలతో ముడిపెట్ట కుండానే అమలు చేయాలి. ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించి ఏకాభిప్రాయం సాధించాలి. రాష్ట్ర అసెంబ్లీల నియోజకవర్గాల విభజన, సంఖ్యను పెంచడం వంటి ప్రతిపాదనలున్నందున రాష్ట్ర ప్రభుత్వాలతోనూ సంప్రదించాలి. చర్చలతో ఏకాభిప్రాయం ద్వారా మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలి. సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా విశాల సమాజ హితం కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలి. అందుకు ప్రజా ఒత్తిడి అవసరం.

ఈ మాసం ముఖ్యాంశం

# దోపిడీ పీడనలపై కార్మికుల తిరుగుబాటు



రచయిత సిఐటియు హర్యానా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**జై భగ్‌వాన్**

దేశరాజధాని ప్రాంతంలో ఇటీవల కార్మికులు తీవ్రమైన నిరసనాందోళనకు దిగారు. గత ఫిబ్రవరి 12న దేశ వ్యాపితంగా కార్మిక సమ్మె జరిగిన నేపథ్యంలో ఈ నిరసన కార్యక్రమాలు జరగడం గమనించదగ్గ విషయం. ఈ ఉద్యమం మనేసర్ (గురుగాంవ్) లో ఏప్రిల్‌లో ప్రారంభమై నొయిడా అంతటా, అక్కడి నుండి జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్) అంతా దావానలంలా వ్యాపించింది. గతంలో ఎన్నడూ ఎరుగని రీతిలో కార్మికోద్యమం శీఘ్రాతిశీఘ్రంగా వ్యాపించింది. దీనికి ప్రేరణ హర్యానాలోని పానిపట్ రిఫైనరీలో గత ఫిబ్రవరిలో జరిగిన కాంట్రాక్టు లేబర్ ఉద్యమం. ఈ కార్మికుల తిరుగుబాటు ఒక నిర్దిష్టమైన వాతావరణంలో జరిగింది. కార్మికులపై జరుగుతున్న తీవ్రమైన దోపిడీని, దారుణమైన పని పరిస్థితులను, కార్మికులు ఎదుర్కొంటున్న దుర్భరమైన ఆర్థిక పరిస్థితులను ఈ తిరుగుబాటు లోకానికి చాటి చెప్పింది. కార్మికుల ఓర్పుకు కూడా ఒక హద్దు ఉంటుందనీ, కార్మికుల్లో కూడా పోరాట శక్తి ఉంటుందనీ, అది గనుక ఒకసారి కట్టలు తెంచుకుని బయటకు వస్తే మొత్తం వ్యవస్థ పునాదులనే పెకిలించి వేస్తుందనీ ఇది నిరూపించింది.

**కార్మికులు రోడ్లమీదకు ఎందుకు వచ్చారు?**

ఈ ఉద్యమం హర్యానాలోని గురుగాంవ్‌కు చెందిన మానెసర్‌లో ప్రారంభమైంది. పరిశ్రమల్లో కార్మిక చట్టాలను చట్టబండలు చేస్తుండడం దీనికి ప్రధాన కారణం. పరిశ్రమల్లో శాశ్వత ఉద్యోగులను నియమించాల్సిన చోట పెద్ద ఎత్తున కాంట్రాక్టు కార్మికులను నియమించుకుని యజమానులు పబ్బం గడుపుకుంటున్నారు. ఈ కాంట్రాక్టు కార్మికులంతా ఉత్పత్తిలో నేరుగా పాల్గొంటున్నారు. అయినప్పటికీ వీరికి వీరి పక్కనే పనిచేస్తున్న శాశ్వత కార్మికులకు వచ్చే వేతనంలో ఆరోవంతు వేతనం కూడా రావడం లేదు. 15 ఏళ్ల సర్వీసు ఉన్న ఈ కార్మికులకు నెలకు రూ. 10,000 నుండి 11,000 ముట్టజెపుతున్నారు. ఈ కొద్దిపాటి వేతనంతో వాళ్లు రోజుకు 12 గంటలు పనిచేయాలి. అలా అని వారికి ఓవర్‌టైమ్ డబుల్ ఎలవెన్స్ ఇస్తారా అంటే అదీ లేదు. చాలా చోట్ల కార్మికులకు వారాంతపు శెలవులు కూడా ఇవ్వరు. పైగా పని ప్రదేశంలో భద్రత సున్నా. నెలవారీ టాయిలెట్ ఫీజు పేరుతో దుస్తుల పరిశ్రమ కార్మికుల నుండి యజమానులు రూ. 21 వసూలు చేస్తున్నారు. దుస్తుల పరిశ్రమలో మహిళా కార్మికులపై లైంగిక దాడులు సర్వ సాధారణం. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడి తరువాత పరిస్థితి మరింత దారుణంగా మారింది. కార్మికులకు వండుకోడానికి గ్యాస్ కూడా లేకండా పోయింది. నగరాల్లో ఇటువంటి అత్యల్ప వేతనాలతో నివసిస్తున్న లక్షలాది మంది కార్మికులు వంటగ్యాస్‌ను కిలో 80 నుండి 90 రూపాయలకు కొనుక్కోవలసి వస్తోంది. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడి తరువాత గ్యాస్ ధర అకస్మాత్తుగా కిలోకు 400 నుండి 500 రూపాయలకు పెరిగిపోయింది. అసలే అధిక ధరలతో బాధపడుతున్న కార్మికవర్గానికి ఈ గ్యాస్ రేట్ల పెంపు గోరుచుట్టపై రోకటి పోటులా మారింది. అనేక ఏళ్లుగా వేతనాల్లో పెరుగుదల లేని కార్మికులకు ఈ పిడుగుపాటుతో బతుకు దుర్భరమైపోయి రోడ్లమీదకు రావడం మినహా మరో మార్గం లేకుండా పోయింది. మొదట హోండా కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికులు వేతనాలు పెంచాలన్న డిమాండుతో సమ్మెకు దిగారు. వెనువెంటనే డజన్లకొద్దీ ఆటోమొబైల్ కంపెనీల కార్మికులు ఒకరితరువాత మరొకరు సమ్మెలో చేరారు. ఏప్రిల్ 8న దుస్తుల పరిశ్రమకు చెందిన వేలాది మంది కార్మికులు వీధుల్లోకి వచ్చారు.

**ఎదుగూ బొదుగూ లేని కనీస వేతనాలు**


హర్యానాలో 2015 అక్టోబర్‌లో చివరిసారిగా వేతన సవరణ జరిగింది. 2015 నవంబర్ 1 నుండి అమల్లోకి వచ్చింది. చట్ట ప్రకారం ప్రతి అయిదేళ్లకొకసారి కనీస వేతనాలను సవరించాలి. దీని ప్రకారం 2020 అక్టోబర్‌తో అయిదేళ్ల పరిమితి ముగిసింది. కానీ యజమానుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కార్మికుల వేతనాలు సవరించలేదు. అనేక సంవత్సరాలుగా దీనిపై నిరసన కార్యక్రమాలు సాగుతూ వచ్చాయి. సిఐటియు అనేక ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించింది. కిందినుండి తీవ్రమైన ఒత్తిడి రావడంతో ప్రభుత్వం 2025 మేలో కనీస వేతనాల సవరణకు సిఫార్సుల నిమిత్తం ఒక కమిటీని నియమించింది. కనీస వేతన నిర్ణయానికి అనుసరించే పద్ధతులను బట్టి కార్మికులకు 30,000 రూపాయల కనీస వేతనం ఇవ్వాలని సిఐటియు హర్యానా రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ప్రభుత్వం నియమించిన కమిటీ 2025 మే నుండి డిసెంబర్ వరకు తొమ్మిది సమావేశాలు జరిపింది. 2029 డిసెంబర్‌లో పానిపట్‌లో జరిగిన కమిటీ తొమ్మిదవ సమావేశంలో 23,196 రూపాయల కనీస వేతనం ఇవ్వాలని ఏకగ్రీవంగా ప్రతిపాదించింది. ఈ కమిటీలో కార్మిక విభాగం నుండి, పారిశ్రామిక యజమానుల నుండి, ట్రేడ్ యూనియన్ల నుండి ప్రతినిధులు ఉన్నారు. ప్రభుత్వానికి ప్రతిపాదన పంపితే అది ఆమోదించలేదు. కమిటీ ప్రతిపాదనను ఆమోదించకపోగా కార్మికులకు కనీస వేతనం

15,200 ఇవ్వనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి మార్చి 2న బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. మార్చి నెలంతా గడిచిపోయినా ముఖ్యమంత్రి ప్రకటన కూడా అమలు చేయలేదు. ఒకవైపు పెరుగుతున్న ధరలు, వేతనాలు పెరగకపోవడం, మరోవైపు వంటగ్యాసు ధరలు పెరిగిపోవడంతో కార్మికులకు సహనం నశించింది.

### కార్మికోద్యమం నుండి ఒత్తిడి

ఏప్రిల్ 8న మనేసర్ (గుర్గాంవ్)లో కార్మికులు సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా ఎస్‌డిఎం కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. 10,000 కార్మికులు ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. వారిలో మహిళలు అధికసంఖ్యలో ఉన్నారు. ఉధృతమవుతున్న కార్మికుల ఆందోళన జిల్లా యంత్రాంగంలోనూ, యజమానుల్లోనూ వణుకు పుట్టించింది. దాంతో ఏప్రిల్ 8వ తేదీన జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం కనీస వేతన సమస్య ఎజెండాలో లేనప్పటికీ దీనిపై చర్చించింది. తప్పని పరిస్థితుల్లో ముఖ్యమంత్రే స్వయంగా సాయంత్రం నాలుగు గంటలకు మీడియా సమావేశం పెట్టి కనీస వేతనాలు పెంచుతున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఇస్తున్న 11,274 రూపాయల వేతనాన్ని 15,220కి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. మరునాడు ఏప్రిల్ 9న వేలాది మంది కార్మికులు వీధుల్లోకి రావడంతో వారి ఒత్తిడికి తట్టుకోలేక అదే రోజు నోటిఫికేషన్ విడుదల చేశారు.

**"ఏప్రిల్ 8న మనేసర్ (గుర్గాంవ్)లో కార్మికులు సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా ఎస్‌డిఎం కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. 10,000 కార్మికులు ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. వారిలో మహిళలు అధికసంఖ్యలో ఉన్నారు. ఉధృతమవుతున్న కార్మికుల ఆందోళన జిల్లా యంత్రాంగంలోనూ, యజమానుల్లోనూ వణుకు పుట్టించింది. దాంతో ఏప్రిల్ 8వ తేదీన జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం కనీస వేతన సమస్య ఎజెండాలో లేనప్పటికీ దీనిపై చర్చించింది."**



దేశ రాజధాని ప్రాంతంలో నిరసనకు దిగిన కార్మికులను అరెస్టు చేయడానికి సిద్ధమవుతున్న పోలీసులు

### జాతీయ రాజధాని ప్రాంతంలోని మూడు రాష్ట్రాలకు ఉద్యమ విస్తరణ

హర్యానాలోని మనేసర్ (గుర్గాంవ్)లో ప్రారంభమైన ఉద్యమం జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్) కు సంబంధించిన మూడు రాష్ట్రాల్లోని అనేక జిల్లాలకు విస్తరించింది. ఏప్రిల్ 10న నొయిడా (ఉత్తర ప్రదేశ్)లోని డజన్లకొద్దీ ఫ్యాక్టరీల్లో కార్మికులు సమ్మెకు దిగారు. ఆటో మొబైల్ కర్మాగారాలతోపాటు మనేసర్, నొయిడాల్లోని దుస్తుల ఫాక్టరీల్లో కూడా కార్మికులు సమ్మెలోకి వచ్చారు. కార్మికులపై జరుగుతున్న దోపిడీ, పీడనలపట్ల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. నొయిడాలోని వందలాది ఫ్యాక్టరీకు చెందిన వేలాదిమంది కార్మికులు ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ కార్మికులు ఏ యూనియన్‌లో లేరు. వారికి నాయకులు కూడా లేరు. అయితే శాంతి యుతమైన నిరసన ఉద్యమం అనేక రోజుల పాటు సాగింది. హర్యానా ప్రభుత్వం వేతనాలు పెంచిన తరువాత ఉత్తర ప్రదేశ్‌లోని యోగి ప్రభుత్వం కూడా కనీస వేతనాలు పెంచుతుందని కార్మికుల భావించారు. ఈ మొత్తం ఉద్యమం, ఎంతోకొంత సాధించాలన్న కోర్కెనూ, పట్టుదలనూ కార్మికుల్లో పెంచింది. ఉద్యమ ప్రభావం ఎంతగా ఉందంటే నొయిడాలోని వేలాది మంది ఇంటి పనివారు కూడా తమ వేతనాలు పెంచాలని కోరుతూ సమ్మెలోకి వచ్చారు. ఇంత పెద్ద ఎత్తున జరిగిన ఉద్యమ ఒత్తిడితో చివరికి ఉత్తర ప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వం కనీస వేతనాన్ని 11,313 రూపాయల నుండి 13,690 రూపాయలకు పెంచడానికి ఒప్పుకుంది. అయితే ఈ పెంపుదల కేవలం రెండు జిల్లాల్లో నొయిడా, ఘజియాబాద్‌లలో అది కూడా డిఎ పెంపు రూపంలో అమలు చేస్తామని చెప్పింది. ఇతర మున్సిపల్ కార్పొరేషన్లలో 13,006 రూపాయలకు, రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో 12,356 రూపాయలకు పెంచింది.

అదే విధంగా రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లా భివాండీ, నిమ్రానా ప్రాంతాల్లో కూడా కార్మికులు సమ్మెలోకి దిగారు. ఈ ఉద్యమాలు స్పాంటేనియస్‌గా ముందుకొచ్చాయి. హర్యానాలోని ఫరీదాబాద్, పల్వాల్, కర్నాల్ –పానిపట్, సోనిపట్ జిల్లాల్లో కార్మికులు 20,000 రూపాయల కనీస వేతనం ఇవ్వాలనీ, ప్రకటించిన కనీస వేతనాన్ని వెంటనే అమలు చేయాలనీ డిమాండ్ చేస్తూ వీధుల్లోకి వచ్చారు. వేలాది మంది కార్మికులు ఆగ్రా–ఢిల్లీ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. వీరిలో మహిళలు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. అయితే ప్రభుత్వం, అధికారులు ఈ ఉద్యమాలను పోలీసు దౌర్జన్యంతో అణచివేయడానికి ప్రయత్నించారు.

### ఉద్యమంపై పోలీసు దాడి

హర్యానా మంత్రివర్గం నిర్ణయించి, ముఖ్యమంత్రి చేత ప్రకటించబడిన 15,220 రూపాయల కనీస వేతనం ఏమాత్రం చాలదని కార్మికులు భావించారు. అయితే దీనిపై నోటిఫికేషన్ జారీచేయడానికి సమయం పడుతుంది గనుక ఈ లోగా ప్రభుత్వానికి తమ అసమ్మతిని తెలియజేయాలన్న ఉద్దేశంతో తమ ఉద్యమాన్ని శాంతియుతంగా కొనసాగించడానికి నిర్ణయించారు. ఏప్రిల్ 8న పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని 163వ సెక్షన్ ప్రకారం అయిదుగురు కన్నా ఎక్కువ మంది గుమికూడడాన్ని నిషేధించారు. ఏప్రిల్ 9న ఫ్యాక్టరీ గేట్ల వద్ద శాంతియుతంగా నిరసన

> **“ బలప్రయోగంతో ఉద్యమాన్ని అణచివేయడం ఇప్పుడిక సాధ్యం కాదు. పోరాడి సాధించుకునే కార్మికవర్గ సామర్థ్యాన్ని ఈ ఉద్యమం మరోసారి ముందుకు తెచ్చింది. కొద్ది ప్రాంతానికే పరిమితమైనప్పటికీ ఇది దేశంలోని 54 కోట్ల మంది కార్మిక జనబాహుళ్యాలనికి ఆశాకిరణంగా ముందు కొచ్చింది. కార్మికులపై పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీని ఇది సవాలు చేసింది. ”**

తెలుపుతున్న కార్మికులపై పోలీసులు నిషేధాజ్ఞలను చూపించి ఎటువంటి హెచ్చరికలు లేకుండా లాఠీ చార్జి చేశారు. ఇందులో 20 మంది కార్మికులు గాయపడ్డారు. 55 మంది కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. వారిలో 20 మంది మహిళలు ఉన్నారు. రాత్రి వాళ్లను పోలీసు స్టేషన్‌లో ఉంచి మరునాడు ఏప్రిల్ 10న కోర్టులో హాజరుపరిచారు. పోలీసులు రెండు ఎఫ్ఐఆర్‌లు ఫైల్ చేశారు. ఒకటి, హత్యా ప్రయత్న నేరంకింద. దానికి బెయిల్ రాదు. మనేసర్ ఆందోళన సందర్భంగా ఈ సెక్షన్ల కింద 11 మంది కార్మికులను 14 రోజుల పాటు జుడీషియల్ కస్టడీకి పంపారు. తరువాత ఆరుగురిని అరెస్టు చేసి ప్రధాన నిందితులుగా జైల్లో పెట్టారు. మొత్తం మీద 61 మంది కార్మికులు, ట్రేడ్‌యూనియన్ కార్యకర్తలను అరెస్టు చేశారు. సిఐటియు హర్యానా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జై భగవాన్, ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్‌లకు పోలీసులు నోటీసులు పంపారు. వారు కార్మికులను ఉద్యమంలోకి రెచ్చగొట్టారని అభియోగం మోపారు. అదేవిధంగా పల్వాన్ జిల్లా ప్రిత్లాలో కార్మికులపై ఒక కేసు నమోదు చేశారు. ఫరీదాబాద్‌లోని మద్రాషన్ కంపెనీ గేటు దగ్గర శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తున్న వందలాది మంది కార్మికులను నిర్బంధంలోకి తీసుకున్నారు.

నొయిడాలో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం తీవ్ర నిర్బంధానికి దిగింది. కార్మికులపై లాఠీ చార్జి చేసింది. పెద్ద ఎత్తున అరెస్టులకు పాల్పడింది. సిఐటియు నొయిడా నాయకులు గంగేశ్వర్ దత్, రామ్‌సాగర్‌లను గృహనిర్బంధంలో ఉంచింది. సిఐటియు నొయిడా కార్యాలయాన్ని పోలీసులు చుట్టుముట్టారు. ఇది రాస్తున్న సమయానికి 400 మంది కార్మికులను అరెస్టు చేశారు. ఇందులో చాలా మంది మహిళలు ఉన్నారు. అదేవిధంగా రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లా భివాండీలోనూ ఇతర ప్రాంతాల్లోనూ కార్మికులపై దారుణంగా లాఠీ చార్జీ చేశారు. మహిళలను కూడా వదిలిపెట్టలేదు. అనేక మంది కార్మికులు గాయపడ్డారు. మనేసర్, నొయిడా, భివాండీ, ఫరీదాబాద్‌లలో అరెస్టయిన వారిలో అత్యధికులు సామాన్య కార్మికులు. మరోసారి కార్మికులు ఇటువంటి ఆందోళనకు పాల్పకుండా చేయాలన్న ఉద్దేశంతోనే పోలీసులు, పాలక వర్గాలు ఇటువంటి దారుణానికి పాల్పడ్డారు.

### జాతీయ రాజధాని ప్రాంతంలో ఏకరూప వేతనాల ఆవశ్యకత

జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్)లో ఢిల్లీతోపాటు, హర్యానా రాష్ట్రంలోని మొత్తం 23 జిల్లాలలకు గాను 14 జిల్లాలు (గుర్గాంవ్, రేవారి, ఫరీదాబాద్, పాల్వాల్, నూ, ఝజ్జర్, రోహ్‌తక్, సోనేపట్, పానిపట్, కర్నాల్, జింద్, భివాండీ, దాద్రి, మహేంద్రఘర్), ఉత్తర ప్రదేశ్‌లోని 7 జిల్లాలు (ఘజియాబాద్, గౌతమ్ బుద్ధా నగర్ (నొయిడా), గ్రేటర్ నొయిడా, బులంద్‌షహర్, భాగ్‌పట్, హాపూర్, ముజఫ్ఫర్‌నగర్), రాజస్థాన్‌కు చెందిన రెండు జిల్లాలు (భరత్‌పూర్, అల్వార్) ఉన్నాయి. ఈ నాలుగు రాష్ట్రాల్లో కనీస వేతనాలు వేరువేరుగా ఉన్నాయి. ఢిల్లీలో నెలకు 19,846 రూపాయులు, హర్యానాలో 15,220 రూపాయలు, ఉత్తర ప్రదేశ్‌లో 11,313 రూపాయులు, రాజస్థాన్‌లో 7,410 రూపాయలు. కానీ ఎన్‌సిఆర్‌లోని అత్యధిక జిల్లాల్లో జీవన వ్యయం దాదాపు ఒక్కలాగే ఉంటుంది. ఇళ్లద్దెలు ఆకాశాన్ని అంటుతాయి. నిత్యావసర వస్తువుల ధరలూ అధికమే. పారిశ్రామిక సంస్థలు ఇక్కడే ఎక్కువగా కేంద్రీకరించబడి ఉన్నాయి. ఫ్యాక్టరీ యజమానులు ఏటేటా ఒకటికి పది యూనిట్లను ఈ జిల్లాల్లో విస్తరిస్తూపోతున్నారు. ఫ్యాక్టరీలను ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి మార్చడం కూడా సాధారాణంగా జరిగే ప్రక్రియ. ఈ ప్రాంతం అభివృద్ధికీ, విస్తరణకూ కేంద్ర ప్రభుత్వం ఒక ఏకరూప ప్రణాళిక అమలు పరుస్తోంది. అందువల్ల ఇక్కడ కనీస వేతనాలు కూడా ఏకరూపంగా ఉండాలి. అది కూడా కనీసం నెలకు 26,000 రూపాయులు ఉండాలి. హర్యానాలో కనీస వేతనాల నిర్ణయ క్రమం గత ఏడాదిగా జరుగుతోంది. యజమానులు కూడా నెలకు 23,196 రూపాయుల వేతనం ఇవ్వడానికి అంగీకరించారు. కాబట్టి కనీస వేతనం దీనికి తగ్గకుండా ఉండాలి. ఫిక్స్‌డ్ ప్రాతిపదికగా అది నెలకు 30,000 రూపాలయులు అవుతుంది.

### అణచివేతలు ఈ ఉద్యమాన్ని ఆపలేవు

బలప్రయోగంతో ఉద్యమాన్ని అణచివేయడం ఇప్పుడిక సాధ్యం కాదు. పోరాడి సాధించుకునే కార్మికవర్గ సామర్థ్యాన్ని ఈ ఉద్యమం మరోసారి ముందుకు తెచ్చింది. కొద్ది ప్రాంతానికే పరిమితమైనప్పటికీ ఇది దేశంలోని 54 కోట్లమంది కార్మిక జనబాహుళ్యాలనికి ఆశాకిరణంగా ముందుకొచ్చింది. కార్మికులపై పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీని ఇది సవాలు చేసింది. బిజెపి మోడీ ప్రభుత్వం కార్మిక కోడ్‌ల వంటి దారుణ చట్టాలను అమలు పరచాలని నిర్ణయించుకుంది. ఈ కోడ్‌లు కార్మికులు సంఘటితం కావడాన్ని నిషేధిస్తాయి. యూనియన్లను ఏర్పాటు చేసుకునే హక్కును హరిస్తాయి. శాశ్వత ఉద్యోగాలను నిర్మూలిస్తాయి. రానున్న కాలంలో జరిగే నిరసన కార్యక్రమాలు ఈ చట్టాలను మార్చే విధంగా ప్రభుత్వం మెడలు వంచుతాయి. ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రభుత్వం చేసిన కిరాతక ప్రయత్నాలను సిఐటియు తీవ్రంగా ఖండించింది. కార్మికులకు అది నిరంతరాయంగా అండదండలివ్వడమే కాకుండా ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నది. ఏప్రిల్ 13న హర్యానా వ్యాపితంగా మెమొరాండాలు సమర్పించడం జరిగింది. 16వ తేదీన హర్యానాలోనూ, దేశంలోని అనేక ప్రాంతాల్లోనూ ఉద్యమ డిమాండ్లకు మద్దతుగా ప్రదర్శనలు జరిగాయి. సిఐటియు జాతీయ అధ్యక్షుడు సుదీప్ దత్తా, ప్రధాన కార్యదర్శి ఎలమరం కరీమ్, కార్యదర్శి ఎఆర్ సింధులు నొయిడా సందర్శించి బాధిత కార్మికులను పరామర్శించారు. వాళ్లు జిల్లా అధికారులను కలిసి అణచివేతలను వెనువెంటనే ఆపేయాలనీ, కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలనీ కోరారు. దీనిపై సిఐటియు ఈ క్రింది డిమాండ్లు చేస్తోంది:

1. 26,000 రూపాయల కనీస వేతనం అమలు చేయాలి.
2. కార్మికులపై పోలీసుల అణచివేతను తక్షణం నిలిపివేయాలి.
3. అరెస్టు చేసిన కార్మికులను వెంటనే విడుదల చేయాలి. గాయపడిన కార్మికులకు చికిత్స అందించాలి. అన్ని ఎఫ్ఐఆర్ లను రద్దు చేయాలి.
4. కార్మికులందరికీ ప్రభుత్వ ధరలకు ఎల్‌పిజి గ్యాస్ సరఫరా చేయాలి.
5. ఓవర్‌టైమ్ పనికి రెట్టింపు వేతనం ఇవ్వాలి. కార్మిక చట్టాలను ఖచ్చితంగా అమలు చేయాలి.
6. నిరసన తెలుపుతున్న కార్మికుల డిమాండ్లన్నిటినీ పరిష్కరించాలి.
7. కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌లు నాలిగింటినీ ఉపసంహరించుకోవాలి.

**సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో ఖండన**

కనీస వేతనాల పెంపుకోసం ఆందోళన చేస్తున్న కార్మికులపై దారుణమైన అణచివేతను ఖండిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఈ క్రింది ప్రకటన విడుదల చేసింది:

ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతంలోని పారిశ్రామిక బెల్ట్‌లో ఆందోళన చేస్తున్న ఫ్యాక్టరీ కార్మికులపై హర్యానా, ఉత్తర ప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వాలు పాల్పడిన దారుణ అణచివేతను సిపిఐ(ఎం) ఖండిస్తున్నది.

వేతనాలు పెంచాలనీ, చట్టరీత్యా వచ్చే సదుపాయాలు అమలు చేయాలనీ కార్మికులు దీర్ఘకాలికంగా పోరాడుతున్నారు. న్యాయమైన ఈ కోర్కెలను తీర్చడానికి బదులు రెండు ప్రభుత్వాలు కార్మికులపై పోలీసులను ప్రయోగించాయి. కార్మిక నాయకులపై తప్పుడు కేసులు బనాయించాయి. న్యాయమైన ఈ నిరసన కార్యక్రమాలను బయటి శక్తులు ప్రేరేపిస్తున్నాయని సిగ్గులేకుండా ఆరోపించడమే కాకుండా కార్మిక నాయకులను కుట్రదారులుగా ముద్రవేశారు.

పోలీసులు గ్రామాల్లో కూడా దాడులు చేస్తున్నారనీ, కార్మికులను విచక్షణా రహితంగా కొడుతున్నారనీ, వందలాది మందిని అరెస్టు చేస్తున్నారనీ వార్తలొస్తున్నాయి. అరెస్టయిన కార్మికులు ఎక్కడ, ఎలా ఉన్నారన్న సమాచారాన్ని కూడా వారి కుటుంబ సభ్యులకు ఇవ్వడం లేదు. సిపిఐ(ఎం), ఢిల్లీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ గంగేశ్వర్ దత్ శర్మ, సిఐటియు నొయిడా జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ రామ్ స్వరత్‌లను గత కొన్ని రోజులుగా గృహనిర్బంధంలో ఉంచారు.

" అమానుషమైన పని పరిస్థితులు, జీవన పరిస్థితులు, పెరగని జీతాలు, మౌలిక కార్మిక హక్కులను హరించడం, లాబర్ డిపార్ట్‌మెంటుల నిర్లక్ష్యం, యజమానుల అణచివేత ధోరణి... మొదలైన వాటికి నిరసనగా రెండున్నర మాసాలుగా దేశంలోని పలు చోట్ల ముఖ్యంగా ఉత్తర భారత దేశంలో కార్మికులు స్పాంటేనియస్‌గా ఉద్యమిస్తున్నారు. పెరుగుతున్న ఈ అసంతృప్తికి జాతీయ రాజధాని ప్రాంతంలో జరిగిన కార్మిక తిరుగుబాటు సరికొత్త వ్యక్తీకరణ మాత్రమే. "




రాజధాని ప్రాంత కార్మికులకు మద్దతుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న సిపిఐ(ఎం) కార్యకర్తలు

అమానుషమైన పని పరిస్థితులు, జీవన పరిస్థితులు, పెరగని జీతాలు, మౌలిక కార్మిక హక్కులను హరించడం, లాబర్ డిపార్ట్‌మెంటుల నిర్లక్ష్యం, యజమానుల అణచివేత ధోరణి...మొదలైన వాటికి నిరసనగా రెండున్నర మాసాలుగా దేశంలోని పలు చోట్ల ముఖ్యంగా ఉత్తర భారత దేశంలో కార్మికులు స్పాంటేనియస్‌గా ఉద్యమిస్తున్నారు. పెరుగుతున్న ఈ అసంతృప్తికి జాతీయ రాజధాని ప్రాంతంలో జరిగిన కార్మిక తిరుగుబాటు సరికొత్త వ్యక్తీకరణ మాత్రమే.

కార్మికుల పోరాటానికి సిపిఐ(ఎం) పూర్తి సౌహార్ధ్రత ప్రకటిస్తున్నది. అరెస్టయిన కార్మికులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నది. వారిపై పెట్టిన అన్ని కేసులను బేషరతుగా ఉపసంహరించాలని కోరుతున్నది. కార్మికులపై అన్ని రకాల అణచివేత, కక్షసాధింపు చర్యలను నిలిపివేయాలని పోలీసులను, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులను కోరుతున్నది. కార్మికుల న్యాయమైన కోర్కెలపై వారి ప్రతినిధులతో చర్చించడం ద్వారా పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నది.

అణచివేతను ఎదిరించండి!

కార్మికుల హక్కులను కాపాడుకోండి!!

**పోరాడే కార్మికులపై దారుణ అణచివేతను ఖండిస్తూ సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) ఈ క్రింది ప్రకటన విడుదల చేసింది:**

నొయిడా, గ్రేటర్ నొయిడా, గురుగ్రామ్, ఇంకా జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్)లో స్పాంటేనియస్‌గా జరుగుతున్న మిలిటెంట్ కార్మిక పోరాటంపై ఉత్తర ప్రదేశ్, హర్యానాల్లోని బిజెపి ప్రభుత్వాలు సాగిస్తున్న దారుణ అణచివేతను సిఐటియు తీవ్రంగా ఖండిస్తోంది. ఇది కేవలం పారిశ్రామిక వివాదం కాదు, ఇది నేరుగా జరుగుతున్న వీరోచిత వర్గపోరాట అభివ్యక్తీకరణ. ఇక్కడ ప్రభుత్వ యంత్రాంగం మొత్తం కార్మిక హక్కులను

> **“ నొయిడా ఫేజ్-2లో ఏప్రిల్ 9న ప్రారంభమైన ప్రస్తుత నిరసన వెల్లువలో నొయిడాలోనే 40,000 నుండి 50,000 మంది కార్మికులు పాల్గొన్నారు. జాతీయ రాజధాని ప్రాంతంలోని 6 నుండి 8 క్లస్టర్లకు, 15 పారిశ్రామిక పోకెట్లకు ఇది విస్తరించింది. బరౌని, పానిపట్ నుండి సూరత్, మనేసర్ వరకు దేశవ్యాపితంగా జరుగుతున్న పోరాట వెల్లువల్లో ఇది ఒక భాగం మాత్రమే. ఫిబ్రవరి 12న జరిగిన చారిత్రాత్మక సాధారణ సమ్మెకు కొనసాగింపుగా ఈ పోరాటాలు జరుగుతున్నాయి. ”**

హరించి బహిరంగంగా కార్పొరేట్ ప్రయోజనాలు కాపాడ్డానికి ప్రయత్నిస్తున్నాయి.

కార్మికవర్గంపై జరుగుతున్న ఈ దాడుల సందర్భంగా భారత కార్మికవర్గం యావత్తు, ముఖ్యంగా పారిశ్రామిక కార్మికులు సమ్మె చేస్తున్న కార్మికులకు సంఘీభావంగా నిలవాలని సిఐటియు పిలుపునిస్తున్నది. 2026 ఏప్రిల్ 26న దేశవ్యాపిత నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది.

శాశ్వత ఉద్యోగాల్లోకి కాంట్రాక్టు కార్మికుల నియామకాలకు వ్యతిరేకంగా, చాలీ చాలని వేతనాలు, అమానుష పని పరిస్థితులు, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు, దారుణమైన ప్రభుత్వ అణచివేతలకు వ్యతిరేకంగా ఎన్‌సిఆర్, హర్యానా (మనేసర్, పానిపట్, సోనేపట్), రాజస్థాన్ (భివాండీ, నీమ్రానా, అల్వార్), గుజరాత్ (సూరత్, హజిరా) బీహార్ (బరౌనీ) ఇంకా ఇతర పారిశ్రామిక కేంద్రాల్లో సమన్వయంతో కూడిన ప్రదర్శనలు, గేట్ మీటింగులు, ఇతర సౌహార్ద్ర కార్యక్రమాలను నిర్వహించాలని కార్మికులను కోరింది.


నొయిడా ఫేజ్-2లో ఏప్రిల్ 9న ప్రారంభమైన ప్రస్తుత నిరసన వెల్లువలో నొయిడాలోనే 40,000 నుండి 50,000 మంది కార్మికులు పాల్గొన్నారు. జాతీయ రాజధాని ప్రాంతంలోని 6 నుండి 8 క్లస్టర్లకు, 15 పారిశ్రామిక పోకెట్లకు ఇది విస్తరించింది. బరౌని, పానిపట్ నుండి సూరత్, మనేసర్ వరకు దేశవ్యాపితంగా జరుగుతున్న పోరాట వెల్లువల్లో ఇది ఒక భాగం మాత్రమే. ఫిబ్రవరి 12న జరిగిన చారిత్రాత్మక సాధారణ సమ్మెకు కొనసాగింపుగా ఈ పోరాటాలు జరుగుతున్నాయి. కార్మికుల్లో ప్రదర్శితమైన ఈ ఐక్యతతో ఇప్పటికే ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం హడావిడిగా వేతన సవరణ ప్రకటించింది. దీనివల్ల కేవలం పోరాటాల వల్ల మాత్రమే ఫలితాలు వస్తాయని మరోమారు రుజువైంది.

అయినప్పటికీ ఈ సందర్భంగా చేసిన వేతన పెంపుదల అంతా ఒక మాయగా మిగిలింది. అది కనీసం బతకడానికి కూడా సరిపోదు. హర్యానా, ఉత్తర ప్రదేశ్‌లలో కార్మికులకు ఢిల్లీతో పోలిస్తే చాలా తక్కువగా వేతనాలు పెంచారు, కానీ రెండు ప్రాంతాల్లో జీవన వ్యయాలు మాత్రం సమానమే. ధరలు విపరీతంగా పెరిగిపోతున్న తరుణంలో నెలకు 26,000 రూపాయల వేతనం ఇవ్వాలనడం కేవలం డిమాండు కాదు, అది అవసరం.

కార్మికుల్లో మెజారిటీగా ఉన్న కాంట్రాక్టు కార్మికులపై సాగుతున్న అతిహేయమైన దోపిడీ ఈ మొత్తం ఆందోళనకు మూలకారణం. కాంట్రాక్టు కార్మికులకు నెలకు 10 వేల నుండి 12 వేల రూపాయలు వేతనం ఇస్తూ 10 నుండి 13 గంటలు పనిచేయించుకుంటున్నారు. డబుల్ ఓవర్‌టైమ్ అలవెన్సు ఇవ్వడం లేదు.

# నొయిడా నోట్స్

**సిపి చంద్రశేఖర్**



రచయిత ప్రముఖ ఆర్థిక వేత్త. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలోని సెంటర్ ఫర్ ఎకనామిక్ స్టడీస్ అండ్ ప్లానింగ్ విభాగంలో మూడు దశాబ్దాలు ప్రొఫెసర్‌గా పనిచేశారు.

**2026** ఏప్రిల్ 13న న్యూ ఢిల్లీకి ఆనుకుని ఉన్న ఉత్తర ప్రదేశ్‌లోని నొయిడాలో కార్మికులు పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చారు. తక్కువ వేతనాలు, దారుణమైన పని పరిస్థితులకు నిరసన వ్యక్తం చేశారు. ఆ తరువాత జరిగిందంతా కొంత అస్పష్టంగా ఉంది. ఎటువంటి కవ్వింపు లేకుండా పోలీసులు తమపై దాడి చేశారని నిరసన కారులు చెబుతుండగా నిరసన కారులు హింసాకాండకు దిగడంతో తాము చర్య తీసుకోవాల్సి వచ్చిందని పోలీసులు ఆరోపించారు.

ఇక్కడ గమనించ దగ్గ విషయం ఏమంటే, హర్యానాలో చాలా తక్కువ వేతనాలు పెంచినందుకు నిరసనగా కార్మికులు చేపట్టిన ఆందోళన తరువాత నొయిడాలో ఆందోళనలకు దారితీసింది. నొయిడాలో తొలత అనేక ఫ్యాక్టరీలకు చెందిన కార్మికులు నిరసనలో పాల్గన్నారు. వీరంతా సోషల్ మీడియా ద్వారా ఒకరికొకరు సమన్వయం చేసుకుని ఆందోళనలో పాల్గన్నారు. అది త్వరలోనే అసలు సంబంధం లేని పారిశ్రామిక క్లస్టర్లకు పాకింది. అతి తక్కువ వేతనాలు తీసుకోవడమే కాక, యజమానుల వేధింపులకు గురవుతున్న ఇంటి పనివారు కూడా ఆందోళనలోకి దిగారు. కార్మికుల్లో అసంతృప్తి ఎంత లోతుగా, ఎంత విస్తృతంగా గూడుకట్టుకుని ఉందో ఈ ఆందోళనలు తెలియజేశాయి.

కార్మికులు కోర్కె చాలా న్యాయమైంది. చాలా మందికి కేవలం నెలకు రూ. 10 వేల నుడి 11 వేలు ఇస్తూ 12 గంటలు పనిచేయించుకుంటున్నారు. కాంట్రాక్టు కార్మికులను ఏజెంట్ల ద్వారా నియమిస్తారు. అందువల్ల వారిలో చాలా మందికి భద్రత ఉండదు. ఎన్నాళ్లు ఉద్యోగం ఉంటుందో తెలియదు. సామాజిక భద్రతా సదుపాయాలుండవు. చివరికి వారికి ఇవ్వాల్సిన సదుపాయాలను కూడా యజమానులు నేరుగా చెల్లించరు. ఓవర్ టైమ్ చేసిన వారికి రెట్టింపు వేతనం ఇవ్వాలన్న నిబంధనకూడా పాటించడం లేదు. పని ప్రదేశంలో చాలా హీనంగా చూడబడుతున్న

వారాంతపు విశ్రాంతి లేదు. ఇఎస్ఐ, పిఎఫ్, బోనస్‌లు లేవు. ఉద్యోగ భద్రత కాదుగదా కనీస భద్రత కూడా లేదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు వాళ్లను వీధుల్లోకి విసిరేస్తారు. శాశ్వత కార్మికులతో సమానంగా పరిగణించాలన్న సూత్రాన్ని ఒక పద్ధతి ప్రకారం నిరాకరించారు. ప్రభుత్వం గొప్పగా చెప్పిన లేబర్ కోడ్‌లు కార్మికులపై దోపిడీని చట్టబద్ధం చేసే సాధనాలని పూర్తిగా వెల్లడైంది. వీటి వల్ల పని గంటలు పెరిగాయి, హక్కులు కొరవడ్డాయి, కాంట్రాక్టీకరణ సంస్థాగతమయింది.

> “ యుద్ధం వల్ల ప్రపంచ వ్యాపితంగా పెరిగిన ధరలు సంక్షోభాన్ని మరింత పెంచాయి. ఎల్‌పిజి గ్యాస్ ధర కిలో రూ. 70 నుండి ఒక్క సారిగా బ్లాక్ మార్కెట్‌లో రూ. 400-600 వరకు పెరిగిపోయింది. ఆహారం, నిత్యావసర సరుకుల ధరలు కూడా బాగా పెరిగాయి. కార్మికులు, ముఖ్యంగా వలస కార్మికులు ఆకలి మంటల్లోకి నెట్టబడ్డారు. ”

యుద్ధం వల్ల ప్రపంచ వ్యాపితంగా పెరిగిన ధరలు సంక్షోభాన్ని మరింత పెంచాయి. ఎల్‌పిజి గ్యాస్ ధర కిలో రూ. 70 నుండి ఒక్క సారిగా బ్లాక్ మార్కెట్‌లో రూ. 400–600 వరకు పెరిగిపోయింది. ఆహారం, నిత్యావసర సరుకుల ధరలు కూడా బాగా పెరిగాయి. కార్మికులు, ముఖ్యంగా వలస కార్మికులు ఆకలి మంటల్లోకి నెట్టబడ్డారు.

బిజెపి ప్రభుత్వాలు ఈ వాస్తవ పరిస్థితులను గ్రహించి పరిష్కరించాల్సింది పోయి అణచివేతకూ, కక్షసాధింపులకూ దిగాయి. ఈ సందర్భంగా 300 నుండి 400 మంది కార్మికులను అరెస్టు చేశారు. పోలీసులు కార్మికుల ఇళ్ల మీద, వారి గ్రామాల మీద దాడులకు దిగారు. వారి కుటుంబాలను



నొయిడా ఎన్‌సిఆర్ లో నిరసన తెలుపుతున్న కార్మికులపై లాఠీచార్జి చేస్తున్న పోలీసులు

కార్మికులు వాష్‌రూమ్‌కు వెళ్లాలన్నా కష్టసాధ్యమైపోతుంది. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయిల్ యుద్ధం లాంటి కొత్త షాక్‌లు తగిలినప్పుడల్లా వారి బ్రతుకు భరించలేకుండా పోతుంది. పని ప్రదేశంలోని హింసా కాండ వీధుల్లో హింసకు దారితీస్తోంది.

కార్మికుల కోపానికి మరో కారణం, వారి జీవితాలకూ యజమానులు, కొంతమంది మేనేజర్ల జీవితాలకూ మధ్య కనిపిస్తున్న విపరీతమైన వ్యత్యాసం. నయాఉదారవాద భారత దేశంలోని ఈ కొత్త ప్రాంతాల్లో కొత్త వ్యాపారాలను కొత్త కొత్త పద్ధతుల్లో సాగిస్తూ యజమానులు విపరీతంగా గడిస్తున్నారు. ఈ ప్రాంతాలలో నైపుణ్యం లేనిలేదా “తక్కువ విలువైన” నైపుణ్యాలు గల కార్మికులను పనిలో పెట్టుకుని పారిశ్రామిక యూనిట్లు అభివృద్ధి చెందాయి. ఈ యూనిట్లు విజయం సాధించాయంటే చాలు కార్మికుల తక్కువ వేతనాలు, భరించలేని పనిపరిస్థితుల వల్ల విపరీతమైన లాభాలు వస్తున్నాయి. దేశంలో నెలకొన్ని తీవ్రమైన నిరుద్యోగం, తక్కువ విద్యార్హతలు వీటికి తోడు కనీసం యజమానులు, మేనేజర్లు చేస్తున్న ఉల్లంఘనలను గుర్తించడానికి కూడా సిద్ధపడని చట్టాలు...వీటన్నిటి పర్యవసానంగా కార్మికులపై దోపిడీ యథేచ్ఛగా సాగిపోతున్నది.

దీనికి తోడు కనీస వేతనాలను ఎప్పటికప్పుడు పెంచుతూ కార్మికుల వేతనాలు పెరగడానికి తోడ్పడాల్సిన రాజ్యం ఆ విషయంలో విఫలమయింది. నిర్వచనం ప్రకారం కనీస వేతనం అంటే వినయోగదారీ ధరల సూచీతో లింకయి, ద్రవ్యోల్బణాన్ని బట్టి సర్దుబాటు చేస్తూ ఒక కార్మిక కుటుంబం బ్రతకడానికి అవసరమైన వేతనం అయివుండాలి. అయిదేళ్ల కొకసారి కనీస వేతనం ధరలకు, జీవన వ్యయానికి అనుగుణంగా పెంచుతూ ఉండాలి. కానీ హర్యానా, ఉత్తర ప్రదేశ్‌లో కనీస వేతనం పెంచి దశాబ్దం దాటిపోయింది. ప్రభుత్వం, ప్రయివేటు యజమానులు గాఢంగా కమ్మక్కవడం వల్ల ఇలా జరుగుతోంది.

ఫ్యాక్టరీ యజమానుల కొమ్ముకాస్తూ కార్మికుల అసమ్మతిని అణచివేసే, ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలను నీరుగార్చే నిరంకుశ ప్రభుత్వ యంత్రాంగం వల్ల ఎలాంటి లాభం లేదు. తమ కోర్కెలను నిరంతరాయంగా వింటూ, పరిష్కరిస్తూ పోయే యంత్రాంగం లేని పరిస్థితుల్లో కార్మికుల్లో పేరుకుపోయిన ఆగ్రహం “తిరుగుబాటు” రూపంలో బయటకు రావడం మినహా మరో మార్గం ఉండదు.

2012లో జాతీయ రాజధాని ప్రాంతంలోని మరో సబర్బన్ ప్రాంతమైన మనేసర్‌లో మారుతీ సుజికీ కార్ల కంపెనీలో ఇలాగే కార్మికుల హింసాత్మక నిరసనలు మానవ వనరులు మేనేజర్ మృతికి దారితీశాయి. అప్పుడు కూడా కార్మికుల పక్షాన న్యాయమైన డిమాండు ఉంది. రాజ్యం అణచివేతకు దిగింది. యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. కార్మికులు నిరసనలు తెలిపితే ఏమవుతుందో రుచిచూపించాలనుకుంది. 500 మందికి పైగా శాశ్వత కార్మికులు, 2,000 మందికి పైగా కాంట్రాక్టు కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించారు. వారిలో చాలా మంది నిరసనల్లో పాల్గన్నారో లేదో పోలీసులు కూడా గుర్తించలేకపోయారు. ఇవ్వాల్టికీ ఆ

**" అనేక సంవత్సరాలుగా వేతన సవరణ చేయక పోవడం, కనీస వేతనాలను పెంచకపోవడం, ఉత్తర ప్రదేశ్‌లోనైతే 2014 నుండి పెంచకపోవడం, పెరుగుతున్న ధరలు, జాతీయ రాజధాని ప్రాంతంలో ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలను ఒక పద్ధతి ప్రకారం అణచివేయడం.... మొదలైన కారణాల వల్ల కార్మికుల్లో ఈ ఆకస్మిక తిరుగుబాటు వచ్చింది. "**

భయభ్రాంతులను చేశారు. నొయిడా సిఐటియు నాయకులతో సహా అనేక మంది ట్రేడ్ యూనియన్ నాయకులను అక్రమంగా నిర్బంధించారు. మహిళా కార్మికుల మీద కూడా దారుణంగా దాడి చేశారు. వారికి న్యాయ సహాయాన్ని కూడా నిరాకరించారు. మరోవంక ఈ ఉద్యమం బయటి నుండి ప్రోత్స హించ బడిందనీ, దేశ వ్యతిరేకమైనదనీ దుష్ప్రచారం ప్రారంభించారు. కార్మికుల సమ్మెపై వ్యతిరేకత పెంచడానికి ఈ చర్యలకు పాల్పడ్డారు.

అనేక సంవత్సరాలుగా వేతన సవరణ చేయకపోవడం, కనీస వేతనాలను పెంచకపోవడం, ఉత్తర ప్రదేశ్‌లోనైతే 2014 నుండి పెంచకపోవడం, పెరుగుతున్న ధరలు, జాతీయ రాజధాని ప్రాంతంలో ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలను ఒక పద్ధతి ప్రకారం అణచివేయడం....మొదలైన కారణాల వల్ల కార్మికుల్లో ఈ ఆకస్మిక తిరుగుబాటు వచ్చింది.

పోరాడుతున్న కార్మికుల పక్షాన సిఐటియు గట్టిగా నిలబడుతుంది. అరెస్టు చేయబడిన కార్మికులు, కార్యకర్తలను తక్షణం బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తోంది. అన్ని రకాల తప్పుడు కేసులు ఎత్తివేయాలనీ, అణచివేతకు అంతం పలకాలనీ, అక్రమ నిర్బంధాలను ఎత్తివేయాలని కోరుతోంది. ట్రేడ్ యూనియన్లతో వెంటనే త్రైపాక్షిక చర్చలు జరపాలనీ, తక్షణమే భారత లేబర్ కాన్ఫరెన్స్ నిర్వహించాలనీ, అన్ని రకాల చట్టపరమైన లబ్దిలతోపాటుగా 26,000 రూపాయల కనీస వేతనం అమలు చేయాలనీ, రోజుకు 8 గంటల పనిదినం, డబుల్ ఓవర్‌టైమ్ అలవెన్సులు ఇవ్వాలనీ, పని ప్రదేశంలో భద్రత, కాంట్రాక్టు కార్మికులకు సమానంగా పరిగణించాలనీ, వంట గ్యాసు కొనదగ్గ ధరల్లో సరఫరా చేయాలనీ, రెగ్యులరైజేషన్ ద్వారా కాంట్రాక్టు లేబర్ వ్యవస్థను రద్దు చేయాలని కూడా సిఐటియు డిమాండ్ చేస్తోంది.

క్రింది స్థాయి నుండి వస్తున్న సంకేతం చాలా స్పష్టంగా ఉంది: అణచివేతతో కార్మికవర్గాన్ని ముక్కలు చేయలేరు. వాస్తవానికి అది వారి ప్రతిఘటనా శక్తిని మరింత పెంచుతుంది. ఇటీవలి ఆందోళనల్లో వ్యక్తమవుతున్న ఐక్యత, బలం వల్ల ఇప్పటికే కొన్ని రాయితీలు పొందారు. రానున్న కాలంలో దేశవ్యాపితంగా చేసే కార్యక్రమంతో ఈ సవాలు మరింత తీవ్రమవుతుంది.

**కాంట్రాక్టు లేబర్ దోపిడీ నశించాలి!**
**కార్మిక వ్యతిరేక విధానాలను ఓడించండి!!**
**అణచివేతను ప్రతిఘటించండి-కార్మిక హక్కులను రక్షించుకోండి!!**

*

కార్మికులు తిరిగి ఉద్యోగాల్లోకి చేర్చుకోవాలనీ, నష్ట పరిహారం ఇవ్వాలనీ నిరసన కార్యక్రమాలు చేస్తూనే ఉన్నారు. కానీ వినేనాధుడే లేడు.

**నెపం వేరొకరిపై నెట్టేస్తున్నారు**

నొయిడాలో ఇటీవల కార్మికులు చేసిన నిరసనకు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ ప్రతిస్పందన దారుణంగా ఉంది. కార్మికులపై దోపిడీ జరుగుతున్నదని ప్రభుత్వం ఒకవైపు ఒప్పుకుంటూ రాష్ట్రానికి చెందిన కార్మికుల కనీస వేతనాలను 21 శాతం పెంచింది. కార్మికుల డిమాండ్ చేస్తున్నదానికన్నా ఇది చాలా తక్కువ. అదే సమయంలో కార్మికుల జీవన పరిస్థితుల మెరుగుదలకు చర్యలు తీసుకుంటామని చెబుతున్నది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ పేరు చెడగొట్టడానికి పూనుకున్న "బయటి వారి" కుట్ర వల్ల ఈ నిరసన ప్రదర్శనలు జరిగాయని చెబుతున్నది.

''ఈ పారిశ్రామిక వివాదంలో భాగాస్వాములతో చర్చించి, పారిశ్రామిక సామరస్యాన్ని, శాంతి భద్రతలను కాపాడే లక్ష్యంతో ఒక ఉన్నత స్థాయి కమిటీని" ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లా అధికారులు 203 మంది కాంట్రాక్టర్ల లైసెన్సులు రద్దు చేయడమో, బ్లాక్ లిస్ట్‌లో పెట్టడమో చేస్తామని హెచ్చరించారు. రూ. కోటి కన్నా ఎక్కువ మొత్తంలో బకాయిలు ఉన్న కాంట్రాక్టర్లు వెంటనే చెల్లించాలని కోరారు. వ్యవస్థ తప్పు కాదు, తప్పంతా కాంట్రాక్టర్లదే అని చెప్పడం కోసమే ఈ డ్రామా అంతా.

ఇదిలాఉండగా, "ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం" రాష్ట్రంలో "శాంతి, అభివృద్ధి వాతావరణాన్ని సృష్టిస్తుంటే సహించలేని కొన్ని శక్తులు కుట్రలకు పాల్పడుతున్నాయి'' అని ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆధిత్యనాథ్ ఆక్రోశం వెళ్లగక్కారు. "బయటి శక్తుల కవ్వింపు" వల్లనే నిరసనలు తలెత్తాయని యుపి డిజిపి ఆరోపించారు. "తమ ప్రభుత్వం కార్మికుల పక్షాన ఉంటుంది" అని యోగి పేర్కొంటూ ప్రతి కార్మికునికీ భద్రత కల్పిస్తామనీ, వారికి సరైన పరిహారం ఇస్తామని హామీలు ఇచ్చారు. అయితే పాత అనుభవాలు ఉన్న కార్మికులు ఈ హామీలను నమ్మడం లేదు.

పాత అనుభవాలను బట్టి చూస్తే అరెస్టు చేసిన కార్మికులను ఇప్పుడిప్పుడే విడుదల చేసేట్లు లేరు. వారికి ఉద్యోగాలు కూడా ఇవ్వబోరు. కానీ యజమానులు, కాంట్రాక్టర్లు మాత్రం శిక్ష లేకుండా తప్పించుకుంటారు.

నయాఉదారవాద విధానల క్రింద విదేశీ పెట్టుబడి ధారాళంగా దేశంలోకి వచ్చే సమయంలో రాజ్యం, ప్రయివేటు పెట్టుబడి మిలాఖత్ అయి కార్మికుల జీవన ప్రమాణాలనూ, వేతనాలనూ, తగ్గించేసి పని పరిస్థితులను హీనం చేసి లాభాలు దండిగా గడిస్తాయని మనకు ఆధారాలు చెబుతున్నాయి. ఆర్థిక ఎదుగుదల కాస్తా వెనుకపట్టుపట్టే పరిస్థితి వస్తుందనేందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. ఎదుగుదల సందర్భంగా లాభాలు గడించడానికి ఏర్పాటు చేసుకున్న దోపిడీ యంత్రాంగాన్ని కొనసాగించే క్రమంలో తిరోగమనం సందర్భంగా ఫ్యాక్టరీల్లోనూ, బయట వీధుల్లోనూ హింస కొనసాగడం తప్పని సరి.

*

**మీడియా వాచ్**

# మహిళా రిజర్వేషన్ బిల్లా? లేక బిజెపి పరిరక్షణ బిల్లా?

## మీడియా ఆ విషయం చెప్పదు

**పమేలా ఫిలిపోస్**



రచయిత ఓ భారతీయ పాత్రికేయురాలు, పరిశోధకురాలు. ఈమె ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్‌లో సీనియర్ ఫెలోగా ఉన్నారు.

అధికార పార్టీ తాజా చేష్టలు చూసినవారికెవరికైనా స్త్రీవాద ముసుగు తొడుక్కున్న తోడేళ్ళు చటుక్కున గుర్తుకొస్తాయి. ఇంతకన్నా సరైన ఉపమానం ఇంకొకటి ఉండదేమో! తమ జీవితంలో మహిళల హక్కుల గురించి కానీ, లింగ సమానత్వం గురించి కానీ కనీసం కలలో కూడా తలవని వారు, అకస్మాత్తుగా "నారీ వందన్", "షీ–శక్తి" గురించి అరిగిపోయిన రికార్డులా నీతి వాక్యాలు వల్లెవేస్తున్నారు.

కర్ణాటకకు చెందిన బిజెపి నాయకుడు తేజస్వి సూర్య, పార్లమెంటులో మాట్లాడుతూ, 2023 మహిళా రిజర్వేషన్ చట్టానికి చేసిన సవరణను (నారీ శక్తి వందన్ అధినియమ్) ఎంతో తెలివైన పరిష్కారంగా అభివర్ణించారు. ఆయన వ్యాకరణ దోషాలను మనం క్షమించవచ్చు, కానీ రన్‌వేపై ఉన్న విమానం అత్యవసర ద్వారాన్ని తెరవడానికి ప్రయత్నించిన ఈ ప్రబుద్ధుడు ఇంతకు ముందు లింగ సమానత్వం గురించి ఒక్కసారైనా ఆలోచించారా?

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ "మీరు మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకమా?" అంటూ ప్రతిపక్ష నాయకులపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. అలాగే, లింగ "సాధికారత" గురించి ఎలాంటి లోతైన అవగాహన లేని బిజెపి అధికార ప్రతినిధి ఆర్‌పి సింగ్ మరో అడుగు ముందుకేసి భారతదేశ మహిళలను ప్రతిపక్షాలు నిరాశపరిచాయని నిందించారు.

ఈ రెండు రోజుల ప్రత్యేక పార్లమెంటరీ సమావేశానికి ముందు ఏకాభిప్రాయం కోసం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్న కనీస స్పృహ కూడా లేని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, ''పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ లభించేలా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత" అని మహా గొప్పగా సెలవిచ్చారు.

ఇక దేశంలో మహిళా సంక్షేమానికి ముఖ్య సంరక్షకుడిగా తనకుతాను కిరీటం తగిలించుకున్న ప్రధానమంత్రి విషయానికొస్తే, ఆయన లోక్‌సభలో చేసిన ప్రసంగంలో, దేశంలోని మహిళలు 'మన ఉద్దేశాలను గమనిస్తున్నారు' అని ప్రతిపక్షాన్ని హెచ్చరించారు. ఆయన మరుసటి రోజు చేసిన ఒక ట్వీట్‌లో అదే విషయాన్ని పునరుద్ఘాటించారు:

"మన నారీశక్తి తరపున, దేశవ్యాప్తంగా ఉన్న మహిళల మనోభావాలను దెబ్బతీసే ఏ పనీ చేయవద్దని నేను సభ్యులందరినీ కోరుతున్నాను. కోట్లాది మంది మహిళలు మనల్ని... మన ఉద్దేశాలను, మన నిర్ణయాలను గమనిస్తున్నారు. నారీశక్తి వందన అధినియమ్‌కు చేసే సవరణలకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని నేను మరోసారి కోరుతున్నాను" అంటూ ఆ ట్వీట్‌లో ముక్తాయించారు.

టెలివిజన్ ఛానెళ్లు ఈ కథనాన్ని మహదానందంగా స్వీకరించాయి. ఒకవేళ 'టైమ్స్ నౌ' మహిళల కోసం ఏమైనా టెలివిజన్ సమయాన్ని వృథా చేసిందీ అంటే, అది 'పవర్ ఉమెన్' గురించే. గత ఏడాది ఆ చానెల్ నిర్వహించిన 'శిఖరాగ్ర సమావేశం' (సమ్మిట్)లో కేవలం "ప్రభావశీల భారతీయ మహిళల"కు మాత్రమే చోటు కల్పించింది. కానీ, 'నారీ శక్తి వందన్ అధినియం' సాధారణ మహిళలను కూడా పరిగణనలోకి తీసుకుంటుందని మోడీ ప్రభుత్వం ఒక్కసారిగా ప్లేటు మార్చగానే ఆ ఛానెల్ కథనంలో ఒక అద్భుతమైన మార్పు చోటుచేసుకుంది. 'నారీ శక్తి... మహిళలు నాయకత్వం వహిస్తే, దేశాలు ఉన్నతి సాధిస్తాయి' 'భారత్ కోసం స్త్రీ శక్తి' 'చారిత్రాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లు' వంటి శీర్షికలతో ప్రచారం హోరెత్తించాయి.

నిజానికి, దేశంలోని ప్రతి టెలివిజన్ ఛానెల్ బిజెపి స్త్రీవాదాన్ని విస్తృతంగా ప్రచారం చేయడానికి ఒకదానితో ఒకటి పోటీ పడ్డాయి. మహిళల పట్ల అధికార పార్టీకి ఉన్న అంతులేని భక్తికి  నిదర్శనంగా, తమ వాదనను బలంగా వినిపించడానికి 'లక్షాధికారి దీదీ', 'బేటీ బచావో, బేటీ పఢావో' వంటి ప్రభుత్వ కార్యక్రమాల గురించి పెద్దయెత్తున ఊదరగొట్టాయి.

అయితే, 'లక్షాధికారి దీదీ' అనేది కొత్త సీసాలో పాత సారా లాంటిదే. 'డ్రోన్ దీదీ' కార్యక్రమం అసలు ప్రారంభమే కాలేదు.; ముద్రా యోజన కేవలం ఉన్నత స్థానాల్లో ఉన్నవారితో మంచి పరిచయాలున్న ''మహిళా పారిశ్రామికవేత్తల"కు ప్రయోజనం చేకూర్చడానికి ఉద్దేశించబడిందే. ఇక 'బేటీ బచావో బేటీ పఢావో' విషయానికొస్తే, అది కేవలం ట్రక్కులు, ఆటోరిక్షాల వెనుక రాసే ఒక నినాదంగా మారిపోయిందని చెప్పడం మరిచిపోయాయి.

వాస్తవమేమిటంటే, ముఖ్యంగా హిందీ ప్రాబల్యం ఉన్న ప్రాంతాలలో బాలికలపై నేరాలు విపరీతంగా పెరిగిపోయాయి. 2018లో కతువాలో ఎనిమిదేళ్ల బాలికపై జరిగిన సామూహిక అత్యాచారం కావచ్చు, లేదా 2020లో ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో తన గ్రామంలో 19 ఏళ్ల దళిత మహిళపై ఠాకూర్లు సాగించిన హత్యాచారం కావచ్చు, యువతుల ప్రాణాలకు సంబంధించిన దారుణ కథలు ఎన్నో వెలుగులోకి వస్తూనే ఉన్నాయి.

అయితే మన కూతుళ్లు నిజంగా రక్షించబడుతున్నారా? అంటే లేదనే చెప్పాలి. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల 'విద్యా సామర్థ్యాన్ని మెరుగుపరచడం' అనే పేరుతో 27,000 ప్రాథమిక పాఠశాలలను రద్దు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు వార్తలొస్తున్నాయి.. దీనివల్ల 'బేటీ పఢావో' అనే నినాదం ప్రహసనంగా మారుతోంది.

**❝ ప్రధానమంత్రిని విమర్శించడానికి ఈ మీడియా సంస్థలు ఆమడ దూరంలో ఉంటాయి. కనీసం మోడీ హయాంలో భారతదేశంలో మహిళల పరిస్థితి ఎలా ఉందో పరిశీలించే ప్రయత్నమైనా చేసి ఉండాల్సింది. ఆ పని చేయలేదు. నిజానికి మహిళలపై జరిగే మొత్తం నేరాల సంఖ్య మోడీ హయాంలో బాగా పెరిగిపోయింది. 2014లో ప్రతి లక్ష మందికిగాను 56.3 మందిమహిళలపై నేరాలు జరగ్గా, 2022 నాటికి అది 66.4కు పెరిగింది. ❞**

మీడియా గనక తమ పనిని తాము చేసి ఉంటే, మూడు బిల్లులను ఆమోదింపజేసుకోవడం కోసం లింగ సమానత్వం పేరుతో ఆడుతున్న ఈ కపట నాటకాన్ని బట్టబయలు చేసి ఉండాల్సింది. సోనియా గాంధీని 'జెర్సీ ఆవు' అని, సునంద పుష్కర్‌ను శశి థరూర్ '50 కోట్ల గర్ల్‌ఫ్రెండ్' అని పిలవడం వంటి తొలి వ్యాఖ్యల నుండి, మమతా బెనర్జీని పదేపదే "దీదీ ఓ దీదీ" అని పిలుస్తూ ఎగతాళి చేయడం వంటి ఇటీవలి దూషణల వరకు, ప్రధానమంత్రి స్వయంగా చేసిన లెక్కలేనన్ని మహిళా వ్యతిరేక వ్యాఖ్యలను తమ పాఠకులకు, వీక్షకులకు గుర్తుచేసి ఉండాల్సింది.

ప్రధానమంత్రిని విమర్శించడానికి ఈ మీడియా సంస్థలు ఆమడ దూరంలో ఉంటాయి. కనీసం మోడీ హయాంలో భారతదేశంలో మహిళల పరిస్థితి ఎలా ఉందో పరిశీలించే ప్రయత్నమైనా చేసి ఉండాల్సింది. ఆ పని చేయలేదు. నిజానికి మహిళలపై జరిగే మొత్తం నేరాల సంఖ్య మోడీ హయాంలో బాగా పెరిగిపోయింది. 2014లో ప్రతి లక్ష మందికిగాను 56.3 మందిమహిళలపై నేరాలు జరగ్గా, 2022 నాటికి అది 66.4కు పెరిగింది.

అంతటి ఘన చరిత్ర కలిగిన ఒక ప్రభుత్వం, ఇప్పుడు మహిళా సాధికారతకు తామే అధినాయకులమని చెప్పుకోవడాన్ని చూసి మీడియా నవ్వి ఊరుకోవాలి. కానీ దానికి బదులుగా, వారు ప్రభుత్వ ప్రధాన ప్రతినిధి చెప్పే మాటలను పరమ సత్యాలుగా భావించి వాటిని పెద్దయెత్తున ప్రచారం చేయడంలో వారు పోటీపడ్డారు.

అమిత్ షా మాట్లాడుతూ, 'కిల్ బిల్ గ్రూప్'ను నిశ్శేష్టులను చేశాయని (ఎటువంటి ఆధారాలు లేకుండా) అంటే, వాటినే సీఎన్ఎన్ న్యూస్18) ఇంకా ఇతర చానెళ్లు పెద్దయెత్తున ప్రచారంలో పెట్టాయి. వారు మాతృనొక అడుగు భాగానికి అతుక్కుపోయిన పెంకుల్లా అతుక్కుపోయారు. ఒక్క ఈ విషయంలోనే కాదు ప్రతి అంశంపై ప్రభుత్వ వాదననే చిలుకలా వల్లించడమే వీరి పని.

పార్లమెంటులో రెండు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా జరిగిన నాటకీయ పరిణామాల అనంతరం, రాజ్యాంగ (131వ సవరణ బిల్లు) చివరకు వీగిపోయింది. ఇది ప్రతిపక్షం వ్యతిరేకించడం వల్ల కాదు, కానీ ఆ బిల్లును కుయుక్తితో వాడుకుని, కాలం చెల్లిన సమాచారం ఆధారంగా, ఎలాంటి చర్చ లేకుండా దేశవ్యాప్తంగా నియోజకవర్గాల సరిహద్దులను మార్చేందుకు జరుగుతున్న యత్నంలో భాగమైన మరో రెండు బిల్లులను డీలిమిటేషన్ బిల్లు, 2026, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, 2026లను రహస్యంగా దీంతో ముడిపెట్టడానికి యత్నించడమే దీనికి ముఖ్య కారణం.

ఈ అభిప్రాయం కేవలం ప్రతిపక్ష సభ్యులదే కాదు. పార్లమెంటులో ఆ మూడు బిల్లులపై చర్చ జరుగుతున్న సమయంలోనే, అరవై మహిళా సంఘాలు, అనేక పౌర సమాజ సంస్థలు ఒక ప్రకటన చేశాయి. 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజనతో మహిళా రిజర్వేషన్‌ను ముడిపెట్టడాన్ని తాము కచ్చితంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ, మహిళా రిజర్వేషన్ ప్రక్రియను బలోపేతం చేయడానికి తాము కట్టుబడి ఉన్నామని, ఇందులో భాగంగా రాజ్యసభలో కూడా మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించేందుకు కొత్త రాజ్యాంగ బిల్లును తీసుకురావాల్సిన అవసరం ఉందని అవి పేర్కొన్నాయి.

## కార్మికుల సంక్షేమంపై మీడియా మౌనం అశాంతికి దారితీస్తోంది

'వేతన డిమాండ్లు, ఎనిమిది గంటల పనిదినం కోసం 2026 ఫిబ్రవరి-మార్చి నెలల్లో దేశంలో తలెత్తిన ఐచ్ఛిక కార్మిక ఉద్యమాలు విస్తరించాయి. దీని గురించి సంతోష్ అనే ఒక కార్మిక సంఘ నాయకుడు పంపిన సమాచారం ఆధారంగా నెల రోజుల క్రితం ఈ కాలమ్ ప్రచురించడం జరిగింది. అందులో స్పష్టంగా తేలిన విషయం ఏమిటంటే, భారత కార్మిక వర్గంలో అసంతృప్తి క్రమంగా పెరుగుతుండడం. రెండు అంశాలు ఈ ఆగ్రహాన్ని మరింత తీవ్రతరం చేశాయి. ఒకటి, శతాబ్దానికి పైగా కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న సంక్షేమ చర్యలు ఏవైతే ఉన్నాయో వాటిని కాలరాసేలా రూపొందించిన నాలుగు లేబర్ కోడ్లను అమలులోకి తీసుకురావడం; రెండు, ఇరాన్ యుద్ధం. తక్షణం ముందుకొచ్చిన ఈ యుద్ధం జీవన వ్యయాన్ని విపరీతంగా పెంచేసింది.

దీనిని బట్టి చూస్తే, ఈ జంట పరిణామాల వల్ల తీవ్రంగా దెబ్బతినేది మనలో అత్యంత బలహీనులైన కార్మిక వర్గాలే అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ పరిస్థితుల్లో కార్మికుల వాణిని వినిపించాల్సిన మీడియా ఆ బాధ్యతను విస్మరించింది. లేబర్ బీట్‌లను తొలగించేసింది. చాలా కాలంగా కార్మిక సంఘాల కార్యకలాపాలను విస్మరిస్తూ వస్తున్న కార్పొరేట్ మీడియా, పని ప్రదేశాలలో పెరుగుతున్న ఉద్రిక్తతల గురించి కూడా చూడ నిరాకరిస్తోంది.

మొదట పారిశ్రామిక కేంద్రమైన హర్యానాలో, ఆ తర్వాత ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో నిరసనలు చెలరేగినప్పుడు - ఈ రెండు రాష్ట్రాలు డబుల్-ఇంజిన్ రాష్ట్రాలని గమనించాలి - వాటిని కూడా విస్మరించడం తీవ్ర ఆశ్చర్యం కలిగించింది. ప్రధాన కార్మిక నిరసనలు చరిత్ర చెత్తబుట్టలో కలిసిపోయాయని వారు భావించి ఉండొచ్చు.

పెద్దయెత్తున కార్పొరేట్ మయమైన ఈ మీడియా ప్రారంభ కవరేజ్ అంతా, నిరసనల వల్ల కలుగుతున్న ట్రాఫిక్ జామ్‌లు, ఆస్తి నష్టం వంటి ఊహించదగిన అంశాల గురించే ఉంది. ఆ తర్వాత, వామపక్ష "దేశద్రోహులు" తమ టూల్ కిట్‌ను ఉపయోగించి ఈ అశాంతిని రెచ్చగొడుతున్నారంటూ ఈ మీడియా దూషణలకు దిగింది.

ఆ తర్వాతే మరింత లోతైన, వివరమైన నివేదికలు వెలుగులోకి వచ్చాయి. ఉత్తరప్రదేశ్‌లోని కార్మికులు సగటున నెలకు రూ. 12,000 సంపాదిస్తున్నప్పటికీ, కేవలం అద్దె కోసమే రూ. 4,000 అంతకంటే ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తోందని; వేతనాలను అత్యల్ప స్థాయిలోనే ఉంచడానికి రాజకీయ వ్యవస్థ పెద్ద కార్పొరేట్ సంస్థలతో చేతులు కలిపి

(మిగతా 16వ పేజీలో)

# భారతదేశపు తరగతిగదుల విరాట్ కథనం

మెర్లియా షౌకత్



వ్యాసకర్త చెన్నై కేంద్రంగా నడిచే 'మాథి ఫౌండేషన్' అనే ప్రభుత్వేతర సంస్థ సి.ఇ.ఓ. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలలో పట్టభద్రురాలు

మీరు దేశంలో ఏ ఊర్లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో అయినా అడుగుపెట్టి చూడండి. తరగతి గదిలో ఒకటి నుండి ఐదో తరగతి వరకూ చదివే పిల్లలందరూ ఉంటారు. వాళ్ళకి పాఠాలు చెప్పేందుకు ఒకే ఒక ఉపాధ్యాయుడు కనిపిస్తాడు. ఇదేదో అరుదైన దృశ్యం కాదు. ఇది సర్వసాధారణ నియమంగా మారిపోయింది. దేశంలోని ప్రాథమిక పాఠశాలల్లో 40 నుండి 90 శాతం వరకు ఇదే వరుస. ఒకే తరగతి గదిలో ఒకటి నుండి ఐదవ క్లాసు వరకు చదువుకునే పిల్లలు ఉండడం మనకు తటస్థపడుతుంది. ఈ క్షేత్రస్థాయి వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకుని కదా విద్యా ప్రణాళికలు, పాఠ్యాంశాలు, పాఠశాల అభివృద్ధి పథకాలకు రూపకల్పన చెయ్యాల్సింది.

ఒకే తరగతి గదిలో వివిధక్లాసుల విద్యార్థులకు పాఠాలు నేర్పాల్సి రావడం మన దేశ విద్యారంగ అభివృద్ధికి పెద్ద గుదిబండగా మారింది. ఈ సంస్థాగత లోపాన్ని అసలు లోపంగా పరిగణించక పోవడమే మన వ్యవస్థకు పట్టిన శాపం. ఈ లోటుపాట్లను గుర్తించడమంటే మన ప్రభుత్వాల అసమర్థతను బయట వేసుకోవడం అవుతుంది. అందుకే ఉపాధ్యాయుల కొరత, పాఠ్యాంశాల క్రమబద్ధీకరణ, రొట్టకొట్టుడు బోధనా పద్ధతులు వంటి సమస్యలు కొనసాగుతూ ఉన్నాయి. మన విద్యావ్యవస్థను సంపూర్ణంగా పునర్ నవీకరించుకోవాల్సిన సమయం ఇది. అది వదిలేసి పైపై మెరుగులు దిద్దే అతుకుల బొంత వంటి సర్దుబాటు చర్యలు చేపట్టడం మూలంగా ప్రయోజనం ఉండదు. క్షేత్రస్థాయి వాస్తవాలకు, విద్యాభివృద్ధి ప్రణాళికల మధ్య ఉన్న అంతరాన్ని అధిగమించడానికి ఉపాధ్యాయులు ఏం సూపర్‌మాన్‌లు, సూపర్‌ఉమెన్‌లు కాదు.

### మల్టీగ్రేడ్, మల్టీ లెవల్ టీచింగ్ అంటే ఏమిటి?

విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడం, లేక ఉపాధ్యాయుల కొరత ఉండడం మూలంగా వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు అందరినీ ఒకే క్లాసులో కూర్చోబెట్టి పాఠాలు చెప్పల్సి రావడాన్ని మల్టీగ్రేడ్, మల్టీ లెవెల్ టీచింగ్ అంటారు. గ్రామీణ ప్రాంతాల్లో, మారుమూల ప్రాంతాల్లో ఈ సమస్య అధికాధికంగా ఉంది. అన్ని రాష్ట్రాలలో ఈ సమస్య నెలకొని ఉన్నది.

కథ ఇక్కడితో అయిపోలేదు. వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు అందరూ ఒకే క్లాసులో ఉన్నందున ఏ మూడవ తరగతి విద్యార్థో ఒకటవ తరగతి పాఠం చదువుతా ఉండొచ్చు, రెండవ తరగతి లెక్కలు చేస్తుండవచ్చు. ఒక తరగతి గదిలో 30–40 మంది విద్యార్థులు ఉంటే ఎవరెవరు ఏ తరగతికి చెందినవారో, ఏ తరగతి విద్యార్థులు ఆ తరగతి పాఠ్యపుస్తకాలనే అభ్యసిస్తున్నారో లేదో సరి చూడడం ఉన్న ఒకే ఒక్క ఉపాధ్యాయుడితో అయ్యే పనేనా? అలాంటి తరగతి గదిలో పిల్లలకు విద్యార్జన సక్రమంగా జరిగేనా?

దీనికి తోడు పాఠ్యపుస్తకాలకు సంబంధించి మరో కీలక సమస్య ఎదురవుతుంది. అటు నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (యన్.సి.ఇ.ఆర్.టి), ఇటు స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (యస్.సి.ఇ.ఆర్.టి)లు రెండూ పాఠ్య పుస్తకాల రూపకల్పనలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. క్షేత్ర స్థాయిలో నెలకొని ఉన్న మల్టీగ్రేడ్– మల్టీలెవల్ టీచింగ్ అనేది ఈ రెండు సంస్థల దృష్టిలో లేనే లేవు. పాఠ్యపుస్తకాలు అన్నీ ఏ తరగతికి చెందినవి ఆ తరగతిగా విభజించి ముద్రిస్తారు. ఏకోపాధ్యాయ పాఠశాలలకు ప్రత్యేకించి సిలబస్ రూపొందించాలన్న స్పృహ ఈ రెండు సంస్థలకూ లేదు.

మల్టీగ్రేడ్ తరగతులకు సంబంధించి ప్రత్యేకంగా పాఠ్యపుస్తకాలు రూపొందించడం ద్వారా ఉపాధ్యాయుడికి ఏ తరగతి విద్యార్థికి ఏ పాఠం ఎంతసేపు చెప్పవచ్చు అనేది నిర్ణయించుకోవడానికి వెసులుబాటు ఉంటుంది. ఒక క్లాసులో ఒకటి నుండి ఐదవ తరగతి వరకూ చదివే పిల్లలు ఉన్నారనుకుంటే ఏ క్లాసుకి ఆ క్లాసు పాఠ్యపుస్తకంలోని పాఠాలు నేర్పించడం ఏకోపాధ్యాయులకు సాధ్యపడే అంశం కాదు.

### యాక్టివిటీ బేస్ట్ లెర్నింగ్

తమిళనాడులోని తిరువళ్ళూరు జిల్లాలోని ఒక పంచాయితీ పాఠశాలలో ఈ ప్రక్రియ ఎలా సాగుతుందో 2022 జూన్‌లో పరిశీలించాం. వాస్తవానికి ఈ విధానం యొక్క ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థి స్వయం శిక్షణ అలవరుచుకోవడం. అయినప్పటికీ పాఠ్యపుస్తకంలో సిలబస్ పూర్తి చెయ్యడంలో విద్యార్థి, ఉపాధ్యాయుడు – ఇద్దరి శక్తి హరించుకుపోతుంది.

దీనికి తోడు పాఠ్యపుస్తకాలను రూపకర్తలు పాఠ్యాంశాలలో తమ సాంకేతిక పాండిత్యం అంతా దట్టించి 'అద్భుతం' అని భుజం తట్టించుకోవడం మీదనే దృష్టి పెట్టారు తప్పించి తరగతిగదిలో ఆచరణ సాధ్యమైన సాధనంగా మలచడంలో విఫలమయ్యారు అందుకే ఒక ఉపాధ్యాయుడు – 'ఈ పాఠ్య పుస్తకాలను ఎవర్ని దృష్టిలో పెట్టుకుని రూపొందించారో చెప్తారా? రచయితలు తమ పాండిత్య ప్రకర్షను చాటి చెప్పుకోవడానికా లేక ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఉపయోగకరంగా, సహాయకారిగా ఉండడానికా – నాకేం అర్థం కావడం లేదూ అని నిష్కర్షగా అన్నారు.

ఈ అంతరం కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాలేదు. ఉపాధ్యాయ శిక్షణ వృత్తిలో చేరకముందు, చేరిన తరువాత క్షేత్ర స్థాయిలో ఉన్న మల్టీగ్రేడ్, మల్టీలెవల్ తరగతి గదులను

**“ మన విద్యావ్యవస్థలో ఉన్న అతి పెద్ద లోపం ఏంటంటే ఒక తరగతి గదిలో ఉన్న విద్యార్థులు అందరికీ ఒకే స్థాయిలో నేర్వగలిగే తెలివితేటలు ఉంటాయని అభిప్రాయపడడం. మన పాఠశాలల్లో విద్యార్థులను వాళ్ళ వాళ్ళ వయసులను బట్టి ఒకటో తరతతి నుండి రెండుకి, రెండో తరగతి నుండి మూడుకి - ఇలా చేర్చేస్తుంటాం తప్పితే వాళ్ళు ఏం నేర్చుకున్నారు, ఎంత నేర్చుకున్నారు అన్నది ప్రాతిపదికగా తీసుకోం. ”**

ఎలా సంభాళించుకు రావాలనే విషయాన్ని పూర్తిగా విస్మరించింది. వివిధ వయసుల, వివిధ బోధనా ఆకళింపు సామర్థ్యాలు కల విద్యార్థులకు ఎలాంటి బోధనా పద్ధతులు అనుసరించాలి అనే విషయమై కనీస అవగాహన కూడా కల్పించడం లేదు. ఇలాంటి తరగతి గదులలో బోధించడానికి తగిన పద్ధతుల రూపకల్పన చెయ్యాలంటే ముందు వాటి మదింపు అన్నా జరగాలి కదా ఇంతవరకు అదీ చేపట్టలేదు.

పర్యవసానంగా ఉపాధ్యాయులు ఎవరి శక్తి మేరకు వాళ్ళ తిప్పలు వాళ్ళు పడుతున్నారు. తరగతి గదిలో బోధించడానికి తమకు కల్పించే ఉపాధ్యాయ శిక్షణ ఏ మాత్రం సహాయకారిగా లేదన్న నిస్పృహకు లోనవుతున్నారు. ఈ శిక్షణ ద్వారా వారికి అందించే ఉపకరణాలు తరగతి గదిలో రోజువారీ బోధనకు ఏ మాత్రం దోహదకారిగా లేవు అన్న సత్యాన్ని విస్మరించి వాటిని వినియోగించడంలో ఉపాధ్యాయులు ఏ మేరకు సఫలమయ్యారు, విఫలమయ్యారు అని లెక్క కట్టి వాళ్ళ పనితీరు మీద తీర్పులు చెబుతున్నారు.

పాఠశాల విద్యా సంస్కరణలలో అగ్రగామిగా ఉన్న తమిళనాడు రాష్ట్రం ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని 2000వ సంవత్సరం లోనే ఎ.బి.యల్ (యాక్టివిటీ బేస్ట్ లెర్నింగ్) విధానాన్ని ప్రవేశ పెట్టింది. తద్వారా ఉపాధ్యాయులు బోధకులుగా కాకుండా విద్యార్థులు స్వీయశిక్షణ అలవరుచుకునేందుకు సహాయకులుగా ఉండేలా వారి పాత్రను మలిచారు. అయితే ఈ విధానంలో కూడా తరగతుల వారీ సిలబస్‌ను పూర్తి చెయ్యాలనే ఒత్తిడి మూలంగా ఇదంతా కంగాళీ వ్యవహారంగా మారింది. ఉపాధ్యాయులనేమో పిల్లల కేంద్రకంగా ఉండే ఆటా పాటా తదితర కార్యకలాపాల ద్వారా శిక్షణ ఇమ్మని అదేశిస్తూనే రెండో పక్కన అలాంటి శిక్షణ గరిపేందుకు ఏ మాత్రం అనువుగా లేని పాఠ్యపుస్తకాలను ముద్రించి ఇచ్చి అందులో సిలబస్ పూర్తి చెయ్యాలని ఒత్తిడి పెడుతున్నారు. ఇవి రెండూ ఒకదానికొకటి పొసగని అంశాలు.

మన విద్యావ్యవస్థలో ఉన్న అతి పెద్ద లోపం ఏంటంటే ఒక తరగతి గదిలో ఉన్న విద్యార్థులు అందరికీ ఒకే స్థాయిలో నేర్వగలిగే తెలివితేటలు ఉంటాయని అభిప్రాయపడడం. మన పాఠశాలల్లో విద్యార్థులను వాళ్ళ వాళ్ళ వయసులను బట్టి ఒకటో తరతతి నుండి రెండుకి, రెండో తరగతి నుండి మూడుకి – ఇలా చేర్చేస్తుంటాం తప్పితే వాళ్ళు ఏం నేర్చుకున్నారు, ఎంత నేర్చుకున్నారు అన్నది ప్రాతిపదికగా తీసుకోం. అందుకే ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులలో 70 శాతం మంది రెండో తరగతి లెక్కలు చెయ్యలేక పోయారంటే మనం ఆశ్చర్యపడాల్సిన అవసరంలేదు.

ఈ సమస్యను అధిగమించడానికి రోజుకి ఒక గంట చొప్పున అదనంగా బోధించే తాత్కాలిక పరిషారాన్ని అమలులోకి తీసుకువచ్చారు. అయితే ఏళ్ళ తరబడిగా పేరుకుపోతూ వచ్చిన విద్యా సముపార్జనా లోపాలలో రోజుకు ఒక గంట అదనంగా బోధించడం నేల విడిచి సాము చెయ్యడమే. ప్రతి తరగతి గదిలో విద్యార్థుల స్థాయిలలో తరతమ భేదాలు ఉంటాయన్న వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకుని అందుకు అనుగుణమైన పద్ధతులను రూపకల్పన చెయ్యడం ద్వారా మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

మాంటిస్సోరి, బక్కాలారేట్ వంటి అంతర్జాతీయ బోధనా పద్ధతులు పై సూత్రాలకు అనుగుణంగా రూపొందించబడ్డాయి. వివిధ వయసుల విద్యార్థుల సమూహం, వ్యక్తిగత బోధన, సిలబస్ పూర్తి చెయ్యడం కన్నా విషయ పరిజ్ఞానం అలవర్చడం ఈ బోధనా పద్ధతులలో కీలకాంశాలుగా ఉన్నాయి. కానీ మన దేశంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ తర్కానికి పూర్తిగా భిన్నమైన పద్ధతులను ఆచరిస్తున్నాం. కాబట్టి నాసిరకం ఫలితాలను చవి చూడాల్సివస్తుంది.

### తమిళనాడు ప్రయోగం

అయినా మనం పూర్తిగా నిరాశ చెందాల్సిన అవసరం లేదు. తమిళనాడు ప్రభుత్వం 'ఎన్నుమ్ ఎళుతుమ్ మిషన్' పేరిట తరగతి గదులలో బోధనా పద్ధతులలో గణనీయమైన మార్పులు ప్రవేశపెట్టింది.

'మల్టీగ్రేడ్' పేరిట ఒకటి నుండి ఐదవ తరగతి చదివే విద్యార్థులు అందరినీ ఒకే సమూహంగా చెయ్యడానికి బదులుగా ఒకటి నుండి మూడు తరగతుల వరకు ఒక గ్రూప్, నాలుగు, ఐదు తరగతుల వారిని మరొక గ్రూప్‌గా విడదీసారు. ప్రతి తరగతికి వేర్వేరు


**చదవండి! చదివించండి!!**

**Marxist**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సైద్ధాంతిక త్రైమాస ఆంగ్ల పత్రిక**

వెల: ఒక ప్రతి రూ. 50

ప్రతులకొరకు

**The Manager,**

The Manager, Marxist, A. K. Gopalan Bhawan
27-29 Bhai Vir Singh Marg, New Delhi 110001
Phone: (91-11) 23348725; Email: pdpbln@gmail.com
Marxist is also available online at: https://cpim.org/the-marxist

పాఠ్యాంశాలు, కార్యకలాపాల బదులుగా గ్రూప్‌లోని విద్యార్థులు అందరికీ ఉపకరించే విధంగా పాఠ్యాంశాలను రూపొందించారు. అది ఎలానో ఉదాహరణగా చూద్దాం.

–భాషా తరగతిలో ఉమ్మడిగా నేర్పే అంశం అక్షరాలను ఎలా పలకాలి అనేది. ఒకటో తరగతి పిల్లలు అక్షరాలను గుర్తించి ఎలా పలకాలో చెప్తారు. రెండవ తరగతి పిల్లలు పదాలను గుర్తించి ఎలా పలకాలో చెప్తారు. మూడవ తరగతి పిల్లలు ఆ పదాలకు అర్థాలను వివరించడం, పద సముచ్ఛయాలను వివరించడం చేస్తారు.


–ఇక లెక్కల విషయానికి వస్తే ఒకటో తరగతి పిల్లలు అంకెల మౌలిక ఆకారాలను బట్టి ఆ అంకెలను గుర్తిస్తారు. రెండవ తరగతి పిల్లలు అంకెల కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగహారాలూ వివరిస్తారు. మూడవ తరగతి పిల్లలు జామెట్రీ ప్రాథమిక పాఠాలు వివరిస్తారు అన్నీ ఒకే తరగతి గదిలో.

దీని మూలంగా ఉపాధ్యాయులకు ఒక్కో తరగతి విద్యార్థికి విడి విడిగా పాఠాలు నేర్పే బదులు పిల్లలను వాళ్ళ స్థాయికి తగిన రీతిలో నేర్చుకునేందుకు సహాయకారిగా ఉండడం ద్వారా పెద్ద భారం దించుకున్నట్లు అవుతుంది. పాఠ్య పుస్తకాలలో పాఠ్యాంశాలను వల్లె వేయడం కన్నా ఉపాధ్యాయులు మౌలిక అంశాలు చెప్పి తద్వారా విద్యార్థులను స్వీయశిక్షణా పద్ధతుల ద్వారా నేర్చుకునేందుకు వారిని సన్నద్ధం చెయ్యవచ్చు.

ఈ పద్ధతులను దృష్టిలో పెట్టుకుని పాఠ్యపుస్తకాలు రూపొందిస్తే అవి ఎలా ఉండాలంటే..

1. ఒకే పాఠంలో ఆయా గ్రూప్‌లో ఉన్న వివిధ తరగతుల విద్యార్థులు అందరూ వివిధ రకాలుగా స్వీయ శిక్షణ గరిపేందుకు వీలయిన థీమ్‌తో పాఠ్యాంశాలు, సిలబస్ రూపొందించాలి.
2. సిలబస్ భారంగా మారకుండా ఉండడానికి పాఠశాలల పని దినాలను దృష్టిలో ఉంచుకుని పైవిధంగా ఆ పనిదినాలకు సరిపోయేటంత సిలబస్‌కి మాత్రమే పరిమితం కావాలి.
3. ఎక్కువ అంశాలను పరిచయం చెయ్యాలి అని తాపత్రయపడడానికి బదులుగా కొద్దిపాటి అంశాలను లోతుగా అర్థం చేసుకుని వాటి మీద విద్యార్థులు పట్టు సాధించేందుకు తగిన శిక్షణ గరిపేందుకు ప్రాధాన్యతనివ్వాలి.
4. మోనోగ్రేడ్, మల్టీగ్రేడ్ తరగతి గదులలో మార్గదర్శకత అందించడానికి తగిన వెసులుబాటు కల్పించాలి.

> “ దీని మూలంగా ఉపాధ్యాయులకు ఒక్కో తరగతి విద్యార్థికి విడి విడిగా పాఠాలు నేర్పే బదులు పిల్లలను వాళ్ళ స్థాయికి తగిన రీతిలో నేర్చుకునేందుకు సహాయకారిగా ఉండడం ద్వారా పెద్ద భారం దించుకున్నట్లు అవుతుంది. పాఠ్య పుస్తకాలలో పాఠ్యాంశాలను వల్లె వేయడం కన్నా ఉపాధ్యాయులు మౌలిక అంశాలు చెప్పి తద్వారా విద్యార్థులను స్వీయ శిక్షణా పద్ధతుల ద్వారా నేర్చుకునేందుకు వారిని సన్నద్ధం చెయ్యవచ్చు. ”



ఏకోపాధ్యాయ మల్టీ లెవల్ టీచింగ్ పాఠశాల

ఈ లక్ష్యాలకు అనుగుణంగా పాఠ్యపుస్తకాలను రూపొందించడం అంటే వాటిని అతి సాధారణీకరించమన్న అర్థంకాదు. అవి ఎత్తుగడలతో ఉండాలి. ప్రాథమిక స్థాయిలో భాషమీద, గణితశాస్త్రం మీదా మెళు కువలు నేర్చుకోవడానికి పిల్లలకు తగినంత సమయం ఉండేలా చూసుకోవాలి. 'క్రాష్‌కోర్స్' నేర్పినట్లు కాకుండా బోధన, పునశ్చరణ, ఫీడ్‌బ్యాక్ తీసుకోవడానికి అనువుగా సమయం కేటాయించాలి.

ఈ మార్పులు తీసుకురావడం ఒక్క బోధకులకు మాత్రమే సాధ్యం అని భావించరాదు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, రాజకీయ నాయకత్వం – వీరు ముగ్గురూ ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలి.

ఉపాధ్యాయులకు క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న వాస్తవాలకు అనుగుణమైన శిక్షణ గరపాలి. కేవలం విషయ పరిజ్ఞానమే కాకుండా మల్టీగ్రేడ్ తరగతి గదిని నిర్వహించేందుకు తగిన నైపుణ్యాలు అందించాలి.

విద్యార్థులను ఎలా ఏ ప్రాతిపదికన గ్రూపులుగా విడగొట్టాలి, వాళ్ళు ఏ మేరకు మెరుగవుతున్నారు అనేది ఎలా అంచనా కట్టాలి అన్న అంశాలపై ఉపాధ్యాయులకు సముచిత రీతిన అవగాహన కల్పించాలి.

విద్యార్థుల తల్లిదండ్రులు నిజాయితీగా, తమ పిల్లవాడి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని భావోద్వేగాలకు అతీతంగా వ్యవహరించాలి. తమ పిల్లవాడు క్లాసులో వెనుకబడి ఉన్నాడు అన్నంత మాత్రాన అదేదో ఘోరం, నేరం అన్నట్లు స్పందించకూడదు. చదువు నేర్పడంలో పిల్లలలో తరతమ స్థాయిలు ఉంటాయన్న వాస్తవం వాళ్ళ గ్రహింపులో ఉండాలి. తమ పిల్లాడు చదువులో వెనుకబడ్డాడని తెలియగానే 'మీరు సరిగా చదువు చెబితేగా' అంటూ ఉపాధ్యాయుల మీద నెపం వేసి వారిని తప్పు పట్టే రీతిగా వ్యవహరించకూడదు. పిల్లాడి చదువులో మెరుగు పడడానికి ఉపాధ్యాయుడితో పాటు తమవంతుగా ఏం చెయ్యాలో చర్చించి ఆ మేరకు బాధ్యత తీసుకునేలా ఉండాలి.

> **“ మన విద్యావ్యవస్థ వేసుకోవాల్సిన మౌలిక ప్రశ్న ఏమిటంటే - మనం ఎవరిని దృష్టిలో పెట్టుకుని పాఠ్యాంశాలు, పాఠ్యపుస్తకాలు, కోర్సులు రూపొందిస్తున్నాం అని. ‘ప్రతిపిల్ల వాడినీ’ అన్నది మన సమాధానం అయితే - వాళ్ళు ఏ తరగతి, వాళ్ళ స్థాయి ఏమిటి, వాళ్ళ భాష ఏమిటి, ఏ ప్రాంతం వాళ్ళు అన్నదానితో నిమిత్తం లేకుండా ప్రతి బిడ్డనీ ఉత్తమ నైపుణ్యాలు గల విద్యార్థిగా తీర్చిదిద్దడం మన విద్యా వ్యవస్థ లక్ష్యంగా ఉండాలి. ”**

రాజకీయ నాయకత్వం అవాస్తవిక లక్ష్యాలను నిర్దేశించి, ఆ లక్ష్యాలు సాధించమని ఉపాధ్యాయులను ఒత్తిడి చెయ్యడంగానీ, ఆ లక్ష్యాలు సాధించలేదని తప్పు పట్టడం గానీ మానుకోవాలి. నాణ్యమైన పాఠ్యపుస్తకాలు సకాలంలో అందుబాటులోకి తీసుకురావడం, ఉపాధ్యాయులు స్వీయ అభివృద్ధికి నిరంతరం పాటుపడేందుకు తగిన వనరులు, పరిస్థితులు కల్పించడం వంటి తమవంతు బాధ్యత సక్రమంగా నిర్వహించాలి. విద్య గరపడం అంటే కేవలం సిలబస్ పూర్తి చెయ్యడం కాదు, విద్యార్థులకు విషయ పరిజ్ఞానం అందించడం అన్న అంశం వారి ఎరుకలో ఉండాలి.

ఏతావాతా చెప్పుకోవాలంటే మన విద్యావ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలు మల్టీగ్రేడ్ క్లాస్‌రూమ్‌లో, పాఠ్యపుస్తకాలో, ఉపాధ్యాయ శిక్షణో అనుకునే దానికన్నా ఆ వృత్తికి ఇవ్వాల్సిన గౌరవం, కాపాడాల్సిన హుందాతనం అని ముఖ్యంగా గుర్తించాలి. ఇప్పుడున్న మన విద్యావ్యవస్థ మౌలిక స్వభావాన్ని ఇంకా ఇలాగే కొనసాగించడం అంటే లక్షలాది మంది విద్యార్థులను, వేలాది మంది ఉపాధ్యాయులను నిత్యం రంపపు కోతకు గురిచెయ్యడమే. రోజువారీ వారు అనుభవిస్తున్న క్షోభను విస్మరించడవే. అత్యుత్తమ స్థాయి పాఠ్యపుస్తకాలను అలంకారప్రాయంగా ముద్రించి శెభాష్ అని స్వయంకీర్తనలకు పాల్పడడం వదిలి నైపుణ్యమైన విద్యార్థులను తీర్చిదిద్దడానికి అవసరమైన తక్షణ చర్యలు చేపట్టాలి.

ఇంతకన్నా మెరుగు పరుచుకోవడానికి తగిన జ్ఞానం మనకు ఉన్నది, అలాగే వివిధ నమూనాలు అందుబాటులో ఉన్నాయి. ‘ఎన్నుమ్ ఎళుతుమ్’ వంటి విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా తమిళనాడు ప్రభుత్వం రాజకీయ సంకల్పానికీ కొరత లేదని నిరూపించింది. ఇప్పుడు కావల్సిందల్లా మన విద్యావ్యవస్థలో ఉన్న లోపాలను ఉన్నవి ఉన్నట్లు గుర్తించి నిజాయితీగా, నిబద్ధతతో వాటిని అధిగమించే కృషి చేపట్టడమే.

మన విద్యావ్యవస్థ వేసుకోవాల్సిన మౌలిక ప్రశ్న ఏమిటంటే – మనం ఎవరిని దృష్టిలో పెట్టుకుని పాఠ్యాంశాలు, పాఠ్యపుస్తకాలు, కోర్సులు రూపొందిస్తున్నాం అని. ‘ప్రతిపిల్లవాడినీ’ అన్నది మన సమాధానం అయితే – వాళ్ళు ఏ తరగతి, వాళ్ళ స్థాయి ఏమిటి, వాళ్ళ భాష ఏమిటి, ఏ ప్రాంతం వాళ్ళు అన్నదానితో నిమిత్తం లేకుండా ప్రతి బిడ్డనీ ఉత్తమ నైపుణ్యాలు గల విద్యార్థిగా తీర్చిదిద్దడం మన విద్యావ్యవస్థ లక్ష్యంగా ఉండాలి.

ఇదేమంత సులువైన విషయం కాదు. దీనికి పునరాలోచన, శిక్షణ, వినూత్నమైన పాఠ్యపుస్తకాలు, టైంటేబుళ్ళు అవసరం తల్లిదండ్రులతో నిజాయితీగా చర్చలు జరపడం, ఉపాధ్యాయుల సమయానికి తగిన గౌరవం ఇవ్వడంతో పాటు రాత్రికి రాత్రే మార్పులు తీసుకురావడం సాధ్యం కాదు, ఓపికతో, నిబద్ధతతో, నిమగ్నతతో ఈ మార్పులు తీసుకురావాలి అన్న స్పృహ కలిగి ఉండాలి.

ఇంతకు మించి మార్గాంతరం లేదు. అనివార్యంగా ఈ మార్పులకు శ్రీకారం చుట్టాలి. క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరించడం అంటే భావి భారత పౌరుల భవిష్యత్తును బలి పెట్టడమే. దేశం అంతటి మూల్యం చెల్లించడానికి సిద్ధంగా లేదు. కాబట్టి ప్రతి విద్యార్థి, ప్రతి ఉపాధ్యాయుడు, ప్రతి తరగతి గదిని మనం పరిగణనలోకి తీసుకోవాలి, మార్పు దిశగా మనం వెయ్యాల్సిన తొలి అడుగు ఇదే.

**(అనువాదం కె. సత్యరంజన్)**

# మహిళా రిజర్వేషన్ బిల్లా? లేక బిజెపి పరిరక్షణ బిల్లా?

**(12వ పేజీ తరువాయి)**

పనిచేస్తోందని ఆ నివేదికలు వెల్లడించాయి. అంతేకాకుండా, గత ఒకటిన్నర శతాబ్దాలుగా కార్మిక ఉద్యమాలు సాధించిన విజయాలను, ముఖ్యంగా ‘ఎనిమిది గంటల పనిదినం’ హక్కును ప్రస్తుత పనివేళలు అపహాస్యం చేసేలా ఉన్నాయని అవి ఎత్తిచూపాయి.

నోయిడాలోని ఇంటి పనివారలు, పారిశ్రామిక కార్మికుల పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని ఒక ప్రశ్నను లేవనెత్తడం ప్రారంభించారు: నెలకు లక్షల్లో ఆదాయం ఆర్జించే తమ యజమానులు, పాత్రలు కడగడం, నేలలు తుడవడం వంటి కఠినమైన పనుల కోసం రోజుకు రెండు గంటలు శ్రమించినందుకు గాను, కేవలం రూ. 2,500 నుండి రూ. 3,000 వంటి అతి తక్కువ మొత్తాలను ఎందుకు చెల్లిస్తున్నారన్నదే ఆ ప్రశ్న.


డేటా విశ్లేషకులు అభిషేక్ ఝా, రోషన్ కిషోర్, గ్రాఫ్‌ల ద్వారా ఒక విషయాన్ని స్పష్టం చేశారు: వేతన జీవులతో పోలిస్తే, కర్మాగార కార్మికుల వేతనాలు, జీవన పరిస్థితులలో ఎటువంటి పురోగతి లేక, అవి ఒకే చోట స్తంభించిపోయాయని వారు గణాంకాలతో సహా నిరూపించారు. వారు వ్యాఖ్యానించినట్లుగా: “నోయిడాలోని కర్మాగార కార్మికులు చేపట్టిన నిరసనలు, భారతదేశ తయారీ రంగ కార్మిక శక్తి ఎదుర్కొంటున్న ఆర్థిక అభద్రతను నగ్నంగా బయటపెట్టాయి” అని చాలా చక్కగా విశ్లేషించారు, మహాశయులారా. ఇక్కడ తలెత్తే ఏకైక ప్రశ్న ఏమిటంటే తీవ్రమైన కార్మిక నిరసనలు చెలరేగేంత వరకు వేచి చూడటం ఎందుకు?

**(అనువాదం : కె. గడ్డెన్న)**

# డిల్లీ సుల్తానుల కాలం

## వ్యవసాయం, భూ సంబంధాలు, సామాజిక జీవితం

## 13-15 శతాబ్దాలు



రచయిత ప్రజాశక్తి మాజీ సంపాదకులు

ఎంవిఎస్ శర్మ

**యూరపియన్, ఏషియాటిక్ నమూనాలు**

భారత దేశంలో భూస్వామ్య సంబంధాల గురించి చర్చ నేటికీ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మధ్య యుగాలలోని గ్రామీణ జీవితాలను, ప్రధాన వ్యాపకంగా ఉండిన వ్యవసాయాన్ని మరింత లోతుగా అధ్యయనం చేయడం అవసరం. మధ్య యుగాలనాటి సమాజాన్ని ఫ్యూడల్ సమాజం అని, భూస్వామ్య వ్యవస్థ అని అంటాం. భారత ఉపఖండంలో యూరప్–తరహా ఫ్యూడలిజం లేదని, ఇక్కడ ఉన్నది ఆసియా–తరహా ప్రత్యేక వ్యవస్థ అని చరిత్రకారులు చర్చిస్తూంటారు. మార్క్స్ కూడా ఆసియా–తరహా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అనే పేర్కొన్నాడు.

ఇప్పుడు హిందూత్వ వాదులుగా ఉన్న చరిత్రకారులు ఆ మధ్యయుగాల కాలాన్ని, ముఖ్యంగా గుప్తుల కాలం నుండి మొదలుబెట్టి స్వర్ణయుగంగా అభివర్ణిస్తూంటారు. ఆ కాలంలో గ్రామాల్లో అణచివేత, దోపిడీ, వివక్షత వంటివి లేనే లేవనీ, కులం అంటే ఆ కాలంలో కేవలం పని విభజన మాత్రమేననీ, వారంతా సంపూర్ణ స్వేచ్ఛను అనుభవించారనీ.. ఇలా రకరకాలుగా కథలు ప్రచారం చేస్తున్నారు. ఇటీవల కేరళ గవర్నర్ వైసూరులో జరిగిన ఒక విద్యాసంబంధిత వర్క్‌షాప్‌కు హాజరైనప్పుడు బ్రిటిష్‌వారు రాకపూర్వం, ముఖ్యంగా గుప్తుల కాలంలో అక్షరాస్యత నూటికి 90 శాతాన్ని మించివుండేదని, పరాయి మతస్తుల పాలనలో మాత్రమే భారతీయులు నిరక్షరాస్యులుగా దిగజారిపోయారని ప్రసంగించారు! ఈ రకంగా చరిత్రను అపహాస్యం చేస్తూ, నిరాధారిత ప్రకటనలతో గందరగోళపరుస్తూ జరుగుతున్న దాడి బారి నుండి భావితరాలను కాపాడుకోవాలంటే వాస్తవ చరిత్రను లోతుగా అధ్యయనం చేయడం అవసరం. యూరప్ ఖండంలో ఉండిన మధ్యయుగాల వ్యవస్థకు, మన ఉపఖండంలో ఉండిన వ్యవస్థకు మధ్య తేడాలేమిటి, సామ్యం ఏమిటి అన్నది రేఖామాత్రంగానైనా తెలుసుకోవాలి.

యూరప్ లోని ఫ్యూడలిజం: ఫ్యూడలిజం అన్న పదం ఫ్యూడ్ (feud) నుంచి వచ్చింది. ఇంగ్లీషుభాషలో ఫ్యూడ్ అంటే తగువు, వివాదం అని అర్థం. కానీ ఇక్కడ ఆ అర్థం వర్తించదు. ఎందుకంటే ఫ్యూడలిజం లోని ఫ్యూడ్ మధ్య యుగాలనాటి లాటిన్ భాషలోని ఫ్యూడమ్ (feudum) అన్న పదం నుండి వచ్చింది. ఈ ఫ్యూడమ్ అన్న పదానికి జర్మన్ భాషలోని ఫిహు (fihu) అన్న పదం మూలం. ఈ ఫిహు అంటే అర్థం పశుసంపద. ఆ కాలంలో అదే గొప్ప ఆస్థిగా పరిగణించబడేది. ఈ ఫ్యూడమ్ అన్న పదాన్నే ఇంగ్లీషులో ఫీఫ్ (fief) అని అంటారు. ఈ ఫ్యూడమ్ లేదా ఫీఫ్ అన్నది భూమికి సంబంధించిన ఒక ప్రత్యేకమైన ఆస్థిహక్కు. ఈ హక్కు ఆ భూస్వామికి వారసత్వంగా సంక్రమిస్తుంది. ఈ హక్కును అతడి సంతానం పంచుకోడానికి వీలు లేదు. భూస్వామికి కలిగిన మొదటి సంతానానికి మాత్రమే అది సంక్రమిస్తుంది.

ఈ హక్కును భూస్వామి అనుభవించడానికి రాజ్యాన్ని ఏలే రాజు నుండి అనుమతి విధాయకంగా ఉండాలి. ఆ అనుమతిని పొందాలంటే ఈ భూస్వామి రాజు ఎప్పుడు కోరితే అప్పుడు పంపడానికి వీలుగా సైనిక దళాలను తనవద్ద సిద్ధంగా ఉంచాలి. వారిని తానే పోషించాలి.

భూస్వామి ఆధీనంలో ఉన్న భూమి మీద ఆధారపడి జీవించేవారందరూ ఆ భూస్వామి కోరినమేరకు సేవలను అందించాలి. రైతులు ధాన్యం రూపంలో కానీ, ధనం రూపంలో కానీ శిస్తు చెల్లించాలి. అంతేకాక, భూస్వామి ఇంటివద్ద, అతడి స్వంత కమతంలో, అతడి స్వంత పశు సంపద సంరక్షణలో రైతులు, వృత్తిదారులు సేవలు చేయాలి. అందుకు ఎటువంటి ప్రతిఫలమూ ఉండదు.

ఇటువంటి తరహా ఫ్యూడలిజం పశ్చిమ యూరప్ ప్రాంతంలో 9 నుండి 15 శతాబ్దాల మధ్య కాలంలో కొనసాగింది. ఐతే, ఇక్కడ రైతు అనేవాడు తనకు కేటాయించిన భూమిని వదిలిపెట్టి వేరే ఎక్కడికైనా పోడానికి అతడికి స్వేచ్ఛ లేదు. అందుచేత అతడిని సెర్ఫ్ (serf) లేదా భూదాసుడు అని అంటారు. అదేవిధంగా భూస్వామి తనకు అప్పజెప్పిన పనులను చేయడానికి నిరాకరించే హక్కు ఆ భూదాసుడికి లేదు.

ఈ భూదాస్యాన్ని (serfdom) పశ్చిమ యూరప్ ప్రాంతంలో నడిచిన ఫ్యూడల్ వ్యవస్థ ప్రాథమిక లక్షణంగా మార్క్సిస్టు చరిత్రకారులు పరిగణిస్తారు. తక్కిన చరిత్రకారులు రాజుకు, భూస్వామికి మధ్య ఉండే సైనిక ఒడంబడికను, లేదా భూస్వామికి వారసత్వంగా సంక్రమించే హక్కును ప్రధాన లక్షణాలుగా పరిగణిస్తారు.

పశ్చిమ యూరప్ లోని ఫ్యూడలిజానికి మరొక లక్షణం కూడా ఉంది. ముఖ్యంగా ఫ్యూడలిజం తొలిదశలో 'డబ్బు' పాత్ర చాలా పరిమితంగా ఉండేది. పట్టణీకరణ చాలా తక్కువ స్థాయిలో ఉండేది. దూర ప్రాంతాలకు వ్యాపారం చాలా తక్కువ స్థాయిలో కొనసాగేది. క్రమంగా వ్యాపారం పెరుగుతున్నకొద్దీ 'డబ్బు' పాత్ర కూడా పెరుగుతూ వచ్చింది. అంతవరకూ రైతులు తమ శిస్తును వస్తురూపేణా చెల్లించడమే ప్రధానంగా కొనసాగింది.

'భారతీయ ఫ్యూడలిజం' అని డిడి కొశాంబి, ఆర్ఎస్ శర్మ ఉపయోగించారు. క్రీశ 300–1200 మధ్య కాలంలో మన సమాజంలో ఈ 'తక్కువస్థాయి పట్టణీకరణ' ఉండడం, 'డబ్బు పాత్ర' తక్కువగా ఉండడం అనే లక్షణాలను ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని 'భారతీయ ఫ్యూడలిజం' అని వాడారు. కొశాంబి భూదాస్యం లేదా సెర్ఫ్‌డమ్ అనేది భారత ఉపఖండంలో

**“ ఈస్ట్ ఇండియా కంపెనీ ఇండియాలో పెత్తనం చెలాయిస్తున్న కాలంలో ఇక్కడికి వచ్చిన జాన్ స్టువార్ట్ మిల్ ఈ ప్రాతిపదికమీదనే తన వాదన రూపొందించాడు. అంతవరకూ చక్రవర్తికి ఉండిన అధికారాలు ఇప్పుడు ఈస్ట్ ఇండియా కంపెనీకి దఖలు పడ్డాయి. రైతుకు అంతకు మునుపు గానీ, ఇప్పుడు కానీ భూమి మీద ఎటువంటి హక్కూ లేదు. గతంలో చక్రవర్తికి ఏ విధంగా శిస్తు చెల్లించారో అదేవిధంగా ఇప్పుడు కంపెనీకి చెల్లించాలి. ”**

లేదని భావించారు. కాని ఆర్ఎస్ శర్మ భూదాస్యం ఇక్కడ లేదు అని స్పష్టంగా చెప్పలేదు.

డబ్ల్యుహెచ్ మోర్‌లాండ్ భారతీయ వ్యవసాయరంగ చరిత్రను అధ్యయనం చేయడంలో తొలి అడుగులు వేసిన చరిత్రకారుడు. 1928లో అతడు తన అధ్యయనాన్ని ప్రచురించాడు. అందులో అతడు చేసిన వాదన ప్రకారం భారత ఉపఖండంలో పశ్చిమ యూరప్ తరహా ఫ్యూడలిజం లేదు. ఇక్కడ ఉన్నదానిని 'తూర్పు దేశాల నిరంకుశ రాచరికం' (ఓరియంటల్ డెస్పాటిజం) అన్నాడు. రాజుకు దిగువన అధికార యంత్రాంగం, ఆ దిగువన ప్రజలు లేదా పాలితులు ఉండేవారని అన్నాడు. ఇక ఫ్రాంకోయిస్ బెర్నియర్ అనే ఫ్రెంచి పర్యాటకుడు 1650-1666 మధ్య కాలంలో భారత ఉపఖండంలో విస్తృతంగా పర్యటించి తన అనుభవాలను గ్రంధస్తం చేశాడు. అందులో ఆనాటి భారత ఉపఖండంలో వ్యవస్థ ఏ విధంగా ఉండేదో వివరంగా తెలిపాడు.

పశ్చిమ యూరప్‌లో మాదిరిగా భారత ఉపఖండంలో 'ఆస్తి' అనేది లేదు. అంత సంపదకూ, మొత్తం భూమికీ హక్కు, అధికారం మొత్తం చక్రవర్తి చేతుల్లోనే ఉంటాయి. ఏ భూమి ఎవరి ఆధీనంలో ఉండాలన్నది చక్రవర్తే నిర్ణయిస్తాడు. అందుచేత భూమిమీద హక్కు వారసత్వంగా సంక్రమించితీరాలన్న నిబంధన ఏదీ లేదు. ఒకరు అనుభవిస్తున్న జాగీరును అతడినుండి లాగేసుకుని మరొకరికి బదలాయించే హక్కు చక్రవర్తికి ఉంది. అందుచేత 'నిజమైన ఆస్తిహక్కు కల యజమానులు' అంటూ ఇక్కడ లేరని బెర్నియర్ భావించాడు.

ఈస్ట్ ఇండియా కంపెనీ ఇండియాలో పెత్తనం చెలాయిస్తున్న కాలంలో ఇక్కడికి వచ్చిన జాన్ స్టువార్ట్ మిల్ ఈ ప్రాతిపదికమీదనే తన వాదన రూపొందించాడు. అంతవరకూ చక్రవర్తికి ఉండిన అధికారాలు ఇప్పుడు ఈస్ట్ ఇండియా కంపెనీకి దఖలు పడ్డాయి. రైతుకు అంతకు మునుపు గానీ, ఇప్పుడు కానీ భూమి మీద ఎటువంటి హక్కూ లేదు. గతంలో చక్రవర్తికి ఏ విధంగా శిస్తు చెల్లించారో అదేవిధంగా ఇప్పుడు కంపెనీకి చెల్లించాలి. గతంలో చక్రవర్తి సమ్మతి ఉన్నంతకాలం రైతు భూమిమీద కొనసాగేవాడు. ఇప్పుడు కంపెనీ అనుమతి ఉంటేనే కొనసాగుతాడు. కంపెనీదే నిర్ణయాధికారం... ఇదీ మిల్ వాదన. ఈ వాదన ప్రాతిపదికమీదనే అతడు భారతదేశంలో 'ఫ్యూడలిజం' అనేది లేదని, ఇక్కడ ఉన్నది భిన్నమైన విధానం అని, దానిని 'ఆసియాకు ప్రత్యేకమైన వ్యవస్థ', ఏషియాటిక్ మోడ్ (Asiatic Mode) అని అభివర్ణించాడు.

కార్ల్ మార్క్స్ ఈ దృక్కోణాన్నే ప్రాథమికంగా స్వీకరించాడు. ఐతే అతడి దృష్టి చాలా విశాలమైనది. అందువల్లే మార్క్స్ ఈ ఏషియాటిక్ మోడ్‌లో గ్రామం ఒక స్వయంసమృద్ధి సాధించిన యూనిట్‌గా రూపొందడం అన్నింటికన్నా ముఖ్యమైన అంశం అని అన్నాడు. అదే సమయంలో గ్రామంలో ఉత్పత్తి అయ్యే సంపదలో మిగులు ఏర్పడుతుందనీ, అది మార్కెట్‌లోకి సరుకుల రూపంలో ప్రవేశిస్తుందని అన్నాడు. భారత ఉపఖండానికి సంబంధించి మార్క్స్‌కు అందుబాటులో ఉండిన సమాచారం చాలా పరిమితం. ఐనప్పటికీ అతడి లోతైన పరిశీలన చాలా ప్రత్యేకమైనది.

కార్ల్ విట్‌ఫోగెల్ అనే చరిత్రకారుడు తూర్పు దేశాల రాచరిక పాలన గురించి రాసిన గ్రంధంలో ఏషియాటిక్ సమాజాల్లో వర్గాలుగా ప్రజలు చీలి లేనే లేరని, ఆ కారణంగానే వర్గ పోరాటాలకు ఆస్కారమే లేకుండా పోయిందని భావించాడు. ఇటువంటి సూత్రీకరణ ఏదీ మార్క్స్ రచనల్లో మనకు కనిపించదు.

భారత ఉపఖండపు మధ్య యుగాల సమాజానికి యూరపియన్ తరహా 'ఫ్యూడలిజం' నమూనా కానీ, 'ఏషియాటిక్ సమాజం' నమూనా కానీ వర్తించవు అని వాదించేవారు కూడా ఉన్నారు. వాస్తవానికి ప్రతీ దేశపు, ప్రతీచారిత్రిక స్థితీ ఏదో ఒక సైద్ధాంతిక నమూనాకు అనుగుణంగానే ఉండితీరాలని వాదించడం కుదరదు. వాస్తవానికి పశ్చిమ యూరప్ దేశాలన్నింటికీ పైన తెలిపిన 'ఫ్యూడలిజం' నమూనా ఒకేలా వర్తించదు. కానీ చరిత్ర గమనాన్ని అర్థం చేసుకోవాలంటే చరిత్రకారుడికి కొన్ని సాధారణీకరణలు అవసరం అవుతాయి.

డిల్లీ సుల్తానుల కాలంలో (క్రీ.శ.13-15 శతాబ్దాలు) భారత ఉపఖండంలో ఉన్న వ్యవస్థ

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

లక్షణాలు పశ్చిమ యూరప్‌కు చెందిన ఫ్యూడలిజం నమూనా కన్నా ఏషియాటిక్ నమూనాకే దగ్గరగా ఉన్నాయి. ఐతే, ఆ కాలంలో ఇక్కడ రైతులు యూరప్‌లోని భూదాసులు అనుభవించిన పరిస్థితులవంటివే చవి చూశారు. భారీ శిస్తులు, వారి కదలికలపై ఆంక్షలు, కుల అణచివేత వంటివి అనుభవించారు. ఈ విషయంలో ఫ్యూడలిజంతో సరిపోల్చదగ్గ అంశాలు కూడా ఉన్నాయి.


“11వ శతాబ్దంలో ఉజ్జయిని పాలకుడు భోజుడు మధ్య భారతంలో బ్రహ్మాండమైన చెరువును నిర్మింపజేశాడు. దాదాపు అదే కాలంలో దక్షిణాదిన చోళ ప్రభువులు కావేరి నది మీద 20 అడుగుల ఎత్తు, 1000 అడుగుల పొడవు, 60 అడుగుల మందంతో ఆనకట్ట నిర్మింపజేశారు. అక్కడినుంచి వివిధ ప్రాంతాలకు కాలువలు తవ్వించి సాగునీరందే ఏర్పాటు చేశారు.”

### డిల్లీ సుల్తానుల కాలం (1206-1398)లో వ్యవసాయం: పరిమితంగా వ్యవసాయ భూమి

భారత ఉపఖండంలో, అంటే ప్రస్తుత భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ కలిపిఉన్న ప్రాంతంలో జనాభా మధ్య యుగాల్లో ఏడాదికి 0.2 శాతం చొప్పున పెరిగింది. (1000 మందికి ఇద్దరు) ఆ లెక్కన చూస్తే 12వ శతాబ్దం నాటికి ఈ ప్రాంతంలో 7 కోట్ల 25 లక్షలమంది ప్రజలు ఉండివుండాలి. ఇప్పుడు అదే ప్రాంతంలో 175 కోట్లకు పైబడి ఉన్నారు. కనుక 12వ శతాబ్దం నాటి వ్యవసాయ పరిస్థితులను తెలుసుకునేముందు ఆ నాటి జనాభా, ఆనాటి భౌగోళిక పరిస్థితి మీద ఒక అవగాహన ఏర్పరచుకోవడం అవసరం. ఇప్పుడున్న జనాభాలో ఇరవయ్యో వంతు కూడా లేని ఆ కాలంలో వ్యవసాయం ఎంతమేరకు సాగింది? చాలా పరిమితంగా మాత్రమే వ్యవసాయం సాధ్యం. ప్రతీ గ్రామం చుట్టూ అడవులు, తుప్పలు, డొంకలు ఆవరించివుండేవి. ఆ అడవుల్లో లభించే సంపదను పోగుచేసుకుని ఉపయోగించే కార్యకలాపాల్లోనూ, వేట, పశువుల్ని మేపుకోవడంలోనూ ప్రజలు పెద్ద సంఖ్యలో నిమగ్నమై ఉండేవారు. అందువలను భూమిమీద వ్యవసాయం కోసం అందుబాటులో ఉండే మానవ వనరులు తక్కువగానే ఉండేవారు.

ఐనప్పటికీ, నెమ్మదిగానైనా వ్యవసాయం విస్తరిస్తూవచ్చింది. పరిపాలించే ప్రభువులు పూనుకుని సాగునీటి సదుపాయాలను కల్పించిన ప్రాంతాల్లో వ్యవసాయాభివృద్ధి ఎక్కువగా జరిగింది. దానివలన రాజ్యానికి శిస్తు రూపేణా లభించే ఆదాయమూ పెరిగింది.

11వ శతాబ్దంలో ఉజ్జయిని పాలకుడు భోజుడు మధ్యభారతంలో బ్రహ్మాండమైన చెరువును నిర్మింపజేశాడు. దాదాపు అదే కాలంలో దక్షిణాదిన చోళ ప్రభువులు కావేరి నది మీద 20 అడుగుల ఎత్తు, 1000 అడుగుల పొడవు, 60 అడుగుల మందంతో ఆనకట్ట నిర్మింపజేశారు. అక్కడినుంచి వివిధ ప్రాంతాలకు కాలువలు తవ్వించి సాగునీరందే ఏర్పాటు చేశారు.




బావులనుండి నీటిని తోడే సాంకేతిక పరిజ్ఞానం పెంపొందింది. పశువులను ఉపయోగించి మోట తోలే పద్ధతి విస్తరించింది. ఉత్తర భారతదేశంలో ఒంటెను వ్యవసాయ పనుల్లో, బళ్ళు లాగడంలో వినియోగించడం ఎక్కువగా జరిగింది.

### సామాజిక వ్యవస్థ

ఒకపక్క రైతులు వ్యవసాయ పనుల్లో ఉంటూ పక్కనే ఉండే అడవుల్లో వేటాడేవారు. జంతువుల చర్మాలను వొలిచి ఉపయోగానికి వీలుగా మలిచేవారు, కట్టెలు కొట్టి వంటచెరకు నిమిత్తం తెచ్చేవారు. వివిధ అటవీ ఉత్పత్తులను సేకరించి తెచ్చేవారు కూడా ఉండేవారు. ఈ తరహా పని విభజన ఆనాటి కుల వ్యవస్థలో కూడా ప్రతిఫలించింది. 1254 నాటి రాగిరేకు ఒకటి బుందేల్‌ఖండ్ ప్రాంతానికి చెందినది తవ్వకాల్లో లభించింది. దానిపై రాసినదానిని బట్టి గ్రామంలో వివిధ తరగతుల ప్రజలు ఈ విధంగా ఉండేవారు: 1. కుటువి- అంటే కుటీరాల్లో ఉండేవారు, రైతులు. 2. చండాలురు- గ్రామానికి వెలుపలే ఉండేలా వెలివేయబడిన వారు, 3. బ్రాహ్మణులు, 4. కాయస్థులా అంటే

> **వర్షపాతంలో ఇప్పటిమాదిరి పరిస్థితే క్రీ.శ.1000-1500 మధ్య కాలంలో కూడా ఉండేదని పురావస్తు-పర్యావరణ సంబంధిత పరిశోధనలు వెల్లడించాయి. ఇంతకు ముందే చెప్పినట్టు ఎక్కువ భూభాగం అడవులతో, తుప్పలతో, డొంకలతో ఉండేది. వ్యవసాయ భూమి పరిమితంగా ఉండేది. ఈ విస్తారమైన అడవుల్లో ఆటవిక మృగాలు విరివిగా సంచరిస్తూవుండినట్టు పర్యాటకుల డైరీలను బట్టి తెలుస్తోంది.**

లెక్కలు చూసేవారు (ఇటీవలి వరకూ ఉనికిలో ఉన్న కరణాలు అని అనుకోవచ్చు) 5. దూతలు: సమాచారం అందించేవారు , గ్రామ సేవకులు. 6. వైద్యులు.

వీరిలో మొదటి రెండు కులాలవారు వారి కాయకష్టం మీద బతకడమే గాక తక్కిన నాలుగు కులాలవారినీ పోషించేవారు. ఇక గ్రామంలో ఉత్పత్తి అయే సంపద నుండి భూమిశిస్తు రూపంలో 'రౌతులు' అనబడే తరగతికి చెల్లించేవారు. ఈ రౌతు అన్న పదం రాజపుత్రుడు అన్న పదానికి ప్రాకృత రూపం, లేదా గ్రామ్యం. ఈ పదానికి మొదటి అర్థం ఆశ్వికదళ సభ్యుడు (గుర్రం మీద స్వారీ చేసేవాడు) అని ఉంది. క్రమంగా అన్ని తరహాల సైనిక దళాల సభ్యులకూ ఇది వర్తించడం మొదలైంది. ఇదే అర్థంలో పశ్చిమాన గుజరాత్ ప్రాంతంలో కూడా రాజపుత్రులు అన్న పదాన్ని ఉపయోగించారు. ఈ రాజపుత్రుల దళాలు రక్తసంబంధీకులతో ప్రధానంగా ఏర్పడేవి. వీరికి పైన రాణాలు లేదా రాణకులు ఉండేవారు. చక్రవర్తికి అవసరమైనప్పుడు సైన్యాలను అందుబాటులో ఉంచడం వీరి బాధ్యత. రాజపుత్రులు గ్రామాలనుంచి వసూలు చేసే శిస్తులో వీరికి వాటా ఉండేది. ఆ వాటా నుండి తిరిగి చక్రవర్తికి కప్పం రూపంలో చెల్లించేవారు.

యూరప్‌లోని భూస్వామ్య విధానం అక్కడి భూదాసులను ఏ విధంగా భూమికి కట్టుబడివుండేలా నిర్బంధించిందో, ఇక్కడ కూడా దాదాపు అదే మాదిరిగా కులవ్యవస్థ చండాలురిని, రైతులను, చేతివృత్తుల వారిని నిర్బంధించిందని చెప్పవచ్చు.

**వ్యవసాయం**

వర్షపాతంలో ఇప్పటిమాదిరి పరిస్థితే క్రీ.శ.1000–1500 మధ్య కాలంలో కూడా ఉండేదని పురావస్తు–పర్యావరణ సంబంధిత పరిశోధనలు వెల్లడించాయి. ఇంతకు ముందే చెప్పినట్టు ఎక్కువ భూభాగం అడవులతో, తుప్పలతో, డొంకలతో ఉండేది. వ్యవసాయ భూమి పరిమితంగా ఉండేది. ఈ విస్తారమైన అడవుల్లో ఆటవిక మృగాలు విరివిగా సంచరిస్తూవుండినట్టు పర్యాటకుల డైరీలను బట్టి తెలుస్తోంది. ప్రస్తుతం ఈశాన్య భారతానికే పరిమితమైపోయిన ఖడ్గమృగాలు ఆ కాలంలో ఉత్తర భారతంలో పంజాబ్, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాల్లో కూడా సంచరించేవి. అడవిదున్నలు, అడవి బర్రెలు, అడవి గాడిదలు ఇప్పుడు దాదాపు అంతరించిపోయాయి కానీ ఆ కాలంలో బాగా సంచరించేవి. పులుల సంచారం గురించి కూడా అనేక ప్రాంతాల్లో సమాచారం ఉంది. ఈ పరిస్థితి ఉపఖండం యావత్తూ ఇలాగే ఉండేది.

ఆర్థిక వ్యవస్థలో అటవీ ఉత్పత్తులు ఒక ముఖ్యమైన భాగంగా ఉండేవి. కలప, వెదురు, వంటచెరకు, లక్క, ఔషధమూలికలు వంటివి వాటిలో ఉండేవి.

ఇనుపకర్రు అమర్చిన కొయ్య నాగలి, ఇనుప కొడవలి, దున్నిన నేలను చదును చేయడం కోసం ఉపయోగించే బల్లచెక్క వంటివి వ్యవసాయ ఉపకరణాలుగా ఉండేవి. విత్తులను నాటేందుకు నాగలి వంటి పరికరాన్ని కాడికి అమర్చి దానికి రంధ్రం చేసి ఆ పైన విత్తులతో నిండిన పాత్రను అమర్చేవారు. ఆ రంధ్రంలోంచి దిగువకు జారిన విత్తనాలు భూమిలో లోతుగా నాటుకునేవి. బావులనుండి నీటిని మోట ద్వారా తోడేవారు. ఈ కాలంలో దానితోబాటు 'సాకియా' అనే చక్రాకారపు యంత్రాన్ని వాడకంలోకి తెచ్చారు. దీనిని పర్షియన్ వీల్ అని కూడా అంటారు. (కొన్ని నెలలకు ముందు వచ్చిన వ్యాసాల్లో సాంకేతిక అంశాల వివరాలు ఇచ్చాము) సింధు నదీ పరీవాహక ప్రాంతంలో దీని వినియోగం ఎక్కువగా ఉండేది. భూమిలో నీరు బాగా దిగువకు ఉండే ప్రాంతాల్లో ప్రతీ సిజన్‌లోనూ నూతులను మరింత లోతుగా తవ్వేవారు.

ఫిరోజ్‌షా కాలంలో (1351–1388) కాలువల ద్వారా మెట్ట ప్రాంతాలకు నీరందించే కార్యక్రమాలు బాగా జరిగాయి. సట్లెజ్, యమున నదుల మధ్య భాగంలో ఈ కాలువల నిర్మాణాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. (చూ. మ్యాప్ ) సుల్తాన్ అధికారంతోపాటు ఆర్థిక సంపత్తి కూడా తోడైతేనే ఇటువంటి నిర్మాణాలు సాధ్యమౌతాయి. సట్లెజ్ నుండి 140 కి.మీ. పొడవు దాకా సాగునీటి కాలువ తవ్వడం బట్టి ఆనాటి నిర్మాణ కౌశలం బోధపడుతుంది. ఇటువంటి కాలువలను విరివిగా తవ్వించారు. ఉత్తర డిల్లీలో వజీరాబాద్ వద్ద నేటికీ ఉనికిలో ఉన్న వంతెన, ఆనకట్ట ఆనాటి సాంకేతికకు నిదర్శనం.

ఐతే ఈ కాలువల నిర్మాణానికి కావలసిన సొమ్మును అదనపు శిస్తు రూపంలో రైతులనుండే వసూలు చేశారు. అంతే కాక, ప్రతీ ఏడూ ఆ కాలువలలో ఏర్పడే పూడికను తొలగించే భారం కూడా ఆ రైతులదే అయింది.

సాగు చేసే సీజన్‌లను రబీ, ఖరీఫ్ అని రెండు రకాలుగా వర్గీకరించారు. నేటికీ ఆ వర్గీకరణే కొనసాగుతోంది. గోధుమ, వరి, చిరుధాన్యాలు, అపరాలు, చెరుకు, పత్తి, నువ్వులు, ఆముదం వంటి పంటలు ఎక్కువగా పండించేవారు. తమలపాకు సాగు ఈ కాలంలో ప్రవేశించింది. అతిథులకు తమల పాకు ఇవ్వడం గొప్ప గౌరవంగా పరిగణించేవారు.

దక్షిణాదిన కేరళలో మిరియాల సాగు బాగా పెరిగింది. ఆ కాలానికి మన ఉపఖండంలో మిరప పంట ఇంకా ప్రవేశించలేదు. అందుచేత మిరియాలకు చాలా గిరాకీ ఉండేది. ఈ కాలంలోనే ప్రవేశించిన మరొక పంట గసగసాలు. దీనిని నల్లమందు తయారీకి వినియోగిస్తారు. నల్లమందు కలిగించే హానితో బాటు గసగసాలు ఆయుర్వేదంలో ఔషధంగా కూడా బాగా ఉపయోగపడుతుంది.

చైనా నుండి పట్టు సాగు మన దేశంలోకి ప్రవేశించింది ఈ కాలంలోనే. మల్బరీ తోటల పెంపకం, పట్టు సాగు దేశంలో వివిధ ప్రాంతాల్లో వేగంగా విస్తరించింది. పట్టు ఉత్పత్తికి ప్రపంచంలోనే ప్రధాన కేంద్రంగా బెంగాల్ తయారైంది ఈ కాలంలోనే. అక్కడ సంవత్సరానికి ఆరు పంటలు తీసేవారు. ఇక బహుళ ప్రయోజనాలను నెరవేర్చే కొబ్బరి సాగు కూడా బాగా విస్తరించింది. ముఖ్యంగా పశ్చిమ సముద్ర తీరాన ఇవి దట్టంగా పెరిగాయి.

మహమ్మద్ తుగ్లఖ్ కాలంలో ద్రాక్ష, ఖర్జూరం సాగును ప్రత్యేకించి ప్రోత్సహించారు. డిల్లీ పరిసర ప్రాంతాల్లో వీటి సాగు ఎక్కువగా ఉండేది. పుచ్చకాయలు, కర్బూజా సాగు కూడా చేపట్టారు.

(సశేషం)

# సామ్రాజ్యవాదం నాడు-నేడు



రచయిత ప్రముఖ చరిత్రకారుడు, పాత్రికేయుడు. 40 పుస్తకాలవరకు రాశారు. 'ట్రైకాంటినెంటల్:ఇన్‌స్టిట్యూట్ ఫర్ సోషల్ రిసెర్చ్" ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్. న్యూ ఢిల్లీలోని లెఫ్ట్ వర్డ్ బుక్స్ ప్రధాన సంపాదకులు

విజయ ప్రసాద్

**(ఈ వ్యాసం లెనిన్ రాసిన 'సామ్రాజ్యవాదం: పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ' గ్రంథాన్ని కేరళలోని చింత పబ్లిషర్స్ రెడ్‌బుక్‌డే సందర్భంగా పునఃముద్రిస్తున్న నేపథ్యంలో రాసిన ముందుమాట.)**

సామ్రాజ్యవాదం అంటే ఇవాళ అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల మధ్య మార్కెట్‌ల విస్తరణ కోసం నెలకొన్న పోటీతత్వం కాదు, గాఢమైన అసమానతలు, తీవ్ర సంక్షోభాలలో కూరుకుపోయి ఉన్న ప్రపంచక్రమంలో దిగనాసిల్లుతున్న సామ్రాజ్యవాద మూలాన్నీ, దాని ఆధిపత్యాన్నీ నిలబెట్టుకోవడానికి నిర్బంధపూరిత విధానాలకు తెగబడడం. 2008లో నెలకొన్న సబ్-ప్రైమ్ సంక్షోభానంతరం ధనిక దేశాల ఉత్పాదకత ఆర్థిక ఆధిపత్యానికి గండిపడడంతో సామ్రాజ్యవాదం నానాటికీ సైనిక బలప్రయోగం, ఆర్థిక ఆంక్షలు, సమాచార వ్యవస్థ మీద నియంత్రణ, రాజకీయంగా అస్థిరత్వం పాల్జెయ్యడం ద్వారా తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలని చూస్తోంది తప్పితే విశాల ప్రాతిపదికన ఆర్థిక కార్యకలాపాల విస్తరణ గురించి ఆలోచించడం లేదు.

ఈ దశనే 'అతి సామ్రాజ్యవాదం' (హైపర్ ఇంపీరియలిజం) గా చెప్పుకోవచ్చు. నేడు ఆర్థిక సార్వభౌమత్వాన్ని సాధించుకోడానికి కృషి చేస్తున్న వర్ధమాన దేశాల ప్రయత్నాలనూ, పేద దేశాల మధ్య పెరుగుతున్న సహకారాన్నీ, అగ్రరాజ్యంపై ఆధారపాటును తగ్గించుకోవడానికి చేస్తున్న కృషినీ సామ్రాజ్యవాద అమెరికా తన అనుంగు పెట్టుబడిదారీ అగ్ర దేశాలతో కలిసి దెబ్బ తీస్తున్నది. ఈ పరిణామాలు సామ్రాజ్యవాదం అంతమైపోవడానికి బదులుగా ఆధిపత్యం నిలుపుకోవడానికి దోపిడీని మరింత తీవ్రతరం చేసే దిశగా సాగుతున్న ప్రయత్నాలను విశదీకరిస్తున్నాయి. అందుకే అంతర్జాతీయ వ్యవస్థ యుద్ధాలు, ఆంక్షలు - ఈ రెండింటి సంకర విధానాలతో ఘర్షణ పూరితంగా తయారయ్యింది. ఈ రకమైన జోక్యాలు అంతర్జాతీయ యవనికలో శాశ్వత లక్షణాలుగా స్థిరపడే ప్రమాదం పొంచి ఉన్నది.

'సామ్రాజ్యవాదం' పై లెనిన్ సిద్ధాంత గ్రంథాన్ని వెలువరించి ఇప్పటికి వందేళ్లు దాటింది. 1914లో సంభవించిన మొదటి ప్రపంచ యుద్ధం నేపథ్యాన్ని వివరించే క్రమంలో లెనిన్ ఈ గ్రంథాన్ని రచించాడు. మార్క్సిస్టు అన్వయాచరణ మూలాధారంగా రచించిన ఆ పుస్తకం వర్తమాన సామ్రాజ్యవాద ధోరణులను అంచనా వెయ్యడానికి మౌలిక ఆదరువుగా నిలుస్తుంది. సామ్రాజ్యవాదాన్ని మార్క్సిస్టు దృక్పథంతో విశ్లేషించడానికి తగిన నిర్మాణ పద్ధతిని లెనిన్ రాసిన గ్రంథం సూచిస్తుంది. ఇక్కడ 'నిర్మాణపద్ధతి' అన్న పదం ప్రాధాన్యతను మనం గుర్తించాలి. ఎందుకంటే గతంలో రాసిన ఏ మార్క్సిస్టు విశ్లేషణనూ యథాతథంగా, ఒక మతక్రతువులా, భవిష్యత్తును అర్థం చేసుకోవడానికి వినియోగించుకోలేం. ప్రతి మార్క్సిస్టూ తమకు ఎదురుగా ఉన్న సందర్భాన్ని నిర్దిష్టంగా అత్యంత నిష్ఠతో వర్గ పోరాటాలను పదును తేల్చి, సామ్రాజ్యవాదాన్ని తుదముట్టించి ప్రజా రాశుల భౌతిక శక్తితో సోషలిస్టు వ్యవస్థ నిర్మాణానికి ఉపకరించే దిశగా నడిపించేలా విశ్లేషించుకోవాలి.

1916లో స్విట్జర్లాండ్‌కు ప్రవాసం పోయిన ఇద్దరు రష్యన్ విప్లవకారులు - లెనిన్, కృపస్కయా- తాము ఎదుర్కొంటున్న ఒక మౌలిక సమస్య గురించి చర్చించుకున్నారు. మార్క్సిస్టు ఉద్యమాల నుండి అవతరించిన సోషల్ డెమొక్రాట్ పార్టీలు యూరప్‌లో చెలరేగిన యుద్ధానికి మద్దతుగా నిలవాలని ఎందుకు నిర్ణయించాయి అనేదే వారికి అంతుబట్టని సమస్య. ఈ అంశం మీద అంతకు క్రితం ఏడాది జిమ్మర్ వాల్ట్ (స్విట్జర్లాండ్)లో జరిగిన యుద్ధవ్యతిరేక సోషలిస్టుల సదస్సు చర్చించి ఎట్టకేలకు రెండవ ఇంటర్నేషనల్ కుప్పకూలిపోయే పరిస్థితికి దారి తీసింది. జిమ్మర్‌వాల్ట్ సదస్సులో ఏం జరగనున్నదో ముందుగానే అంచనా వేసిన రీతిలో రోజా లగ్జెంబర్గ్ - వాస్తవానికి ఆమె ఈ సదస్సులో పాల్గొనలేదు కూడా - 'ఇంటర్నేషనల్‌ను పునర్నిర్మించాలి' అన్న వ్యాసం వెలువరించారు.

శాంతియుత కాలంలో ప్రతి దేశంలోనూ వర్గ పోరాటాలు పెంపొందించాలి, ఇతర దేశాలలో జరిగే వర్గ పోరాటాలకు అంతర్జాతీయ సంఘీభావాన్ని ప్రకటించాలి. అదే యుద్ధ కాలంలో అయితే వివిధ దేశాల కార్మికుల మధ్య పోరాటాన్ని నివారించడానికి వర్గ సంఘీభావాన్ని పెంపొందించాలి. 'కమ్యూనిస్టు ప్రణాళిక' చేసిన ఈ అంతర్జాతీయ చారిత్రక విజ్ఞప్తి మౌలికంగా మార్పుకులోనయ్యింది. కార్ల్ కాట్‌స్కీ సవరించిన మాటల్లో చెప్పుకోవాలంటే 'సకల దేశ శ్రామికుల్లారా శాంతి కాలంలో ఐక్యంగా ఉండండి, యుద్ధకాలంలో ఒకరి పీకలు మరొకరు తెగ్గోసుకోండి'గా చలామణిలోకి వచ్చింది.

జర్మన్ సోషల్ డెమోక్రసీ నాయకుడయిన కార్ల్ కాట్‌స్కీ చేపట్టిన ఈ వైఖరిని రోజా లగ్జెంబర్గ్ ఒక ప్రకటనలో తీవ్రంగా

**“మొదట ఈ గ్రంథానికి లెనిన్ ‘యూరప్ దేశాలు యుద్ధంలోకి ఎందుకు దిగాయి, ఈ యుద్ధానికి సామ్రాజ్య వాదం ఎలా కారణం అయ్యింది’ అన్న శీర్షిక ఉంచాలని భావించాడు. ఈ గ్రంథ రచనకు ప్రధానంగా బ్రిటిష్ ఉదార వాది జె.ఎ.హబ్సన్ రచించిన ‘సామ్రాజ్యవాదం ఒక అధ్యయనం’ (1902), అలాగే ఆస్ట్రియా మార్క్సిస్టు మేధావి రూడాల్ఫ్ హిల్ఫర్‌డింగ్ రాసిన ఫైనాన్స్‌పెట్టుబడి (1910) గ్రంథాలను ఆధారంగా చేసుకున్నాడు ”**

ఖండించింది. జిమ్మర్ వాల్ట్‌లో జరిగిన చర్చలలో కూడా కాట్‌స్కీ వైఖరి ఖండన మండనలకు గురయ్యింది. స్విట్జర్లాండ్ సోషల్ డెమోక్రాట్ల నాయకుడైన రాబర్ట్ గ్రిమ్ సదస్సుకు హాజరైన ప్రతినిధులకు స్వాగతం పలుకుతూ ‘స్వయం ప్రకటిత సోషలిస్టు ప్రతినిధుల నుండి చేజారిన సోషలిస్టు పతాకాన్ని సమున్నతంగా ఎత్తిపడదాం, ఘోరమైన యుద్ధభూముల్లో అసలు సిసలయిన మానవత్వానికి ప్రతీకగా పాతేద్దాం’ అని పిలుపునిచ్చాడు. వామపక్ష అజెండా చేతబూనిన లెనిన్ వైనార్టీ ప్రతినిధులతో రెండవ ఇంటర్నేషనల్‌తో తెగతెంపులు చేసుకొని మూడవ ఇంటర్నేషనల్ స్థాపించాడు. ‘యూరప్ కార్మికవర్గం యుద్ధాన్ని వ్యతిరేకించి ఆయా దేశాల్లోని పాలకవర్గాలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించాలి’ అని పిలుపునిచ్చాడు. యుద్ధం పట్ల అనుసరించా ల్సిన వ్యూహంపై జిమ్మర్‌వాల్ట్ సదస్సులో భిన్నాభిప్రాయాలు వెలువడినా ఆ యుద్ధానికి మూలకారణం ‘సామ్రాజ్యవాదమే’ అని ఏకాభిప్రాయాన్ని ప్రకటించింది. ఈ మూలకారణాన్ని కమ్యూనిస్టు ప్రణాళిక లోతుగా సరైనరీతిలో విశ్లేషించలేదు. కాబట్టి జిమ్మర్ వాల్ట్ సదస్సు తర్వాత లెనిన్, కృపస్కయా ఆ బాధ్యతను తమ భుజాలకు ఎత్తుకున్నారు.

అయితే స్విట్జర్లాండ్‌లో ఉంటున్న ఇంట్లో తమకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో లేకుండాపోయాయి. మొదట ఈ గ్రంథానికి లెనిన్ ‘యూరప్ దేశాలు యుద్ధంలోకి ఎందుకు దిగాయి, ఈ యుద్ధానికి సామ్రాజ్యవాదం ఎలా కారణం అయ్యింది’ అన్న శీర్షిక ఉంచాలని భావించాడు. ఈ గ్రంథ రచనకు ప్రధానంగా బ్రిటిష్ ఉదారవాది జె.ఎ.హబ్సన్ రచించిన ‘సామ్రాజ్యవాదం ఒక అధ్యయనం’ (1902), అలాగే ఆస్ట్రియా మార్క్సిస్టు మేధావి రూడాల్ఫ్ హిల్ఫర్‌డింగ్ రాసిన ఫైనాన్స్‌పెట్టుబడి (1910) గ్రంథాలను ఆధారంగా చేసుకున్నాడు లెనిన్. కృపస్కయా చేతిరాతతో లెక్కలేనన్ని నోట్‌బుక్స్ నిండిపోయాయి. 148 ఇతర గ్రంథాల నుండి, 232 వ్యాసాల నుండి అనేక ఉటంకింపులు ఆ చేతిరాత పుస్తకాల్లో ఉన్నాయి. ఎట్టకేలకు 35,000 రష్యన్ పదాలతో లెనిన్ రచన పూర్తయ్యింది. 1917లో పెట్రోగ్రాడ్‌లో సెన్సార్ చేయబడిన పాఠంగా ఈ గ్రంథం తొలిముద్రణకు నోచుకున్నది. అక్టోబర్ సోషలిస్టు విప్లవం విజయవంతం అయ్యాక తిరిగి పూర్తి పాఠంతో అచ్చయ్యింది.

‘సామ్రాజ్యవాదం: పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ’ అన్న ఈ పుస్తకంలో అద్భుతమైన అంశాలు ఎన్నో ఉన్నాయి. అయితే నేను సంక్షిప్తంగా కేవలం ఐదు అంశాలను ఇక్కడ ప్రస్తావిస్తాను:

**1. సామ్రాజ్యవాదం అనేది పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ యొక్క మరో రూపం:** పెట్టుబడిదారీ దేశాల మధ్యన నెలకొని ఉండే తీవ్రమైన అంతర్గత పోటీ మూలంగా జాతిరాజ్యం భౌగోళిక పరిధిలో వివిధ రంగాలలో గుత్తసంస్థల నిర్మాణం వైపు మొగ్గుతుంది. ఈ గుత్త సంస్థలకు ఆ భౌగోళికపరిధిలో పరిమితులన్నీ తీరిపోయాక ఆయా గుత్తసంస్థలకు వనరులు, మార్కెట్‌లు అవసరపడతాయి. వీటి కోసం పరాయి దేశాల్లోని గుత్తసంస్థలతో ఘర్షణ నెలకొంటుంది. పెట్టుబడిదారుల మధ్య నెలకొనే ఈ పోటీలోకి రాజ్యాధికారాన్ని లాగుతాయి. రాజ్యానికి ఉన్న వనరులను వినియోగించు కుంటూ తమ జెండాను మోసే రాజ్యానికి కొన్ని ప్రయోజనాలు సమకూరు స్తాయి. ఆవిధంగా పెట్టుబడిదారుల మధ్య ఉన్న ఘర్షణ రాజ్యాల మధ్య ఘర్షణగా పరిణమిస్తుంది. భౌగోళిక హద్దులు దాటాలనే విస్తరణ కాంక్షే సామ్రాజ్యవాదం.

**2. ఉత్పత్తి కేంద్రీకరణ నుండి ద్రవ్య పెట్టుబడి ప్రభవిస్తుంది:** గుత్తాధిపత్యం నెలకొల్పాలనే ధోరణి కొన్ని బడా సంస్థలతో ఉత్పత్తి, ద్రవ్య కేంద్రీకరణలకు దారితీస్తుంది. అంటే పారిశ్రామిక, బ్యాంకింగ్ పెట్టుబడులు రెండూ ఏకమైపోతాయి. తత్పర్యవసానంగా ద్రవ్య పెట్టుబడి ఆవిర్భవిస్తుంది. ఈ ద్రవ్య పెట్టుబడి గుత్తేదారులే రాజకీయ ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యం చాలాయిస్తారు.


**3. పెట్టుబడి ఎగుమతి – అంతర్జాతీయ ఆర్థిక శక్తి పంపకాలు:** సామ్రాజ్యవాద పునాదిగా ఉన్న ఉత్తర అమెరికా, ఐరోపా దేశాలలో పెట్టుబడుల పోగువేత భారీ స్థాయికి చేరుకోవడంతో ఈ పెట్టుబడులను ఖండాంతర దేశాలకు ఎగుమతి చేసే అవకాశం దక్కుతుంది. పెట్టుబడి విస్తరణకు ఈ ఎగుమతులే కీలకం, పెట్టుబడుల ఎగుమతులను అడ్డం పెట్టుకొని ఈ రాజ్యాలు ఇతర దేశాలను వలస దోపిడీకి గురిచేస్తాయి. ప్రపంచ దేశాలను భాగాలు వేసుకుని పంచుకుని వలసలుగా మార్చేస్తాయి. సామాజిక జీవితంలో ఈ ద్రవ్య పెట్టుబడి భౌతిక శక్తిగా అధికారం చాలాయిస్తుంది.

**4. సామ్రాజ్యవాదం శాశ్వత లక్షణమే యుద్ధం:** సామ్రాజ్యవాదానికి ఉన్న ఆర్థిక తర్కం, సామ్రాజ్యవాద శక్తుల మధ్య యుద్ధాలను అనివార్యం చేస్తుంది. మార్కెట్‌లు, వనరులు, భౌగోళిక సరిహద్దుల కోసం గుత్తాధిపత్య సంస్థల మధ్యన నెలకొన్న పోటీ మూలంగానే సామ్రాజ్యవాద యుద్ధాలు సంభవిస్తాయి. 1914లో ఆరంభమయిన (మొదటి ప్రపంచ) యుద్ధమే దీనికి తాజా ఉదాహరణ. ఆస్ట్రియన్ రారాజు ఫ్రాంజ్ ఫెర్డినాండ్ హత్య కావించబడటమో, లేక సోషల్ డెమోక్రాట్లు యుద్ధ రుణ సేకరణకు అనుకూలంగా ఓటు వెయ్యడం మూలంగానో యుద్ధం మొదలు కాలేదు. పెట్టుబడిదారీ విధానపు అంతర్గత తర్కం యొక్క వికృత రూపమయిన సామ్రాజ్యవాదం కారణంగా యుద్ధం మొదలయ్యింది.

**5. సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ వ్యవస్థ పతనానికీ, కార్మికవర్గ విప్లవకర శక్తులు పదునెక్కడానికీ తార్కాణం:** సామ్రాజ్యవాదం పరాన్న భుక్కు సంస్కృతిని ఉత్పత్తి చేస్తుంది. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ సమాజాల్లో పతనానికి దారితీస్తుంది. అయితే ఈ దశలోని వైరుధ్యాలు వర్గ వైరుధ్యాలను తీవ్రతరం చేసేందుకు దోహదం చేస్తాయి అని లెనిన్ వాదించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ అత్యున్నత రూపమయిన సామ్రాజ్యవాదం ప్రపంచ కార్మిక వర్గ విప్లవానికి తగిన పరిస్థితులు సృష్టిస్తుంది అని లెనిన్ అంచనావేశాడు.

లెనిన్ రచించిన 'సామ్రాజ్యవాదం' అన్న గ్రంథం ఒక సంధి దశలో జోక్యంగా పరిగణించాలే తప్ప సంపూర్తి చేసిన తుది విధానంగా భావించరాదు. అందుకే ఈ పుస్తకం నాటి చారిత్రక సందర్భానికి గుర్తుగా నిలిచిపోతుంది. సామ్రాజ్యవాద వైరుధ్యాలు తీవ్రతరమయ్యే కొలదీ అవి యూరప్ ఖండమంతటా వేగవంతమైన విప్లవ విస్ఫోటనాలకు దారితీస్తాయని లెనిన్ అంచనా వేశాడు. ఈ అంచనా చరిత్రలో పాక్షికంగా మాత్రమే విజయవంతం అయ్యింది. అలాగే వలస, అర్ధ-వలస దేశాలలో నెలకొని ఉండే అసమాన వర్గ పొందికల మీద లెనిన్ తక్కువగా దృష్టి సారించాడు. ఈ దేశాలలో పారిశ్రామిక కార్మికుల సంఖ్య తక్కువ, రైతాంగం మెజార్టీగా ఉన్న పరిస్థితులు నెలకొని ఉన్నాయి. వలస దేశాలకు సంబంధించిన ఈ ఖాళీలు సైద్ధాంతికంగా లెనిన్ దృష్టిలో లేకపోవడం అంటూ లేదు. 1916లో తన ముందున్న తక్షణ రాజకీయ కర్తవ్యలక్ష్యం దృష్ట్యా లెనిన్ ప్రధానంగా సోషల్ డెమోక్రసీ పాల్పడిన ద్రోహానికి మూల కారణాలను వివరించడం, సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్జాతీయ వామపక్ష దృక్పథం నుండి విశ్లేషించి కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌ను సాయుధం చేయడం మీదనే దృష్టి కేంద్రీకరించాడు. ఈ గ్రంథం విశిష్టత ఏమిటంటే – లెనిన్ అనుసరించిన మార్క్సిస్టు విశ్లేషణాపద్ధతి చరిత్రలో వేళ్ళూనుకుని, సంక్షోభం మూలంగా పదునుతేలి, మరింత అభివృద్ధి చేసేందుకు వీలుగా ఉండడమే.

**"లెనిన్ రాసిన ఈ పుస్తకంలో ఇంకుతడి ఆరకముందే యూరప్ దేశాలు అన్నింటా వర్గ పోరాటాలు వెల్లువెత్తాయి. 1916 మే డే సందర్భంగా కార్మికులు సమ్మె చేశారు. బెర్లిన్ వీధులలో 10,000 మందితో భారీ ప్రదర్శన జరిగింది. ఈ పరిణామాలకు తోడు యుద్ధాన్ని బలపరిచిన సోషలిస్టు పార్టీలకు ప్రజలలో మద్దతు తగ్గుముఖం పట్టింది. లెనిన్ సైద్ధాంతిక ప్రతిపాదనలు సరైనవని ఈ రెండు పరిణామాలు రుజువు చేశాయి."**




లెనిన్ రాసిన ఈ పుస్తకంలో ఇంకుతడి ఆరకముందే యూరప్ దేశాలు అన్నింటా వర్గ పోరాటాలు వెల్లువెత్తాయి. 1916 మే డే సందర్భంగా కార్మికులు సమ్మె చేశారు. బెర్లిన్ వీధులలో 10,000 మందితో భారీ ప్రదర్శన జరిగింది. ఈ పరిణామాలకు తోడు యుద్ధాన్ని బలపరిచిన సోషలిస్టు పార్టీలకు ప్రజలలో మద్దతు తగ్గుముఖం పట్టింది. లెనిన్ సైద్ధాంతిక ప్రతిపాదనలు సరైనవని ఈ రెండు పరిణామాలు రుజువు చేశాయి. 1917లో రష్యాలో చెలరేగిన ఆందోళనలు జార్ రాజరిక పాలనకు చరమగీతం పలికాయి. పౌర ప్రభుత్వం ఏర్పడింది. అయితే ఈ ప్రభుత్వాన్ని నడిపించిన అలెగ్జాండర్ కెరెన్‌స్కీ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమయ్యాడు. దాంతో సోవియట్‌లదే రాజ్యం నినాదంతో ఎక్కడికక్కడ స్వయంపాలనకు నడుం కట్టారు ప్రజలు. లెనిన్ రష్యాకు తిరిగి రావడం, 'ఏప్రిల్ థీసిస్' పేరిట ఒక కరపత్రాన్ని విస్తృతంగా పంపిణీ చెయ్యడం, భూమి-శాంతి-రొట్టె కావాలని నినాదం ఇవ్వడం రష్యన్లను 'అక్టోబర్ విప్లవానికి' పురికొల్పింది. యూరప్ అంతటా కూడా మహత్తర అక్టోబర్ సోషలిస్ట్ విప్లవం ప్రభావం పొడచూపింది. 1918 లో జర్మనీలో 'నవంబర్ విప్లవం' హంగేరీలో 'ఏస్టర్ విప్లవం' ఇటలీలో 'బైయన్నియోరోసో' ఉద్యమాలు సంభవించాయి. 1919లో జర్మనీలో స్పార్టానియన్ల తిరుగుబాటు, హంగేరి సోవియట్ రిపబ్లిక్, బవేరియా సోవియట్ రిపబ్లిక్‌ల ఆవిర్భావ ప్రకటనలతో పాటు బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలలో పెద్ద ఎత్తున కార్మిక అశాంతులు ప్రబలాయి. దీంతో విప్లవ ప్రతీఘాత శక్తులు చురుగ్గా కదిలాయి. పురిటిలోనే రష్యన్ బోల్షివిజం పీక నొక్కాలని చూసిన విన్‌స్టన్ చర్చిల్ నాయకత్వాన ఈ విప్లవాల అణిచివేతకు యావత్ సైనికశక్తిని వినియోగించారు. రక్తంలో ముంచెత్తిన తుపాకి కొసన కత్తులతో ఐరోపా భూఖండం మీద ఫాసిజాన్ని విత్తారు. రోజా లగ్జెంబర్గ్, కార్ల్ లీబ్నెక్ట్ వంటి విప్లవకారులను హతమార్చారు.

ఐరోపా విప్లవాల పరాజయం మొదటి ప్రపంచ యుద్ధం మూలంగా సంభవించిన విప్లవాల శకం ప్రాధాన్యతను ఎంత మాత్రం మసక బార్చలేదు. పైపెచ్చు భౌగోళిక, సామాజిక విస్థాపనలను బహిర్గతం చేసాయి. సామ్రాజ్యవాధాన్ని పుణికి పుచ్చుకున్న ప్రతీఘాత విప్లవం విజయం సాధించింది. అయితే సామ్రాజ్యవాద శక్తులలోని అంతర్గత వైరుధ్యాలు వలస, అర్ధ-వలస దేశాల్లో మరింతగా ప్రస్ఫుటమయ్యాయి. ఆయా దేశాల్లో మరింత విచ్చలవిడి దోపిడీ సాగింది. రాజ్యం చట్టబద్ధత మరింత బలహీన పడింది. దాంతో ఈ వలస, అర్ధ-వలస దేశాల్లో మార్క్సిజం స్ఫూర్తితో రైతాంగం, వలస పాలనా పీడిత ప్రజానీకం ఆధ్వర్యంలో చైనా నుండి వియత్నాం, క్యూబా, దక్షిణాఫ్రికా దేశాల వరకు జాతీయ విముక్తి ఉద్యమాలు ప్రజ్వరిల్లాయి. ఆ విధంగా లెనిన్ ఐరోపాను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన నిర్మాణం, సామ్రాజ్యవాదానికి బయటి అంచున ఉన్న దేశాల్లోని విప్లవ శక్తులకు దారిదీపంగా అక్కరకు వచ్చింది. తద్వారా 'సామ్రాజ్య వాదం'పై లెనిన్ రూపొందించిన సిద్ధాంతం అంతిమం కాదనీ, దానిని ఆయా స్థల కాలాలకు అనువుగా అన్వయించుకోదగ్గ సిద్ధాంతమని

**❝ యూరప్ దేశాల్లో విప్లవాలు అపజయాల పాలు కావడం, బాల్యావస్థలో ఉన్న సోషలిస్టు రష్యా మీద దాడులు పెరగడంతో 'సామ్రాజ్యవాదం' గ్రంథంలో లెనిన్ పొందుపరిచిన బలాబలాల పొందికలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఇందుకు అనుగుణంగా పుస్తక పాఠంలో తగిన మార్పులు చెయ్యడానికి లెనిన్‌కు సమయం చిక్కలేదు. దాంతో 1916లో రచించిన ఈ గ్రంథం యథాతథంగా 1917లో అచ్చయ్యింది. ❞**

సామ్రాజ్యవాదం గ్రంథ పాఠాన్ని చౌకగా, సంక్షిప్త రూపంలో, ధారావాహికంగా ప్రచురించిన వాటి నుండో ఫ్రెంచి, జర్మన్ ప్రతుల నుండో ఎక్కువగా వెలుగులోకి తెచ్చారు. కానీ నేరుగా రష్యన్ భాష నుండి ఇతర భాషలలోకి వచ్చిన అనువాదాలు తక్కువ. అప్పట్లో 'సెన్సార్‌షిప్' అమలులో ఉన్నందున, పుస్తకాల కొరత మూలంగా ఇది ఒకరి నుండి మరొకరు పంచుకుంటూ చదివారు. తదనంతర కాలంలో చైనా, వియత్నాం, అరబిక్ భాషలలోకి అనువదించబడింది. 1957లో పి.ఆర్ నంబియార్ దీనిని మళయాళంలోకి అనువదించగా దేశాభిమాని ఈ పుస్తకాన్ని ప్రచురించింది.

యూరప్ దేశాల్లో విప్లవాలు అపజయాల పాలు కావడం, బాల్యావస్థలో ఉన్న సోషలిస్టు రష్యా మీద దాడులు పెరగడంతో 'సామ్రాజ్యవాదం' గ్రంథంలో లెనిన్ పొందుపరిచిన బలాబలాల పొందికలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఇందుకు అనుగుణంగా పుస్తక పాఠంలో తగిన మార్పులు చెయ్యడానికి లెనిన్‌కు సమయం చిక్కలేదు. దాంతో 1916లో రచించిన ఈ గ్రంథం యథాతథంగా 1917లో అచ్చయ్యింది. ఆనాడు ఐరోపా సామ్రాజ్యవాదశక్తుల మధ్య నెలకొన్న అంతర్గత వైరుధ్యాలు, ఘర్షణలను తాత్కాలికంగా పక్కనపెట్టి సోషలిస్టు రష్యాను, ఐరోపా దేశాల్లో చెలరేగిన విప్లవాలను అణిచివెయ్యడానికి పూనుకున్నాయి. సోషలిస్టు రష్యాను దుంప నాశనం చెయ్యడానికి పెట్టుబడిదారీ దేశాలు జట్టుకట్టాయి. తదనంతర కాలంలో వియత్నాం, చైనా, క్యూబా తదితర సోషలిస్టు దేశాల మీదా, జాతీయ విముక్తి ఉద్యమాల మీదా అదే జట్టు దాడులు కొనసాగించింది. తద్వారా యావత్ ప్రపంచం రెండు శిబిరాలుగా – ఒకటి సామ్రాజ్యవాద శిబిరం, రెండవది సోషలిస్టు, శాంతి శిబిరం – విడి పోయింది. రెండవ ప్రపంచ యుద్ధంలో ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడిన ప్రధాన దేశాలు రష్యా, చైనాలు మాత్రమే. 1991లో సోషలిస్టు రష్యా పతనం అయ్యేవరకు అటు విస్తరిస్తున్న సోషలిస్టు శిబిరానికీ, ఇటు తృతీయ ప్రపంచ దేశాలు నెలకొల్పుకున్న అలీన దేశాల శిబిరాలకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాద శిబిరం దాడులు, కుట్రలు కొనసాగిస్తూనే వచ్చింది.

ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో సామ్రాజ్యవాద నిర్మాణ స్వరూపంలో నిర్ణయాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు అంతర్గత శత్రుత్వాలను పక్కన పెట్టడానికి కారణం సోషలిస్టు, అలీన దేశాల శిబిరానికి, సామ్రాజ్యవాద శిబిరానికి మధ్యన నెలకొన్న ఘర్షణ ప్రధాన వైరుధ్యంగా ముందుకు రావడమే. అయితే ఈ దశలో సామ్రాజ్యవాదం వెనుకపట్టు పట్టింది అని తీర్మానించడం పొరబాటు వైఖరి అవుతుంది. ప్రత్యామ్నాయ సోషలిస్టు సామాజిక వ్యవస్థ విసిరిన సవాలు కారణంగా తాత్కాలిక సర్దుబాటులో భాగంగా సామ్రాజ్యవాద పెట్టుబడికి ఉన్న స్వేచ్ఛను ఒక మోస్తరుగా నియంత్రించుకున్నారు. సోషలిస్టు రష్యా ఉనికి, జాతీయ విముక్తి ఉద్యమాలు సాధిస్తున్న విజయాల కారణంగా ఆర్థిక, రాజకీయ, సైనిక రంగాల ద్వారా సాగిస్తున్న సామ్రాజ్యవాద విస్తరణకు పరిమితులు విధించుకున్నారు కానీ సామ్రాజ్యవాద దోపిడీని, జోక్యాలను ఇతరేతర మార్గాల ద్వారా కొనసాగించారు.

సోవియట్ సోషలిస్టు రష్యా కూలిపోవడంతో అమెరికా ఇతర ఐరోపా పెట్టుబడిదారీ దేశాలతో కలిసి సైనికంగా 'నాటో' కూటమిని, ఆర్థిక రాజకీయ రంగాల్లో జి–7 కూటమిని, 11 కళ్ళు పేరిట ఇంటలిజెన్స్ కూటమిని ఏర్పాటు చేసి మన భూప్రపంచం మీద అవధులు లేని అధికారం చలాయించడం మొదలుపెట్టింది. 'అమెరికా నూతన శతాబ్ది'ని నెలకొల్పడం తన లక్ష్యంగా ప్రకటించింది. అందుకుగాను ఏ పద్ధతులలో ఎంతటి బల ప్రయోగానికయినా పాల్పడడానికి సిద్ధపడింది.

ఈ నూతన అజెండాను ముందుకు తీసుకుపోవడానికి తొలుత అమెరికాకు పెద్ద సవాళ్లు ఎదురు కాలేదు. దాంతో పనామా, ఇరాక్, యుగోస్లోవియాల మీద సైనిక చర్య చేపట్టింది. ఉగ్రవాదంపై పోరు (2001) ఇరాక్ దురాక్రమణ (2003) ఆపై ఈ భోగోళం మీద అనేక దేశాల అంతర్గత పరిణామాలపై అనవసర జోక్యానికి పూనుకోవడానికి వీలుగా అమెరికా భారీ ఎత్తున విధ్వంసక ఆయుధాలను పోగుచేసుకున్నది. ప్రపంచ దేశాల నుండి కొల్లగొట్టిన సంపదను తన దేశ పౌరులకు ఉపకరించే నూతన పరిశ్రమల స్థాపన, నూతన సాంకేతిక ఆవిష్కరణల మీద వెచ్చించడానికి బదులుగా సైనిక పాటవాన్ని, అధునాతన ఆయుధ తయారీ పరిశ్రమలకు వెచ్చించింది. 21వ శతాబ్దపు తొలి దశాబ్దం ముగిసే నాటికి అమెరికా విదేశాలలో దాదాపు 900కు పైన సైనిక స్థావరాలను నెలకొల్పింది. మొత్తం ప్రపంచ సైనిక వ్యయంలో సగానికి పైగా వ్యయం ఒక అమెరికానే చేస్తుంది. కేవలం కొన్ని దేశాలు మాత్రమే అణ్వాయిదాలు కలిగి ఉన్నందున అమెరికా వాటి జోలికి పోలేకపోయింది.

2008లో ఆధునిక పెట్టుబడిదారీ దేశాల్లో మూడవ విడతగా మహా ఆర్థిక మాంద్యం నెలకొన్న నేపథ్యంలో ధనిక దేశాల మార్కెట్లు వర్ధమాన దేశాల ఉత్పత్తులను పూర్తిగా

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**
**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

కొనుగోలు చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో వర్ధమాన దేశాలు పరస్పర వాణిజ్యం పెంచుకోవడం మీద దృష్టి పెట్టి అందుకు తగిన అంతర్జాతీయ రవాణా మార్గాలు పెంపొందించుకోసాగాయి. చైనా మరికొన్ని ఆసియా ఆర్థిక వ్యవస్థలు అత్యధిక వృద్ధిరేటు సాధిస్తూ ఉత్పత్తి శక్తులను ఆధునీకరించు కున్నాయి. అమెరికా పునః పారిశ్రామికీకరణ ప్రయత్నాలు మొదలుపెట్టింది కానీ ఆసియా ఖండ దేశాలు సాధించిన ప్రగతి మూలంగా అవి ఆశించిన మేర ఫలించలేదు. చైనా మరికొన్ని వర్ధమాన దేశాలు సాధించిన అభివృద్ధి మూలంగా అమెరికా ఎదుర్కొంటున్న సవాళ్లకు ప్రతిగా సమాచార రంగం మీదా, సైనిక రంగం మీదా తన నియంత్రణల పట్టు మరింత పెంచింది.

ఈ నేపథ్యంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ రీసెర్చ్ – ట్రై కాంటినెంటల్ సంస్థ లెనిన్ అధ్యయన పద్ధతులను ఆధారం చేసుకుని అమెరికా దాని అనుంగు ధనిక మిత్ర దేశాలకు – దక్షిణాది దేశాలకు మధ్య నెలకొన్న పోటీ స్వభావాన్ని సమగ్రంగా అధ్యయనం చేసింది. ఆ అధ్యయన వివరాలను హైపర్ ఇంపీరియలిజం (అతి సామ్రాజ్యవాదం) పేరిట వెలువరించాలి. అమెరికా నాయకత్వంలోని ధనిక దేశాలు ముడి సరుకులు, ఫైనాన్స్, సైన్సు సాంకేతిక రంగాల్లో తమ నియంత్రణను పూర్తిగా కోల్పోయాయి. సమాచార–సైనిక రంగాల మీద ఉన్న ఆదిపత్యాన్ని అడ్డం పెట్టుకొని తమకు పోటీగా ఉన్న ఏ దేశం మీద అయినా దాడి చేయడానికి ముఖ్యంగా రష్యా, చైనాల మీద దాడికి సిద్ధంగా ఉన్నాయి. అయితే చైనా, రష్యాలు అమెరికాకు వ్యతిరేకంగా కూటమి కట్టాలి అన్న ఆకాంక్షతో లేవు. సైనికపరంగా చూస్తే ఈ రెండు దేశాలూ స్వీయ రక్షణకు తగినంత సైనిక పాటవాన్ని కలిగి ఉన్నాయి దానాదీనా ప్రస్తుతానికి సామ్రాజ్యవాద శిబిరంలో అంతర్గత వైరుధ్యాలు లేవు అని నిర్ధారణకు రావచ్చు. ఇప్పుడు అమెరికా నాయకత్వాన దాని అడుగులకు మడుగులు ఒత్తుతున్న ఐరోపా పెట్టుబడి దారీ అగ్రదేశాలు యావత్ వర్ధమాన దేశాలకు వ్యతిరేకంగా మోహరించాయి. ఈ 'అతి' సామ్రాజ్యవాదం సామ్రాజ్యవాదంలో నూతన దశ అనేది మా అభిప్రాయం. ఇది సంప్రదాయ సామ్రాజ్యవాదానికి అస్థిరమైన, అతిశయోక్తి రూపం. అమెరికా తన ఆర్థిక ఆధిపత్యాన్ని కోల్పోయిన నేపథ్యంలో దక్షిణార్థ గోళ దేశాలను కట్టడి చెయ్యడానికి, వాటి మీద ఆధిపత్యం చలాయించడానికి సైనిక పరంగానూ, సైనిక–ఆర్థిక–రాజకీయ సంకర రూపాలలోనూ దాడులకు సిద్ధపడుతుంది. లెనిన్ సామ్రాజ్యవాద సిద్ధాంతాన్ని మరింత విస్తరిస్తే, సామ్రాజ్యవాద ఆధిపత్యం క్షీణిస్తూ దక్షిణార్థ భూగోళ దేశాల సవాళ్ళు పెరుగుతున్న నేపథ్యంలో మరింత నిర్బంధ పూరితమైన, సైనిక పరమైన అస్థిర దశలోకి ప్రవేశించడమే 'అతి సామ్రాజ్యవాద' దశగా మనం చెప్పుకోవచ్చు.

“ అమెరికా నాయకత్వంలోని ధనిక దేశాలు ముడి సరుకులు, ఫైనాన్స్, సైన్సు సాంకేతిక రంగాల్లో తమ నియంత్రణను పూర్తిగా కోల్పోయాయి. సమాచార-సైనిక రంగాల మీద ఉన్న ఆదిపత్యాన్ని అడ్డం పెట్టుకొని తమకు పోటీగా ఉన్న ఏ దేశం మీద అయినా దాడి చేయడానికి ముఖ్యంగా రష్యా, చైనాల మీద దాడికి సిద్ధంగా ఉన్నాయి. అయితే చైనా, రష్యాలు అమెరికాకు వ్యతిరేకంగా కూటమి కట్టాలి అన్న ఆకాంక్షతో లేవు. సైనికపరంగా చూస్తే ఈ రెండు దేశాలూ స్వీయ రక్షణకు తగినంత సైనిక పాటవాన్ని కలిగి ఉన్నాయి ”



ఇది లెనిన్ సిద్ధాంతాన్ని చారిత్రకంగా విస్తరించడమే తప్ప తృణీకరించడం కాదు. లెనిన్ సైద్ధాంతిక నిర్మాణ పద్ధతులను అనుసరించడం అంటే అమూర్త నమూనాలను పరిగణనలోకి తీసుకోవడంకాదు, బలా బలాల పొందికను, పెట్టుబడి సంచయ రూపాలను, ఆధిపత్య వర్గాలకు అందుబాటులో ఉన్న రాజ్యాధికార సాధనాలను పరిగణనలోకి తీసుకోవడం. సంప్రదాయ సామ్రాజ్యవాదం అధికాధికంగా ఆర్థిక విస్తరణ, వలస పాలనా పద్ధతుల మీద ఆధారపడి ఉంటుంది. 'అతి సామ్రాజ్యవాదం'లో ఆర్థిక ఆధిపత్యం క్షీణించిన మూలాన సైనిక బలప్రయోగం, ఆంక్షలు విధింపు, సమాచార నియంత్రణ వంటి నిర్బంధ పూరిత చర్యలకు పాల్పడడం పరిపాటిగా మారుతుంది. ఈ మార్పు సామ్రాజ్యవాద ఆర్థిక పునాదుల గురించి లెనిన్ చేసిన విశ్లేషణను పూర్వపక్షం చెయ్యదు, ఆ ఆర్థిక పునాదుల క్షయాన్ని సూచిస్తుంది.

లెనిన్ రాసిన 'సామ్రాజ్య వాదం' పుస్తకాన్ని ఇవాళ మళ్లీ అధ్యయనం చెయ్యడమంటే మార్క్సిస్టు రాజకీయ అర్థశాస్త్రాన్ని కేవల పరామర్శ చెయ్యడం కాదు, యుద్ధాలు, అసమానతలు, సామ్రాజ్యవాద ఆధిపత్యాల నేపథ్యంలో శ్రామికవర్గ అంతర్జాతీయత ఎదుర్కొంటున్న సవాళ్ళను అధ్యయనం చెయ్యడం అని అర్థం చేసుకోవాలి. ఒక శతాబ్ద కాలం తర్వాత శాశ్వత యుద్ధాలు, ఆంక్షల శకం, పర్యావరణ విధ్వంసం వంటి సమస్యలు యథాతథంగా కొనసాగుతున్నాయి. కాబట్టి సామ్రాజ్యవాదశక్తి నిర్మాణస్వరూపాన్ని నిర్దిష్టంగా అంచనా వేస్తే తప్ప దానిని ధీటుగా ఎదుర్కోలేం. కాబట్టి మన కాలపు అతి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా శ్రామిక వర్గ అంతర్జాతీయతను పెంపొందించుకుని మన పోరాట సాధనాలను పదును పెట్టుకుందాం.

(అనువాదం– కె.సత్యరంజన్)

ఆర్థికరంగం

# ట్రంప్ టారీఫ్‌లు : అమెరికా బహుళజాతి సంస్థలు



రచయిత కాలిఫోర్నియాలోని అథర్టన్ మెన్లో కాలేజిలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 'మంత్లీ రివ్యూ' మ్యాగజైన్‌కు దీర్ఘకాలంగా రచనలు అందచేస్తున్నారు. 'ఫ్రీ కాష్, కాపిటల్ ఎక్యుమ్యులేషన్ అండ్ ఇనీక్వాలిటీ (2019), ది ఫెయిల్యూర్ ఆఫ్ మార్కెట్స్ : ఎనర్జీ,హౌసింగ్ అండ్ హెల్త్ (2022) అనే గ్రంథాల రచయిత.

క్రెయిగ్ మెడ్లిన్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారీఫ్‌ల అమలు విధానం ఎంత గందరగోళంగా ఉన్నప్పటికీ, ఆ విధానాల లక్ష్యం ఆయన మొదటగా చెప్పినట్లు అమెరికాలో ఉత్పత్తి రంగాన్ని విస్తరించడమే. అమెరికా విధించే అధిక సుంకాల నేపథ్యంలో, దేశీయ సంస్థలైనా, విదేశీ సంస్థలైనా అమెరికాకు దిగుమతి చేసుకోవడానికి బదులుగా అక్కడే ఉత్పత్తి చేయడానికి సిద్ధపడేలా చేయడమే దీని వెనుక ఉన్న ఆలోచన! దీంతో అక్కడ ఉపాధి అవకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు. ఆటోమేషన్ వల్ల, అలాగే విదేశీ ఉత్పత్తుల ప్రభావంతో అమెరికాలో పరిశ్రమల పునాది బలహీనపడం, ఉపాధి అవకాశాలు తగ్గుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు.

'అమెరికా ఫస్ట్' అనే నినాదం 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అనే రాజకీయ ప్రచారం రెండో ప్రపంచ యుద్ధ ప్రారంభ కాలాన్ని గుర్తుకు తెస్తాయి. ఆ కాలంలో ప్రపంచ జనాభాలో కేవలం ఆరు శాతం మాత్రమే ఉన్న అమెరికా, ప్రపంచ తయారీ ఉత్పత్తిలో సుమారు 60 శాతం ఉత్పత్తి చేసేది. అలాగే, సాధారణ సమతుల్య వాణిజ్యాన్ని కొనసాగించేది లేదా మిగులు వాణిజ్యాన్ని నమోదు చేసేది. అలాంటి పరిస్థితుల్లో, అప్పటికే పెద్ద సంఖ్యలో యూనియన్లలో ఉన్న కార్మిక వర్గం ఉత్పాదకత పెరుగుదలతో పాటు వేతనాల పెరుగుదలను ఆశించింది. యుద్ధానంతర వ్యవస్థలో అమెరికా ప్రధాన ఆర్థిక శక్తిగా ఎదిగింది. మూలధన నియంత్రణలను పూర్తిగా తొలగించడంలో పెద్దగా విజయవంతం కాకపోయినా, వాణిజ్య నిబంధనలను పెద్ద మొత్తంలో తన ఆధీనంలో ఉంచుకోగలిగింది. 1944లో జరిగిన బ్రెటాన్ వుడ్స్ కాన్ఫరెన్స్‌లో రూపుదిద్దుకున్న బంగారం ఆధారిత డాలర్ ప్రమాణం, అమెరికా యొక్క అపార శక్తిని చాటిచెప్పింది.

ట్రంప్ తాజాగా పెంచిన టారీఫ్‌లు గత ఏడు దశాబ్దాలుగా కొనసాగుతున్న స్వేచ్ఛా వాణిజ్య పురోగతిని తిరగదోడే దిశగా ఉన్నాయి. వీటి ద్వారా చరిత్రను వెనక్కి తిప్పి, అమెరికా ఒంటరిగా వాణిజ్య నిబంధనలను మళ్లీ రూపొందించగలిగిన ప్రపంచాన్ని తిరిగి రూపొందించాలనే ప్రయత్నం జరుగుతోంది. సూక్ష్మంగా పరిశీలిస్తే ట్రంప్ సుంక విధానం గత ఏడు దశాబ్దాల్లో అమెరికా సంస్థల ఆధిపత్యాన్ని సవాలు చేసేలా ప్రత్యర్థి సంస్థలు ఎదిగాయని అంగీకరిస్తోంది. అదే సమయంలో, అమెరికా సంస్థలే తమ ఉత్పత్తిని ప్రపంచవ్యాప్తంగా విస్తరించుకున్నాయన్న సత్యాన్ని కూడా తెలియచేస్తాయి. టారీఫ్‌లకు సంబంధించిన తన పూర్తి ఆలోచనలను ట్రంప్ స్పష్టంగా చెప్పకపోయినా గ్లోబల్ వాల్యూ చైన్స్ ద్వారా ఏర్పడిన విదేశీ సరఫరాదారులపై ఆధారపడే అమెరికా కంపెనీల పరిస్థితిని తిరిగి మార్చాలన్న ఉద్దేశ్యం దీనిలో ఉంది. సరఫరా గొలుసులపై ఆధారపడే ప్రస్తుత విధానం ప్రధాన అమెరికా సంస్థల లాభాలను పెంచినప్పటికీ, దేశీయ ఉత్పత్తిని బలహీనపరిచింది.

అమెరికా ఒక నిర్దిష్ట భౌగోళిక ప్రాంతంలో స్థిరంగా ఉన్న కార్మిక వర్గాన్ని కలిగి ఉండగా, అమెరికా మూలధనం ఇప్పుడు ప్రపంచమంతటా వ్యాపించింది. బహుళజాతి అనుబంధ సంస్థలు మరియు 'ఆర్మ్స్ లెంగ్త్' (థర్డ్ పార్టీ) కాంట్రాక్టర్లు అమెరికాకు అవసరమైన దిగుమతులను అందిస్తూ, అమెరికా సంస్థలు తక్కువ వేతనాలతో పనిచేసే ప్రపంచ కార్మిక శక్తిని వినియోగించుకునేలా చేస్తున్నాయి. దిగుమతులు అమెరికాలో పెట్టుబడులను తగ్గించుకునే అవకాశాన్ని కూడా కల్పించాయి. దక్షిణ కొరియా, చైనా, బ్రెజిల్ తదితర దేశాల కంపెనీలు విస్తృతంగా ఉత్పత్తిని నిర్వహిస్తున్నప్పుడు, అమెరికాలో ఉక్కు కర్మాగారాలు లేదా ఇతర తయారీ యూనిట్లను నిర్మించాల్సిన అవసరం తగ్గిపోయింది. ముఖ్యంగా, వివిధ దేశాల్లో అమెరికా బహుళ జాతి సంస్థల ఉనికి ఆ దేశ ఎగుమతులు, పెట్టుబడులపై ప్రభావం చూపింది. విదేశాల్లో ఆ సంస్థలు చేసే సరుకుల విక్రయాలు ఇప్పుడు అమెరికా ఎగుమతులను మించిపోయి, వాటికి అడ్డంకిగా మారుతున్నాయి. గత కాలంలో బహుళజాతి అనుబంధ సంస్థలు అమెరికా ఎగుమతులను విస్తరించడంలో సహకరించేవి. అయితే ప్రస్తుతం, అవి ప్రధానంగా విదేశీ ఉత్పత్తి కేంద్రాల నుంచే సరఫరా చేసుకుంటున్నాయి. అమెరికా నుండి తయారైన సరుకులను ఎగుమతి చేసి, విదేశాల్లో తయారైన తమ స్వంత అనుబంధ సంస్థల ఉత్పత్తులతో పోటీ పడాలని ఆ కంపెనీలు కోరుకోవడం లేదు. ప్రస్తుత ప్రపంచ ఆర్థిక వ్యవస్థ చారిత్రక పరిణామాల ఫలితంగా ఏర్పడింది. కాబట్టి, వాణిజ్యంలో బహుళజాతి సంస్థల పాత్రను అర్థం చేసుకోవాలంటే, దానికి సంబంధించిన చారిత్రక నేపథ్యాన్ని పరిశీలించడం అవసరం.

## 'బ్రెట్టన్ వుడ్స్' కాలం (1944-1973) నుండి...

బ్రెట్టన్ వుడ్స్ (1944లో జరిగిన కీలక అంతర్జాతీయ ఆర్థిక సమావేశం పేరు. మౌంట్ వాషింగ్టన్ హోటల్‌లో జరిగిన ఈ సమావేశంలో 44 దేశాలు పాల్గొన్నాయి.) కాలం అమెరికా బహుళజాతి సంస్థల విదేశీ విస్తరణతో పాటు ప్రత్యర్థి సంస్థల మూలధన వ్యవస్థల విస్తరణను చూసింది. స్థిర మారకపు విలువలతో కూడిన బంగారం-డాలర్

ప్రమాణంపై ఆధారపడిన బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ దీర్ఘకాలం కొనసాగడానికి ప్రధాన కారణం విదేశీ వాణిజ్యంపై వివిధ దేశాలు ఆధార పడటమే! అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఆర్థికసాయం, ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన అమెరికా సైనిక ఉనికి దీనిని బలపరచాయి. ఈ ప్రక్రియ ద్వారా ప్రపంచమంతటా పెద్ద మొత్తంలో డాలర్లు ప్రవహించాయి. ఈ డాలర్ ఆధిపత్యం, అలాగే దాని మీద వివిధ దేశాలు ఆధారపడటం, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వేగంగా పునరుద్ధరించబడటానికి దోహదపడింది. అదే సమయంలో అమెరికా ప్రత్యర్థి దేశాలు కూడా వేగంగా ఎదగడానికి ఇది కారణమైంది. జపాన్‌ను పరిశీలిస్తే సంస్థల మధ్య దీర్ఘకాలంగా కొనసాగిన పరస్పర సంబంధాల వల్ల అమెరికా మూలధనం ఆయిల్ కంపెనీ ల్లోకి మినహాయిస్తే ఇతర సంస్థల్లోకి పెద్దగా ప్రవేశించలేకపోయింది. అయితే కొరియా, వియత్నాం యుద్ధాల కోసం అమెరికా యుద్ధ ఉత్పత్తికి జపాన్ మద్దతు ఇవ్వడం ద్వారా, జపాన్ తన ఆర్థిక పునరుద్ధరణకు, వేగవంత మైన అభివఅద్ధికి అవసరమైన డాలర్లను సంపాదించింది.

ఎగుమతులపై ఆధారపడిన జపాన్ ఆర్థిక వ్యవస్థ కారణంగా డాలర్ బలంగా కొనసాగింది. యెన్‌తో పోల్చితే డాలర్ బలహీనపడితే, జపాన్ ఎగుమతులు తగ్గి, ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన భాగం దెబ్బతింటుంది. అందువల్ల, అమెరికా తన కరెన్సీ ముద్రణ సామర్థ్యాన్ని, జపాన్ అనుకూల ద్రవ్య విధానాన్ని ఉపయోగించుకుని, జపాన్‌ను యుద్ధ సరఫరా కేంద్రంగా నిలబెట్టుకోగలిగింది. ఈ యుద్ధ డాలర్లు ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, యంత్రాలు వంటి పారిశ్రామిక రంగాల్లో అమెరికా కంపెనీలకు సమానంగా పోటీ ఇవ్వగల మొదటి శ్రేణి ప్రత్యర్థిగా జపాన్‌ను ఉంచడానికి దోహదపడ్డాయి.

ఇలా ఎగుమతులపై ఆధారపడటం యూరప్‌కూ విస్తరించింది. యూరోపియన్ దేశాలు పరస్పర పోటీగా కరెన్సీ విలువలను తగ్గించే (డీవాల్యుయేషన్) పరిస్థితిని నివారించేందుకు, బ్రెట్టన్ వుడ్స్ సమావేశం నిర్ణయించిన బంగారం ప్రమాణం ప్రకారం డాలర్ విలువకు తమ కరెన్సీలను అనుసంధానించాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతర వ్యవస్థకు 1946లో జరిగిన ఆంగ్లో–అమెరికన్ రుణ ఒప్పందం, 1948లో మార్షల్ ప్రణాళిక సహాయం, 1949లో నాటో స్థాపన

" యూరోపియన్ దేశాలు పరస్పర పోటీగా కరెన్సీ విలువలను తగ్గించే (డీవాల్యుయేషన్) పరిస్థితిని నివారించేందుకు, బ్రెట్టన్ వుడ్స్ సమావేశం నిర్ణయించిన బంగారం ప్రమాణం ప్రకారం డాలర్ విలువకు తమ కరెన్సీలను అనుసంధానించాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతర వ్యవస్థకు 1946లో జరిగిన ఆంగ్లో-అమెరికన్ రుణ ఒప్పందం, 1948లో మార్షల్ ప్రణాళిక సహాయం, 1949లో నాటో స్థాపన ద్వారా డాలర్ మద్దతు లభించింది. "




ద్వారా డాలర్ మద్దతు లభించింది. ఆ తరువాత దశాబ్దాల్లో యూరప్ పునర్నిర్మాణం కొనసాగుతున్న కొద్దీ, డాలర్ విలువ క్రమంగా పెరిగింది. అయినప్పటికీ, ఈ అధిక విలువ గల డాలర్ యూరప్ ఎగుమతులకు నిరంతరం మద్దతు ఇచ్చింది. అలాగే, కరెన్సీ విలువలను తగ్గిస్తూ ఒకరిని ఒకరు దెబ్బతీయాలనే యూరోపియన్ దేశాల విధానాలను నివారించింది. ఈ పరిస్థితుల్లో అమెరికా సంస్థలు అపార లాభాలు పొందాయి. యూరప్ దేశాలు డాలర్‌పై ఆధారపడటం వల్ల, అమెరికా కంపెనీలు యూరప్‌లో భూములు, పరిశ్రమలు, బహుళజాతి కేంద్రాలను తక్కువ ఖర్చుతోనే కొనుగోలు చేయగలిగాయి.

కామన్ మార్కెట్ (1957–1958 ) ఏర్పాటుకు దారితీసిన పరిణామాలు, అలాగే అమెరికాకు పెరిగే సుంకాలపై ఉన్న భయం, ఇంకా లాభాలను స్వదేశానికి తరలించే నిబంధనల్లో ముందుగానే వచ్చిన సడలింపులు తదితర కారణాలు అమెరికా సంస్థలను యూరప్‌లో విస్తరించేందుకు ప్రేరేపించాయి. ఒక ప్రముఖ మేధావి దృష్టిలో ఈ అమెరికా మూలధన దాడిని యుద్ధ భాషలోనే వివరించాల్సిన పరిస్థితి వచ్చింది. తన ప్రసిద్ధ గ్రంథంలో జాన్–జాక్ సర్వాన్–ష్రైబర్ ఈ పెరిగిన అమెరికా మూలధన ప్రవాహాన్ని 'అధికార స్వాధీనం'గా, 'యూరప్‌పై దాడి'గా అభివర్ణించారు. సర్వాన్– ష్రైబర్ అభిప్రాయం ప్రకారం, ఈ అమెరికా దూకుడును ఎదుర్కోవాలంటే యూరప్ దేశాలు ఆర్థికంగా, రాజకీయంగా మరింత ఏకం కావాల్సివచ్చింది. ఏ ఒక్క దేశమో అమెరికా ప్రభావాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే, అమెరికా మూలధనం ఆ దేశం నుండి ఇతర దేశాలకు మళ్లిపోతుంది. ఫలితంగా మూలధనం తరలి వెళ్లిన దేశాలకు అధిక ప్రయోజనాలు, సాంకేతికతలభిస్తాయని ఆయన గుర్తించాడు. భవిష్యత్తులో యూరో కరెన్సీ ఏర్పాటును ముందుగానే ఊహించినట్లుగా, సర్వాన్– ష్రైబర్ దేశాల మధ్య ఆర్థిక ఏకీకరణను పెంచాలని

**❝ సుంకాల విషయంలో ట్రంప్ ప్రస్తుతం ఆధారపడుతున్న ప్రధాన బలం అమెరికా మార్కెట్ యొక్క విస్తారత. అయితే, తులనాత్మకంగా చూస్తే, అమెరికా మార్కెట్ పరిమాణం ఇప్పటికీ గణనీయంగానే ఉన్నప్పటికీ, గతంలో ఉన్న స్థాయితో పోలిస్తే తగ్గిపోయింది. బ్రెట్టన్ వుడ్స్ బంగారం-డాలర్ వ్యవస్థ కూలి పోయిన సమయంలో, ప్రపంచ ఆదాయంలో అమెరికా మార్కెట్ వాటా మూడో వంతుకంటే ఎక్కువగా ఉండేది. ఇది 1960లో ఉన్న సుమారు 40 శాతంయికన్నా తక్కువే. ❞**

సూచించాడు. ఇలాంటి ఏకీకరణ వల్ల పోటీలు పడి కరెన్సీ విలువను తగ్గించే ప్రక్రియను అడ్డుకోవచ్చు. అలా చేయడం ద్వారా అమెరికా కంపెనీలు తక్కువ ధరలకు యూరప్‌లోని పరిశ్రమలు, ఆస్తులను సొంతం చేసుకునే అవకాశాలు తగ్గుతాయి.

యూరప్ దేశాల మధ్య మూలధన ఏకీకరణ యూరోపియన్ ఐక్యతకు కూడా తోడ్పడింది. యూరోపియన్ కంపెనీలు సరిహద్దులు దాటి విస్తరించడం ద్వారా, ఆర్థిక సమన్వయం విఫలమైతే కూడా వాటికి 'సహజ రక్షణలు' లభించాయి. అయితే, ద్రవ్య ఏకీకరణ దిశగా సాగిన మార్గం సాఫీగా లేకపోయింది. నిక్సన్ ప్రభుత్వం డాలర్‌ను బంగారం నుంచి వేరు చేయడం వల్ల (1971 –1973) బ్రెట్టన్ వుడ్స్ బంగారం-డాలర్ వ్యవస్థ కూలిపోయింది. దాంతో యూరప్ దేశాలు తమ తమ ఎగుమతులను కాపాడుకోవడానికి కరెన్సీ మార్కెట్లలో పరస్పరం పోటీ పడ్డాయి. 1970లలో జర్మనీ మరియు ఫ్రాన్స్ మధ్య 1970లో కుదిరిచ ఒప్పందాన్ని రద్దు చేసుకోవడం దానికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఈ ఒప్పందం వారి కరెన్సీల మధ్య మారకపు విలువను స్థిరంగా ఉంచడానికి చేసినది. అయినా కూడా, ద్రవ్య ఏకీకరణ , బహుళజాతి సంస్థలు సరిహద్దు దాటి చేసిన విస్తరణ చివరికి యూరప్ దేశాల మధ్య బలహీనంగానైనా కొంత దగ్గరి సంబంధాన్ని ఏర్పాటు చేసింది. 1992లో యూరోపియన్ ద్రవ్య సంఘం (యూరోపియన్ మానిటరీ యూనియన్) స్థాపన, తరువాత 1999౼2002 మధ్య యూరో కరెన్సీ ప్రవేశం దీనికి ఉదాహరణలు.

**బహుళజాతి విక్రయాలు ....ఎగుమతులు**

సుంకాల విషయంలో ట్రంప్ ప్రస్తుతం ఆధారపడుతున్న ప్రధాన బలం అమెరికా మార్కెట్ యొక్క విస్తారత. అయితే, తులనాత్మకంగా చూస్తే, అమెరికా మార్కెట్ పరిమాణం ఇప్పటికీ గణనీయంగానే ఉన్నప్పటికీ, గతంలో ఉన్న స్థాయితో పోలిస్తే తగ్గిపోయింది. బ్రెట్టన్ వుడ్స్ బంగారం-డాలర్ వ్యవస్థ కూలిపోయిన సమయంలో, ప్రపంచ ఆదాయంలో అమెరికా మార్కెట్ వాటా మూడో వంతుకంటే ఎక్కువగా ఉండేది. ఇది 1960లో ఉన్న సుమారు 40 శాతంయికన్నా తక్కువే. బ్రెట్టన్ వుడ్స్ తర్వాత మరింత తగ్గింది. ప్రస్తుతం అమెరికా మార్కెట్ ప్రపంచ ఆదాయంలో సుమారు నాలుగో వంతు మాత్రమే కలిగి ఉంది. విదేశీ సంస్థలు అమెరికా సంస్థలను విక్రయాలలోనూ, బహుళజాతి పెట్టుబడుల పరంగానూ చేరుకునే విధంగా ఇది కనపడుతోంది. అయితే, ఈ పరిణామం ఇది ఆశ్చర్యకరం కాదు. ఎందుకంటే, గత ఐదు దశాబ్దాల్లో యూరప్‌లో సరిహద్దులు దాటి ఏకీకరణ పెరిగింది, అలాగే జపాన్‌కు చెందిన పెద్ద కంపెనీలు అమెరికా, యూరప్, తూర్పు ఆసియా ప్రాంతాల్లో విస్తరించాయి. 1971లో ఆదాయాల ఆధారంగా ప్రపంచంలోని అతిపెద్ద 300 కంపెనీల్లో అమెరికా సంస్థలు సుమారు 63 శాతం విక్రయాలను కలిగి ఉండగా, 2024 నాటికి ఈ వాటా 38 శాతానికి తగ్గింది.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్ వేగంగా పునరుద్ధరణ కావడం వల్ల, అమెరికా బహుళజాతి సంస్థల స్వభావంలో గణనీయమైన మార్పు వచ్చింది. ప్రారంభంలో, ఇవి ప్రధానంగా అమెరికా ఖండ ప్రాంతాల్లో భౌగోళిక కేంద్రాలను ఏర్పాటు చేసి, చమురు, ఆహారం, చెక్క, కాగితం వంటి ప్రాథమిక ఉత్పత్తులను అభివృద్ధి చెందిన పరిశ్రమలకు, ఇతర ప్రపంచ దేశాలకు ఎగుమతి చేయడంపై దృష్టి పెట్టాయి. 1950లో, లాటిన్ అమెరికా దేశాలు, కెనడా కలిసి అమెరికా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల బుక్‌వాల్యూ మొత్తంలో రెండులో మూడవ వంతుకంటే ఎక్కువ భాగాన్ని కలిగి ఉండగా, యూరప్ వాటా కేవలం 15 శాతమే ఉండేది. తయారీ రంగ పెట్టుబడుల విషయంలో కెనడా (32 శాతం) పశ్చిమ యూరప్ (24 శాతం) కంటే ఎక్కువ వాటాను కలిగి ఉండేది. అయితే, 1970ల ప్రారంభానికి వచ్చేసరికి, యూరప్‌లో అమెరికా ప్రత్యక్ష పెట్టుబడుల వాటా 31 శాతానికి పెరిగింది. ఇందులో అమెరికా విదేశీ తయారీ పెట్టుబడులలో 48 శాతం యూరప్‌లోనే ఉన్నాయి. తరువాతి దశాబ్దాల్లో యూరప్ వాటా మరింత పెరిగింది. 2024 నాటికి, అమెరికా ప్రత్యక్ష పెట్టుబడుల్లో యూరప్ వాటా 58 శాతానికి చేరుకోగా, కెనడా, లాటిన్ అమెరికా కలిసి 23 శాతం, ఆసియా–పసిఫిక్ ప్రాంతం 17 శాతం వాటాను కలిగి ఉన్నాయి.

యుద్ధానంతర కాలంలో బహుళజాతి సంస్థల మొదటి విస్తరణ దశ ప్రధానంగా అభివృద్ధి చెందిన మార్కెట్లను ప్రత్యేకించి యూరప్‌ను లక్ష్యంగా పెట్టుకుంది. ఆ సమయంలో ఉత్పత్తి ప్రధానంగా అమెరికాలోనే కేంద్రీకృతమై ఉండటంతో, విదేశాల్లోని అమెరికా అనుబంధ సంస్థలను ఉత్పత్తి కేంద్రాలుగా కాకుండా, ప్రధానంగా మార్కెటింగ్ వేదికలుగా భావించేవారు. అందువల్ల, ఈ ప్రారంభ అనుబంధ సంస్థలు అమెరికా ఎగుమతులను సులభతరం చేసే పాత్ర పోషిస్తున్నట్లు అర్థం చేసుకున్నారు. అతి పెద్ద బహుళజాతి సంస్థలే సాధారణంగా అతి పెద్ద ఎగుమతిదారులుగా ఉండటం, బహుళజాతి సంస్థల విస్తరణ అమెరికా ఉత్పత్తికి మద్దతు ఇస్తుందనే అభిప్రాయానికి బలం చేకూర్చింది. అదనంగా, ప్రపంచ మార్కెట్ల కోసం జరుగుతున్న పోటీ నేపథ్యంలో, అమెరికా బహుళజాతి సంస్థల విస్తరణ ఇతర దేశాలు మార్కెట్లను ఆక్రమించడాన్ని అడ్డుకోగలదనే భావన కూడా ఉండేది. అమెరికా వాణిజ్య శాఖ చేసిన కొన్ని అధ్యయనాలు కూడా ఈ అభిప్రాయాన్ని బలపరిచాయి. 1966 నుంచి 1970 మధ్య కాలంలో బహుళజాతి సంస్థల ఎగుమతులు మొత్తం ఎగుమతులతో పోలిస్తే పెరిగాయి. దీని ద్వారా బహుళజాతి విస్తరణ అమెరికా ఎగుమతుల మార్కెట్‌కే కాకుండా మొత్తం అమెరికా ఆర్థిక వ్యవస్థకు కూడా సహాయపడిందనే అభిప్రాయం బలపడింది.

కాలక్రమేణా బహుళజాతి అనుబంధ సంస్థలు అమెరికా ఉత్పత్తితో ఉన్న తమ సంబంధాలను సడలించాయి. విదేశీ మార్గాల ద్వారా ముడి పదార్థాలు, నైపుణ్యం, మూలధనాన్ని పొందుతూ, విదేశాల్లోనే ఉత్పత్తి కార్యకలాపాలను చేపట్టడం ప్రారంభించాయి.

ఈ తరహా ఉత్పత్తికి అమెరికా నుండి ముడిపదార్థాలు, విడి భాగాలు అవసరమైతే, వాటిని అమెరికా నుంచే అనుబంధ సంస్థలకు పంపుతున్నారు. అయినప్పటికీ, అనుబంధ సంస్థల ఉత్పత్తిలో విదేశీ భాగస్వామ్యం క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఫలితంగా, అమెరికాలో ఉన్న ప్రధాన సంస్థలు తమ స్వంత అనుబంధ సంస్థల నుంచే పోటీని ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. ప్రపంచవ్యాప్తంగా గరిష్టంగా లాభాలను గడించాలన్న ఉద్దేశ్యంతో అమెరికా కంపెనీలు విదేశాల్లో ఉత్పత్తిపై ఎక్కువగా ఆధారపడడం ప్రారంభించాయి.

స్థానిక మార్కెట్ల కోసం స్థానికంగా ఉత్పత్తి చేయడం వల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా, స్థానిక మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఉత్పత్తిని సులభంగా సరిపోల్చుకునే అవకాశం కూడా ఈ విధానం వల్ల ఆ కంపెనీలకు లభించింది.

'బ్రెట్టన్ వుడ్స్' సృష్టించిన వ్యవస్థ కూలిపోయిన తర్వాత డాలర్ విలువ పడిపోవడంతో, సంస్థల అంతర్గత పోటీ తీవ్రరూపం దాల్చింది. అమెరికా ఎగుమతులు పెరగకుండా అడ్డుకునేందుకు, అమెరికా బహుళజాతి అనుబంధ సంస్థలు తరచుగా విక్రయ కేంద్రాల వద్దనే సేవా సదుపాయాలను (బ్యాక్ అప్ సర్వీసెస్) ఏర్పాటు చేసేవి. దీని వల్ల విదేశీ వినియోగదారులకు స్థానికంగానే సరుకులు, సేవలు లభించడం ప్రారంభమైంది.

అదనంగా, బహుళజాతి సంస్థలు డాలర్ ఆధారిత ధర నిర్ణయ విధానాలను ఉపయోగించాయి. డాలర్ విలువ విదేశీ కరెన్సీలతో పోల్చితే తగ్గినప్పుడు, అమెరికా ఎగుమతుల ధరలు తక్కువ పోటీ సామర్థ్యంతో కనిపించేలా ఈ విధానం పనిచేసింది. ఇలా డాలర్ ఆధారిత ధర విధానాలు, అనుబంధ సంస్థల ఉత్పత్తితో పోటీ పడే అమెరికా ఎగుమతులను అడ్డుకున్నాయి. 1970వ దశకం ప్రారంభంలో వచ్చిన చమురు సంక్షోభం, వియత్నాం యుద్ధంతో పాటు, డాలర్ ఆధారిత ధర విధానాలు ఆ దశాబ్దంలో ద్రవ్యోల్బణాన్ని పెంచడానికి కూడా కారణమయ్యాయి.

బహుళజాతి అనుబంధ సంస్థల విక్రయాలు అమెరికా ఎగుమతులకు ప్రత్యామ్నాయంగా మారుతున్నాయనే విషయానికి స్పష్టమైన ఆధారం, ఆ అనుబంధ సంస్థల విక్రయాలు, అమెరికా ఎగుమతుల మధ్య ఉన్న నిష్పత్తి పెరుగుదలలో కనిపిస్తుంది. దీనికి సంబంధించిన మొదటి గణాంకాలు 1957లో లభించాయి. అవి కూడా తయారీ రంగంలోని ఆరు విభాగాలకు మాత్రమే పరిమితమయ్యాయి. ఈ విభాగాల్లో నాన్–ఎలక్ట్రికల్ యంత్రాల విభాగం మినహా మిగిలిన విభాగాల్లో బహుళజాతి అనుబంధ సంస్థల విక్రయాలు అమెరికా ఎగుమతుల కంటే సగటున 200 శాతం కంటే ఎక్కువగా నమోదయ్యాయి. 1982 తర్వాత, అమెరికా బ్యూరో ఆఫ్ ఎకనామిక్ అనాలిసిస్ మరింత శాస్త్రీయంగా గణాంకాలను సేకరించడం ప్రారంభించింది. ఆ గణాంకాల ప్రకారం బహుళజాతి సంస్థల విక్రయాలు, బహుళజాతి సంస్థలకు సంబంధించిన అమెరికా ఎగుమతుల కంటే ఐదు నుంచి ఏడు రెట్లు ఎక్కువగా ఉన్నాయి. అలాగే, మొత్తం అమెరికా సరుకుల ఎగుమతులతో పోలిస్తే సుమారు మూడు రెట్లు ఎక్కువగా నమోదయ్యాయి. అత్యంత పెద్దవైన అమెరికా బహుళజాతి కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా లాభాలను గరిష్టం చేసుకోవాలనే ఉద్దేశంతో తమ స్వంత ఎగుమతులను పరిమితం చేసుకోవడం వల్ల అమెరికాలో కొనసాగుతున్న సరుకుల వాణిజ్య లోటు సులభంగా అర్థమవుతుంది. సరఫరా గొలుసుల్లో దిగుమతుల వినియోగం ఈ వాణిజ్య లోటును మరింత స్పష్టంగా చూపిస్తుంది. విస్తృత పరిశోధనల ప్రకారం, ఈ గ్లోబల్ నెట్‌వర్కులు సాంప్రదాయ ఉత్పత్తి యూనిట్లను మిశ్రమ రూపాలుగా అంటే ఉత్పత్తి కేంద్రాలుగానే కాకుండా విదేశీ ఉత్పత్తుల పంపిణీదారులుగానూ మార్చేలా రూపొందాయని అర్థమైంది. గ్లోబల్ వాల్యు చైన్స్ అనుబంధ సంస్థలు, ప్రైవేటు కాంట్రాక్టు ఏజెన్సీలు ఉత్పత్తులను ప్రోత్సహించే పద్ధతిలో నిర్మితమైనాయి. ఉదాహరణకు, చైనా నుండి అమెరికాకు వచ్చే దిగుమతుల్లో ఇతర ఆసియా దేశాల నుండి వచ్చిన ఉపకాంట్రాక్ట్ భాగాలు కూడా ఉండటం సాధారణం. ఇవి ముందుగా చైనా ఉత్పత్తిలో భాగమై, తరువాత అమెరికాకు ఎగుమతి అవుతాయి. ఈ వాల్యూ చైన్స్‌పై విస్తృతంగా అధ్యయనాలు జరిగాయి. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే సరుకులకు అమెరికా వినియోగ మార్కెట్ ప్రధాన గమ్యస్థానంగా ఉండటం ఆశ్చర్యకరం కాదు. ఒక అధ్యయనం ప్రకారం ప్రపంచ సరఫరా గొలుసుల్లో అధిక వాటా కలిగిన 11 దేశాలను పరిగణనలోకి తీసుకుంటే 2013లో అమెరికా వాటా సుమారు 39.2 శాతంగా నమోదైంది. సరఫరా గొలుసుల అనుసంధానాలు సంస్థలకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్మిక శక్తిని చాలా తక్కువ వేతనాలతో వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. 1995–2014 కాలంలో జపాన్, జర్మనీ, యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికా వంటి అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో తయారీ రంగ కార్మికుల వేతనాలు, మెక్సికో, ఇండోనేషియా, చైనా, భారత్ వంటి దేశాల్లో సగటు గంట వేతనాల కంటే ఆరు రెట్లు ఎక్కువగా ఉన్నాయి. ఉత్పాదకత స్థాయిలను పరిగణలోకి తీసుకుని, సగటు వేతన యూనిట్ ఖర్చుల ప్రకారం సరిచేసినా, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వేతనాలు అమెరికా వేతనాల్లో కేవలం 40 నుంచి 60 శాతం మాత్రమే ఉన్నాయి.

బహుళజాతి సంస్థల ఎగుమతులు, వాటి మొత్తం విక్రయాలతో పోలిస్తే తగ్గిపోవడం, అలాగే దిగుమతుల ద్వారా లభించే తక్కువ వేతన ప్రయోజనాలను చూస్తే అమెరికా బహుళజాతి వాణిజ్యంలో భారీ లోటు ఉంటుందని, అది మొత్తం అమెరికా సరుకుల వాణిజ్య లోటులో పెద్ద భాగం అవుతుందని అనిపించవచ్చు. అయితే, ఆ నిర్ధారణ తొందరపాటు అవుతుంది. అమెరికా కంపెనీలకు సంబంధం లేని విదేశీ సంస్థల నుండి వచ్చే దిగుమతులే అమెరికా మొత్తం దిగుమతుల్లో అతిపెద్ద భాగాన్ని కలిగి ఉన్నాయి. అంతేకాకుండా, బహుళజాతి సంస్థల వాణిజ్య లోటు , మొత్తం వాణిజ్య లోటు ఒకదానితో ఒకటి బలంగా అనుసంధానమై ఉన్నాయి. వాటిని స్పష్టంగా వేరు చేసి విశ్లేషించడం సాధ్యం కానిదిగా మారింది. సరుకుల మొత్తం వాణిజ్య

❝ 'బ్రెట్టన్ వుడ్స్' సృష్టించిన వ్యవస్థ కూలిపోయిన తర్వాత డాలర్ విలువ పడిపోవడంతో, సంస్థల అంతర్గత పోటీ తీవ్రరూపం దాల్చింది. అమెరికా ఎగుమతులు పెరగకుండా అడ్డుకునేందుకు, అమెరికా బహుళజాతి అనుబంధ సంస్థలు తరచుగా విక్రయ కేంద్రాల వద్దనే సేవా సదుపాయాలను (బ్యాక్ అప్ సర్వీసెస్) ఏర్పాటు చేసేవి. దీని వల్ల విదేశీ వినియోగదారులకు స్థానికంగానే సరుకులు, సేవలు లభించడం ప్రారంభమైంది. ❞

> "ట్రంప్ టారీఫ్‌ల ప్రాజెక్ట్ పైకి కనిపించేంత బలంగా లేదన్న సంకేతాలు కూడా ఉన్నత స్థాయిలో ఉన్న కొందరి నుండి వెలువడు తున్నాయి. వాల్ స్ట్రీట్ ప్రయోజనాలు కొనసాగు తున్నప్పటికీ ఈ పరిస్థితి నెలకొనడం గమనార్హం. ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ మాట్లాడుతూ, 'టారీఫ్‌ల తుపాకీ ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది, కానీ చాలా అరుదుగానే ఉపయోగించబడుతుంది" అని చెప్పారు."

లోటు ప్రధానంగా బహుళజాతి అనుబంధ సంస్థల విక్రయాలు, వాటి ఎగుమతులతో పోలిస్తే భారీగా పెరగడం వల్ల ఏర్పడింది. అయితే, ఈ విక్రయాలు వాణిజ్య సమతుల్య గణాంకాల్లో నమోదు కావు. అయినప్పటికీ, 2000 సంవత్సరం ప్రారంభం నుంచి బహుళజాతి వాణిజ్య సమతుల్యం లోటులోనే కొనసాగుతోంది.

### మారకపు విలువ సిద్ధాంతం

సాంప్రదాయ ఆర్థిక సిద్ధాంతం చాలా కాలంగా సమతుల్య వాణిజ్యానికి దారితీసే ప్రధాన శక్తిగా మారకపు విలువల మార్పులను పరిగణిస్తుంది. దీని తర్కం సూటిగా ఉంటుంది. ఇతర కరెన్సీలతో పోలిస్తే డాలర్ విలువ తగ్గితే, అమెరికా ఎగుమతులు చౌకగా మారుతాయి. దిగుమతులు మాత్రం ఖరీదుగా మారుతాయి. 1950ల చివర్లో చెల్లింపుల సమతుల్యంలో లోటు కనిపించడం ప్రారంభమైనప్పటి నుంచి డాలర్ విలువ తగ్గించాలన్న డిమాండ్ వినిపించింది. అయితే, అసలు మలుపు 1971 ఆగస్టు 15న వచ్చింది. ఆ రోజు అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ బ్రెట్టన్ వుడ్స్ బంగారం-డాలర్ ప్రమాణాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో డాలర్ విలువ గణనీయంగా పడిపోయింది. ఈ పతనం 1970ల చివరి వరకు కొనసాగింది. ఆ సమయంలో ఉన్న భారీ ద్రవ్యోల్బణానికి సమానంగా వడ్డీ రేట్లను రెండు అంకెల స్థాయికి పెంచినప్పుడు, పరిస్థితి మారింది. వెంటనే విదేశీ మూలధనం అమెరికాలోకి ప్రవహించడం ప్రారంభమైంది. ఫలితంగా డాలర్ విలువ ఒక్కసారిగా పెరిగింది. అమెరికాలోని పెద్ద తయారీ సంస్థలకు దిగుమతుల నుంచి గట్టి పోటీ ఏర్పడింది. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు 1985లో అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, జర్మనీ, ఫ్రాన్స్, జపాన్ దేశాల ప్రతినిధులు న్యూయార్క్‌లోని ప్లాజా హోటల్‌లో సమావేశమై డాలర్ విలువను తగ్గించే చర్యలను చేపట్టారు.

అయితే దీర్ఘకాల దృష్టిలో పరిస్థితి ఎలా ఉంది? డాలర్ మారకపు విలువ చాలా హెచ్చుతగ్గులతో ఉన్నప్పటికీ, దీర్ఘకాలంలో డాలర్ విలువ క్రమంగా పడిపోవడం, అదే కాలంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ పరిమాణంతో పోలిస్తే వాణిజ్య లోటు విస్తరించడం, ఇవి రెండూ దాదాపు సమాంతరంగా జరిగాయి. సాంప్రదాయ ఆర్థిక సిద్ధాంతానికి విరుద్ధంగా, ఇటీవల వాణిజ్య లోటు, జిడిపి నిష్పత్తిలో జరిగిన 'సవరణ', స్థిరీకరణ 2005-2010 తరువాత డాలర్ విలువ పెరిగిన సమయంలోనే చోటుచేసుకుంది.

బహుళజాతి విక్రయాలు, వాణిజ్య నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుంటే, ప్రధాన ఆర్థిక సిద్ధాంతం విఫలమవడం ఆశ్చర్యం కలిగించదు. అమెరికా బహుళజాతి సంస్థల విక్రయాలు ఎగుమతులతో పోలిస్తే అసాధారణంగా పెరగడం, అలాగే గ్లోబల్ సరఫరా గొలుసుల ద్వారా వేతనాలు, ముడి పదార్థాల ఖర్చుల్లో జరిగే ఆదా ఇవే అమెరికా వాణిజ్య లోటు నిర్ణయించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఏదైనా వాణిజ్య సమతుల్యతను సాధించాలంటే, గరిష్ఠంగా లాభాలను సంపాదించాలన్న లక్ష్యంతో ఏర్పడిన బహుళజాతి సంస్థల మూలధన నిర్మాణాలపై దృష్టి పెట్టాల్సిందే. దశాబ్దాలుగా ఏర్పడిన ఈ వ్యవస్థలను తక్కువ కాలంలో చారిత్రకంగా తిరగదోడడం సాధ్యం కాదు.

### ట్రంప్ టారీఫ్‌ల ప్రాజెక్టు

ట్రంప్ అభిప్రాయం ప్రకారం అమెరికా వాణిజ్య లోటు 'అన్యాయ' విధానాల ఫలితం. తయారీ రంగం, పరిశ్రమల ఉపాధి బలంగా ఉన్న పాత కాలాన్ని గుర్తుంచుకునే వృద్ధ కార్మిక వర్గంలో ట్రంప్ టారీఫ్‌లకు విశేష ఆదరణ లభిస్తోంది.

తైవాన్‌కు చెందిన టిఎస్ఎంసి కంపెనీ అరిజోనాలో విస్తరించడం వంటి ఉదాహరణలను, అలాగే ఇతర సంస్థలు పెట్టుబడులు పెడతామని ఇచ్చే హామీలను చూపిస్తూ, టారీఫ్‌లు అమెరికాలో పెట్టుబడులను, పారిశ్రామిక ఉపాధిని పెంచుతాయని ట్రంప్ వాదిస్తున్నారు. అయితే, ద్రవ్యోల్బణాన్ని పరిగణలోకి తీసుకుని చూస్తే, నాన్-సూపర్ వైజరీ కార్మికుల వేతనాలు గత అర్ధశతాబ్దంగా దాదాపు స్థిరంగానే ఉన్నాయి. ఇదే సమయంలో ఉత్పాదకత మాత్రం రెండింతలకు పైగా పెరిగింది. ఈ ఉత్పాదకత పెరుగుదల వల్ల వచ్చిన లాభాలు ప్రధానంగా ఆదాయం, సంపదలో పైస్థాయిలో ఉన్న వర్గాలకే చేరాయి. ముఖ్యంగా పెద్ద కంపెనీల గ్లోబలైజేషన్ ఆదాయం, సంపద పెరుగుదలకు ప్రధాన ఆధారంగా నిలిచింది. ట్రంప్ యొక్క 'అమెరికా ఫస్ట్' నినాదం అటువంటి వారిని లక్ష్యంగా పెట్టుకునే రూపొందించారు. ఆయన ఇచ్చే ప్రజాకర్షక నినాదాలు, భావజాలానికి ఇచ్చే ప్రచారం, బిలియనీర్లకు ఇచ్చే పన్ను రాయితీలు, అలాగే స్పష్టమైన క్రోనీ కేపిటలిజంతో పాటు నడుస్తోంది. ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన ప్రత్యేక ఒప్పందాల కోసం ఆపిల్ వంటి సంస్థల నుండి కొంత మొత్తాలను స్వీకరించడం కూడా ఇందులో భాగమే. ఇటువంటివి వార్తలుగా వచ్చినా, అవి ఇతర కంపెనీలను సైతం ఈ తరహా అవినీతి వ్యవహారాల్లో భాగస్వామ్యం కావడాన్ని ప్రోత్సహించేలా ఉంటున్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే వాస్తవానికి విదేశాల్లో బహుళజాతి సంస్థల విక్రయాలు అమెరికా ఎగుమతులను మించిపోతూనే ఉన్నాయి. అలాగే తక్కువ వేతన కార్మిక శక్తి, విదేశీ ముడి పదార్థాలపై ఆధారపడిన సరఫరా వ్యవస్థ కొనసాగుతూనే ఉంది.

అదే సమయంలో, ట్రంప్ టారీఫ్‌ల ప్రాజెక్ట్ పైకి కనిపించేంత బలంగా లేదన్న సంకేతాలు కూడా ఉన్నత స్థాయిలో ఉన్న కొందరి నుండి వెలువడుతున్నాయి. వాల్ స్ట్రీట్ ప్రయోజనాలు కొనసాగుతున్నప్పటికీ ఈ పరిస్థితి నెలకొనడం గమనార్హం. ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ మాట్లాడుతూ, 'టారీఫ్‌ల తుపాకీ ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది, కానీ చాలా అరుదుగానే ఉపయోగించబడుతుంది" అని చెప్పారు. 2025 జూలైలో బెస్సెంట్ మళ్లీ టారీఫ్‌లను చర్చల కోసం ఉపయోగించే సాధనంగా పేర్కొన్నారు. నిజానికి ట్రంప్ హయాంలో వాణిజ్య ఒప్పందాలు నిరంతర బెదిరింపు చర్యలుగా మారాయి.

**(అనువాదం: పొగడ దొరువు)**

రాజకీయ పరిణామాలు

# 'సర్'తో పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ప్రమాదం



రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

**ఎ కోటిరెడ్డి**

జాతీయ ఎన్నికల కమిషన్ (ఇసిఐ) అమలు చేస్తున్న "ఓటర్ల జాబితా ప్రత్యేక, సమగ్ర సవరణ" –ఎస్ఐఆర్– ప్రజల ఓటు హక్కుకు ఎసరు పెడుతున్నది. బీహార్‌లో జరిగిన ఓటరు జాబితా ప్రత్యేక, సమగ్ర సవరణతో ఇది తేటతెల్లమైంది. ఎన్నికల కమిషన్ మొదటగా బీహార్‌లో శాసనసభ ఎన్నికలు జరగటానికి ముందు 2025, జూన్–సెప్టెంబరు నెలల మధ్య ఓటర్ల జాబితా ప్రత్యేక, సమగ్ర సవరణ చేసింది. ఈ సవరణతో రాష్ట్రంలోని ఓటర్లలో 47 లక్షల మందిని–మొత్తం ఓటర్లలో 5-6 శాతం– ఓటర్ల జాబితా నుండి తొలగించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక, సమగ్ర సవరణకు ముందు రాష్ట్రంలో 7.89 కోట్లమంది ఓటర్లు ఉండగా, సవరించిన జాబితాలో 7.42 కోట్ల మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. దేశంలోని మిగతా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో కూడా ఓటర్ల జాబితా ప్రత్యేక, సమగ్ర సవరణ చేయటానికి ఎన్నికల కమిషన్ పూనుకున్నది.

భారతదేశ పౌరుడై ఉండి, 18 సంవత్స రాల వయసు నిండిన స్త్రీ, పురుషుల పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేయాలని, ఓటర్లు పార్లమెంటు, రాష్ట్ర శాసనసభకు జరిగే ఎన్నిక లలో ఓటు వేసే హక్కు కలిగి ఉంటారని రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 పేర్కొంటున్నది. రాజ్యాంగంలో పేర్కొన్న ఆదేశాలకు అనుగుణం గానే ఇప్పటి వరకు ఓటర్ల జాబితాలను సవ రించి, అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేస్తున్నారు. కాని ఇపుడు ఎన్నికల కమిషన్ రాజ్యాంగం ప్రజలకిచ్చిన ఓటుహక్కుకు ఎసరు పెడుతున్నది.

బీహార్ తర్వాత రెండవ దశలో తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాలలో ఎస్ఐఆర్ నిర్వహించాలని అక్టోబరు 17, 2025న ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారిచేసింది. సుమా రుగా 51 కోట్లమంది ఓటర్లున్న ఛత్తీస్‌ఘడ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్‌తో పాటు కేంద్ర పాలిత ప్రాంతలైన లక్షద్వీప్, అండమాన్ అండ్ నికోబార్ దీవులు, పాండిచ్చే రిలలో ఉన్న 321 జిల్లాలలోని 1,843 శాసన సభ స్థానాలలో ఎస్ఐఆర్ నిర్వహించింది. కొత్తగా చేర్చిన వారితో కలిపి, చేర్పులు, తొలగింపులు పూర్తి అయిన తర్వాత ముద్రించిన జాబితాలో 45.8 కోట్ల మంది ఓటర్లు మాత్ర మే ఉన్నారు. మొత్తం ఓటర్లలో 7.2 కోట్ల మంది–14.4 శాతం–ని ఓటర్ల జాబితా నుండి తొలగించారు. కొత్తగా చేరిన రెండు కోట్లమందిని కూడా కలుపుకున్న తర్వాత నికరంగా తొలగించిన ఓటర్లు ఐదు కోట్లు– 10.2 శాతం– పైగా ఉన్నారు. దేశం మొత్తం లో ఎస్ఐఆర్ పూర్తయేసరికి 10 కోట్లమందికి పైగా ఓటర్లు తమ ఓటుహక్కును కోల్పోయే ప్రమాదం ఉంది.

అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 2.89 కోట్లు, తమిళనాడులో 97 లక్షలు, బెంగాల్‌లో 90.8 లక్షల మంది పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించారు. ఎన్నికల క్రమం ప్రారంభం కావటానికి ముందు పశ్చిమ బెంగాల్‌లో 7.66 కోట్లమంది ఓటర్లు ఉండగా, సవరణల తర్వాత ఓటర్ల సంఖ్య 6.75 కోట్లకు తగ్గింది.

భారతదేశ ప్రజాస్వామిక వ్యవస్థను ధ్వసం చేసేక్రమాన్ని ఉధృతం చేశారని ఓటర్ల జాబితా ప్రత్యేక, సమగ్ర సవరణకు అనుసరిస్తున్న విధా నం వెల్లడిస్తున్నది. దేశంలో మొదటగా 1952 లో అధికారులు ఇల్లిల్లు తిరిగి, ప్రతి కుటుం బంలో ఉన్న అర్హులైన వయోజనులందరినీ ఓటర్లుగా చేర్చి జాబితాను రూపొందించారు. మొదటి ఓటర్ల జాబితాలో 17.3 కోట్లమంది ఓటర్లు ఉన్నారు. తర్వాత పార్లమెంటు, శాసన సభలకు ఎన్నికలు జరిగే సందర్భాలలో, కొన్ని సార్లు నిర్దిష్ట కాల పరిమితితో ఓటర్ల జాబితా లను సవరిస్తు న్నారు. 2024లో ఓటర్లు సంఖ్య 97.80 కోట్లకు చేరింది. 1952లో ఉన్న ఓటర్ల కన్నా 2024లో దాదాపు ఐదున్నర రెట్లు ఎక్కు వ మంది ఓటర్లు ఉన్నారు. గతంలో ఎన్నికల జాబితాలను సవరించిన ప్రతిసారీ ఓటర్ల సంఖ్య పెరిగింది. ఈసారి మాత్రం కోట్లసంఖ్య లో ఓటర్లను తొలగిస్తున్నారు. అందుకు ఎన్నికల కమిషన్ చెబుతున్న కారణాలు ఏ మాత్రం సమంజసంగా లేవు.

### ఓటర్లుగా చేరాల్సిన బాధ్యతను పౌరులపైకి నెట్టిన ఎన్నికల కమిషన్

ఓటు వేయటానికి అర్హత ఉన్న పౌరులను ఓటర్లుగా నమోదు చేసే బాధ్యత నుండి ఎన్నికల కమిషన్ తప్పుకోవటం ఎస్ఐఆర్‌లో ప్రధానాంశంగా ఉన్నది. గతంలో ఓటర్ల జాబితాను సవరించిన ప్రతిసారి బూత్‌స్థాయిలో ఉద్యోగులు గత ఓటర్ల జాబితాను తీసుకొని, పోలింగ్ బూత్ పరిధిలోని ప్రతి ఇంటికి స్వయంగా వెళ్ళి, ఆ ఇంట్లో ఓటరుగా నమోదు కావటానికి అర్హులైన వారిని జాబితాలో చేర్చేవారు. గతంలో ఓటర్లుగా ఉన్నవారిలో ఎవరైనా చనిపోతే వారి పేరు జాబితా నుండి తొలగించేవారు. గతంలో ఓటరుగా నమోదైన వారు ఆ ఇంటిలో కాకుండా వేరే ఇంటిలో నివసిస్తుంటే వారి చిరునామాను మార్చేవారు. తన బూత్ పరిధిలో కాకుండా ఇతర పోలింగ్ బూత్‌ల పరిధిలోకి మారిన వారి వివరాలు తీసుకొని, వాటిని పోలింగ్ ఆఫీసరుకు అందజేస్తే వారు అందుకు అనుగుణంగా చిరునామాలను మార్చేవారు.

ప్రస్తుతం ఓటరుగా చేరాల్సిన బాధ్యతను పౌరులపై పెట్టటంతో పాటు వారే వివరాలన్నింటినీ అందజేయాలని నిర్దేశించింది. ఓటుహక్కు ఉన్న పౌరులు ఎన్నికల కమిషన్ చెప్పిన వాటిలో ఏ ఒక్కటైనా చూయించకపోతే ఓటరుగా నమోదు చేయకపోగా, గతంలో ఓటర్లుగా ఉన్నవారి పేర్లను కూడా ఓటర్ల జాబితా నుండి తొలగిస్తున్నారు. అంతే కాకుండా అవసరమైన పత్రాలను చూయించిన వారిని కూడా అకారణంగా తొలగిస్తున్నారు. అందువలన ఓటర్ల సంఖ్య భారీగా తగ్గటంతో పాటు, ఓటర్లుగా చేరుతున్నవారిని అనవరసరమైన ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలోని పేదప్రజలలో నిరక్షరాస్యులు ఎక్కువగా ఉండటంతో ఎన్నికల కమిషన్ అడుగుతున్న పత్రాలను అందజేయటం వారికి కష్టంగా మారుతుంది. దానితో పాటు

> ఓటర్ జాబితాలో ఉన్నపేరు తొలగించ టం లేదా 18 సంవత్సరాలు దాటిన వయోజను లను ఓటర్ల జాబితాలో చేర్చకుండా ఉండటానికి ఏ ప్రాతిపదిక లేకుండా, ఎన్నికల కమిషన్ ఇష్టానికి అనుగుణంగా చేయటం అన్నింటి కన్నా ప్రమాద కరంగా పరిణమిస్తుంది. ఇపుడు జరుగుతున్న సవరణలో ఏ కారణం చూయించ కుండానే ఓటర్ల జాబితాలో ఉన్న కోట్లాది మంది పేర్లను తొలగిస్తున్నారు.

దేశ ప్రజలలో దాదాపు 80 శాతం మంది వ్యవసాయ కార్మికులు, చిన్నా చితక పనులు చేసుకొనే కార్మికులు, పేద రైతులు ఉన్నారు. కోట్లాది మంది వలస కార్మికులుగా జిల్లాలు, రాష్ట్రాలు దాటి, సుదూర ప్రాంతాలలో ఉపాధి పొందుతున్నారు. అటువంటి వారు తమ స్వగ్రామంలో ఓటరుగా నమోదు చేయించుకోవటం కోసం వందల కిలోమీటర్ల దూరం నుండి రావటం అసంభవం. తమ గ్రామాలలో ఉన్న వారు కూడా ఎన్నికల కమిషన్ సూచించిన పత్రాలు తీసుకెళ్ళి, ఓటరుగా నమోదు కావటం కష్టమైన విషయం. మొదట్లో ఎన్నికల కమిషన్ ఆధార్ కార్డు ప్రాతిపదికగా ఓటర్లను నమోదు చేయటానికి అంగీకరించ లేదు. సుప్రీంకోర్టు ఆదేశించిన తర్వాత మాత్రమే ఓటరు నమోదుకు ఆధార్‌కార్డును కూడా అవసరమైన పత్రాలలో చేర్చటానికి అంగీకరించింది. కోరిన పత్రాలను అందజేసి నప్పటికీ ఓటరుగా నమోదు చేయని, జాబితా నుండి ఓటర్లను తొలగించారని అనేక మంది ఆరోపణలు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ కొత్త ఓటర్లను నమోదు చేయటం కన్నా జాబితా లో ఉన్న ఓటర్లను తొలగించటానికి ప్రాధాన్యత ఇస్తున్నది.

### ఓటుహక్కు కోల్పోతున్న మైనారిటీలు, పేదలు, మహిళలు

ఎన్నికల కమిషన్ వైఖరితో మైనారిటీలతో పాటు దళితులు, గిరిజనులు, మహిళలు, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన తరగతులకు చెందినవారు పెద్దసంఖ్యలో ఓటుహక్కును కోల్పోతున్నారు. ప్రస్తుతం ఎస్ఐఆర్ అమలు జరిపిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఓటుహక్కు కోల్పోయిన వారిలో ఈ తరగతుల ప్రజలే ఎక్కువ మంది ఉన్నారు. ఎన్నికల కమిషన్ చెప్పిన పత్రాలను తీసుకురావటం, వాటిని అధికారులకు అందజేసి, తమపేరు నమోద యిందో లేదో తెలుకునేంత తీరుబడి, ఆర్థిక స్తోమత వీరికి ఉండదు. ఈ తరగతులకు చెందిన వారి పేర్లను ఒకసారి ఓటర్ల జాబితా నుండి తొలగించినా, లేక అర్హులను జాబితాలో చేర్చకపోయినా, తమపేరు జాబితాలో చేర్చుకోవటం వీరికి తలకు మించిన భారంగా మారుతుంది.

### మైనారిటీలు, బలహీనవర్గాలు ఓటుహక్కు కోల్పోవటంతో జరిగే పరిణామాలు

పాలకవర్గాలకు చెందినవారికి ఓటుహక్కు కోల్పోయిన పేదప్రజలతో రాజకీయంగా అవసరం ఉండదు. ఓటు ఉండదు కాబట్టి ఏ ఎన్నికల్లోనూ వారితో అవసరం ఉండదు. ఆ విధంగా వారు స్థానిక సంస్థల నుండి అత్యున్నత మైన పార్లమెంటు ఎన్నికల వరకు తమ ప్రతినిధులను ఎన్నుకొని పంపే హక్కును కోల్పోతారు. 10 కోట్లమందికి పైగా పేదలు ఓటు హక్కును కోల్పోయిన తర్వాత దేశ, రాష్ట్ర రాజకీయ రంగాలలో వ్యవసాయ కార్మికులు, కార్మిక వర్గం పాత్ర బలహీనపడుతుంది. వారి సమస్యలపై పాలకవర్గాలకు శ్రద్ధ తగ్గుతుంది. రేషన్, ఉపాధి హామి, పిఎం కిసాన్ యోజన, విద్య, వైద్యం లాంటి సంక్షేమ పథకాలను బలహీన పర్చటం, రద్దు చేయటం పాలకవర్గాలకు సులభ మౌతుంది. పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలను రద్దు చేయటానికి బిజెపి పొంచి ఉన్నది.

దేశప్రజల మెడపై ఎన్ఆర్‌సి కత్తి వేలాడుతుండగా, ఎస్ఐఆర్ పేరుతో భారీగా ఓటర్లను తొలగించటం రానున్న ప్రమాదాన్ని తెలియజేస్తున్నది. సాధారణంగా అమలు చేయాల్సిన ఓటరు జాబితా ప్రత్యేక, సమగ్ర సవరణలోనే దాదాపు 10 కోట్లమందికి పైగా ఓటర్ల జాబితా నుండి తొలగించటానికి పూనుకోవటం ఆర్ఎస్ఎస్–బిజెపి కుట్రను వెల్లడిస్తున్నది. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను రద్దుచేసి, దానిస్థానంలో మనుస్మృతిని ప్రవేశపెట్టటానికి ఆర్ఎస్ఎస్–బిజెపి ప్రయత్నం చేస్తున్నాయి. అందుకోసం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయటానికి పూనుకున్నాయి. రాజ్యాంగం ద్వారా ఏర్పాటు చేసుకున్న పాలనా వ్యవస్థలను చట్టబద్ధంగా పనిచేయకుండా నిరోధిస్తున్నది. తమ ఇష్టం వచ్చిన విధంగా చట్టాలకు వక్రభాష్యం చెబుతున్నది. అన్ని వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకొని, చట్టబద్ధ పాలనను భ్రష్టు పట్టిస్తున్నది.

### ఏ ప్రాతిపదిక లేకుండా ఓటర్లను తొలగించటం ప్రమాదకరం

ఓటర్ జాబితాలో ఉన్నపేరు తొలగించటం లేదా 18 సంవత్సరాలు దాటిన వయోజనులను ఓటర్ల జాబితాలో చేర్చకుండా ఉండటానికి ఏ ప్రాతిపదిక లేకుండా, ఎన్నికల కమిషన్ ఇష్టానికి అనుగుణంగా చేయటం అన్నింటి కన్నా ప్రమాదకరంగా పరిణమిస్తుంది. ఇపుడు జరుగుతున్న సవరణలో ఏ కారణం చూయించకుండానే ఓటర్ల జాబితాలో ఉన్న కోట్లాది మంది పేర్లను తొలగిస్తున్నారు.

దేశంలో నక్సలైట్లను నిర్మూలించామని, అర్బన్ నక్సల్స్ సమస్యను పరిష్కరించే కార్యక్రమం కూడా మే నెల నుండి ప్రారంభమౌతుందని ఈ మధ్య కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించాడు. కమ్యూనిస్టుల నుండి రాహుల్ గాంధీ వరకు ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించేవారినీ, బిజెపికి వ్యతిరేకంగా ఉన్నవారందరినీ అర్బన్ నక్సల్స్ జాబితాలో చేర్చారు. రాజకీయ పార్టీలతో పాటు ప్రజా ప్రయోజనాలు, రాజ్యాంగ పరిరక్షణ కోసం పనిచేస్తున్న అనేక సంస్థలు, వ్యక్తులు ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్నారు. సామాన్య ప్రజలను ఓటర్ల జాబితాలో చేర్చటానికి అనేక ఇబ్బందులు పెడుతున్న ఎన్నికల కమిషన్ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే, అర్బన్ నక్సల్స్ అని ప్రభుత్వం ముద్ర వేస్తున్న వారికి ఓటర్ల జాబితాలో చోటు ఇస్తుందా? ప్రస్తుత సవరణలో అంత తీవ్రంగా అమలు చేయలేకపోయినప్పటికీ రానున్న కాలంలో ప్రత్యర్థులపై దీనినే ప్రధానాస్త్రంగా ప్రయోగించి, వారికి ఓటుహక్కు నిరాకరించే ప్రమాదం ఉంది.

రాజ్యాంగాన్ని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని రద్దుచేసి, మనుస్మృతిని అమలు చేయటం ఆర్ఎస్ఎస్–బిజెపిల లక్ష్యంగా ఉన్నది. ప్రస్తుతం అమలు చేస్తున్న ఎస్ఐఆర్ ద్వారా కోట్లమంది ప్రజల ఓట్లు తొలగిస్తున్నారు. పాలనా వ్యవస్థలు, న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తూ తమ ప్రజా వ్యతిరేక విధానాలకు ఎదురౌతున్న ప్రతిఘటనను విదేశీ శక్తుల కుట్రలుగా చూయించటం ద్వారా అధిగమించటానికి ప్రయత్నం చేస్తున్నది. ప్రజలు అప్రమత్తంగా లేకపోతే ఇదే సాకుతో ఆర్ఎస్ఎస్ తనకుతాను దేశాన్ని రక్షించే సంస్థగా ప్రకటించుకొని, అధికారాన్ని తన చేతులలోకి తీసుకున్నా ఆశ్చర్యపోవాల్సింది లేదు. కాబట్టి రాజ్యాంగాన్ని ధ్వంసం చేయటం, ప్రజాస్వామ్యాన్ని నిర్మూలించటం, సర్వాధికారాలను తమ చేతుల్లోకి తీసుకోవటం కోసం ఆర్ఎస్ఎస్–బిజెపి చేస్తున్న కుట్రలను తిప్పికొట్టటం ప్రధానం.

> ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 1.01 కోట్ల ఎకరాల సాగుభూమి ఉన్నది. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 22.3 లక్షలు ఉన్నాయి. సాగు విస్తీర్ణంలో దాదాపుగా మూడో వంతుకు పైగా వ్యవసాయ భూమి బోర్లతోనే సాగవుతున్నది. ప్రాజెక్టుల కింద సాగుచేస్తున్న రైతుల కన్నా బోర్లు, బావుల కింద సాగు చేస్తున్న రైతాంగానికి పంటలు పండించటానికి ఎక్కువ ఖర్చు అవుతు న్నది. ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇవ్వకపోతే బోరు బావుల కింద వ్యవసాయం మరీ కష్టంగా మారుతుంది.

### వ్యవసాయానికి ఉచిత విద్యుత్ రద్దుకే ప్రత్యేక డిస్కం ఏర్పాటు

వ్యవసాయరంగానికి విద్యుత్ సరఫరా చేయటం కోసం ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ రూరల్ అగ్రికల్చరల్ పవర్ లిమిటెడ్ (ఎపిఆర్ ఎపిఎల్–ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వ్యవసాయ విద్యుత్ సరఫరా లిమిటెడ్) డిస్కంకు 11 కె వి ఫీడర్ ఆస్తులను దశల వారీగా బదలా యించటానికీ, లైసెన్స్ కోసం ఎపిఇఆర్‌సికి దరఖాస్తు చేసుకోవటానికీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం ఏప్రిల్ 10వ తేదీన ఆమోదం తెలిపింది. వ్యవసాయానికి సరఫరా చేస్తున్న ఉచిత విద్యుత్‌ను రద్దుచేసి, రైతుల నుండి బిల్లులు వసూలు చేయటానికి ప్రభుత్వం పథకం ప్రకారం పనిచేస్తున్నది. అందులో భాగంగా ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్లు, స్మార్ట్‌మీటర్లు బిగిస్తా మని ప్రకటించింది. వీటికి ఛార్జీలు వసూలు చేస్తే ప్రారంభంలోనే రైతాంగం నుండి వ్యతిరేకత వస్తుందని స్మార్ట్‌మీటర్లు ఉచితంగానే బిగిస్తామని చెబుతున్నారు. " తాడిచెట్టు ఎందుకు ఎక్కావురా అంటే దూడ గడ్డికోసం" అన్నట్లుగా వ్యవసాయానికి పగలు తొమ్మిది గంటలు నాణ్యా మైన విద్యుత్ పరఫరా చేయటానికి, విద్యుత్ నష్టాలను అరికట్టటానికి ఈ మార్పులు చేస్తున్నా మంటూ ప్రభుత్వం రైతులకు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 1.01 కోట్ల ఎకరాల సాగుభూమి ఉన్నది. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 22.3 లక్షలు ఉన్నాయి. సాగు విస్తీర్ణంలో దాదాపుగా మూడో వంతుకు పైగా వ్యవసాయ భూమి బోర్లతోనే సాగవుతున్నది. ప్రాజెక్టుల కింద సాగుచేస్తున్న రైతుల కన్నా బోర్లు, బావుల కింద సాగు చేస్తున్న రైతాంగానికి పంటలు పండించటానికి ఎక్కువ ఖర్చు అవుతు న్నది. ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇవ్వకపోతే బోరు బావుల కింద వ్యవసాయం మరీ కష్టంగా మారుతుంది.

పస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్‌పై ఇస్తున్న సబ్సిడీలను రద్దు చేయటానికి ప్రయత్నాలు చేస్తున్నది. అందుకు సన్నాహంగా విద్యుత్‌పై వేలకోట్ల రూపాయల సబ్సిడీలు ఇస్తున్నట్లు ప్రచారం చేస్తున్నది.

వ్యవసాయానికి ప్రత్యేకంగా లైన్లు వేసి, ట్రాన్స్‌ఫార్మర్లు బిగించి, ప్రతిరైతు మోటరుకు మీటరు బిగించిన తర్వాత వ్యవసాయానికి ఇస్తున్న విద్యుత్‌కు ఛార్జీలు వసూలు చేయటానికి రంగం సిద్ధమౌతుంది. ప్రభుత్వం చెప్పినట్లుగా వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించిన తర్వాత, మీటరు రీడింగ్ తీసి, వచ్చిన బిల్లు మొత్తాన్ని ప్రభుత్వం రైతు బ్యాంకు ఎకౌంటుకు బదిలీ–ప్రత్యక్ష నగదు బదిలి– చేస్తుందని, ఆ మొత్తంతో రైతు డిస్కంలకు కరెంటు బిల్లు చెల్లిస్తాడని, అందువలన మీటర్లు బిగించినప్ప టికీ రైతుపై ఏ మాత్రం భారం పడదని ప్రభుత్వం నమ్మబలుకుతున్నది.

### స్మార్ట్‌మీటర్లు రీఛార్జి చేయకపోతే కరెంటు వస్తుందా?

రైతులను మోసం చేయటం కోసం ప్రభు త్వం అబద్ధాలు చెబుతున్నది. వ్యవసాయ మోటార్లకు ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్లు బిగిస్తు న్నారు. ముందుగా రీఛార్జి చేయకుండా ప్రీపెయిడ్ మీటర్లకు కరెంటు ఇవ్వరు. కాబట్టి ముందుగా రీఛార్జి చేసుకుంటేనే వ్యవసాయ మీటరుకు కరెంటు వస్తుంది. ప్రభుత్వం రైతుకు బిల్లు ముందు చెల్లిస్తుందా లేక మీటర్ రీడింగ్ తీసిన తర్వాత చెల్లిస్తుందా? ముందు చెల్లించే ప్రసక్తి ఉండదు. అంటే ముందుగా రైతులు తమ విద్యుత్ మీటరును రీ ఛార్జి చేసుకొని, విద్యుత్ వినియోగించుకున్న తర్వాత (ప్రభు త్వం ఎన్ని నెలల తర్వాత బిల్లు చెల్లిస్తుందో, చెల్లించినా మొత్తం చెల్లిస్తుందో లేదో, అసలు చెల్లిస్తుందో లేదో కూడా తెలియదు) ప్రభుత్వం రైతుకు చెల్లిస్తుంది. విద్యుత్‌ను ముందే కొనుగోలు చేస్తారు కాబట్టి బిల్లు రావటం ఉండదు. రీఛార్జికి అయిన 1000–2000 రూపాయలు ముందుగా రైతు చెల్లించాలి. ఆ తర్వాత ప్రభుత్వం చెల్లిస్తే ఆ మొత్తం ఎప్పటికో రైతుకు చేరుతుంది. వేసవి కాలం పంటలు పండించే రైతులకు ఎక్కువ విద్యుత్ కొనుగోలు చేయాలి. ఆ మేరకు రైతు ఎక్కువ మొత్తం ముందుగా చెల్లించాలి.

రైతులు వాడుకున్న కరెంటు బిల్లు మొత్తాన్ని ప్రభుత్వం ఎంతమేరకు చెల్లిస్తుంది, ఎంతకాలం చెల్లిస్తుందనేది సందేహాస్పదంగా ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్లకు నగదు బదిలీ ప్రవేశపెట్టినపుడు చెప్పిన మాటలకు– చేతలకు మధ్య వ్యత్యాసాన్ని ఒకసారి గుర్తు చేసుకొండి. నగదు బదిలీ ద్వారా ధరలు పెరిగిన మేరకు సబ్సిడి మొత్తాన్ని పెంచి వినియోగదారుల ఎకౌంట్లలో వేస్తామని, ఆ మొత్తంతో వినియో గదారులు గ్యాస్ సిలెండరు కొనుగోలు చేయవచ్చు నని, వినియోగదారులపై ఎటువంటి భారం పడదని ప్రారంభంలో ప్రభుత్వం నమ్మబలి కింది. కానీ తర్వాత పెరిగిన మొత్తాన్ని చెల్లించ కపోవటంతో వినియోగదారులు రూ. 300 సిలెండరుకు రూ. 900 వరకు చెల్లించాల్సి వచ్చింది. కోవిడ్ సమయంలో ప్రభుత్వం కొంత కాలం అసలు సబ్సిడి జమ చేయలేదు. తర్వాత కూడా కొంతకాలం 20 రూపాయల నుండి 300 రూపాయల వరకు మాత్రమే వినియోగ దారుల ఎకౌంట్లలో జమ చేశారు. ఇదే పరిస్థితి రేపు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు రాదని చెప్పలేం. రైతులు వినియోగించుకున్న కరెంటు బిల్లులో కొంత మొత్తాన్ని మాత్రమే ప్రభుత్వం వారి ఎకౌంట్లలో జమ చేస్తే మిగతా మొత్తాన్ని రైతులు చెల్లించాల్సి వస్తుంది.

### కౌలురైతులకు ఉచిత విద్యుత్ ఇస్తారా?

వ్యవసాయ మోటార్లకు స్మార్ట్‌మీటర్లు బిగించిన తర్వాత కౌలురైతులకు ఉచిత విద్యుత్ ఇస్తారా? కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఇవ్వటానికి ప్రభుత్వానికి ఏ మాత్రం ఖర్చుకాదు. ప్రభుత్వం గుర్తింపు కార్డు ఇస్తే ఆ కార్డు ఆధా రంగా బ్యాంకులో తక్కువ వడ్డీకి పంటరుణం తీసుకోవటంతో కౌలురైతుకు కొంత వెసులు బాటు కలుగుతుంది. కాని ఏ ఖర్చులేని గుర్తింపు కార్డే ఇవ్వని ప్రభుత్వం కౌలురైతులకు ఉచిత విద్యుత్ ఇస్తుందా? ఒకవేళ కరెంటు వినియో గానికి అయిన మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించినా మీటరు కనెక్షన్ భూమి యజమాని పేరుతో ఉంటుంది కాబట్టి ఆ మొత్తం యజమాని ఎకౌంట్ లో జమ అవుతుంది. కరెంటుకు ప్రభుత్వం చెల్లించిన మొత్తం భూ యజమాని కౌలురైతుకు ఇవ్వకపోతే అది మరింత భారం అవుతుంది.

వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ ప్రిపెయిడ్ మీటర్లు బిగించి, రైతులు విద్యుత్ కొనుగోలు చేసేలా చేయటంతో వ్యవసాయం మరింతగా భారమై, రైతుల అప్పులు, ఆత్మహత్యలు మరింతగా పెరగటానికి దోహదం చేస్తుంది. *

# పెట్టుబడిదారీ విధానం-కార్ల్‌మార్క్స్

(2వ పేజీ తరువాయి)

శక్తికి కొరత ఏర్పడకూడదు. అందుకోసం పెట్టుబడిదారులు పని కల్పించే కార్మికుల కన్నా ఎక్కువ మంది కార్మికులు ఎప్పుడూ అందు బాటులో ఉండాలి. పెట్టుబడి కేంద్రీకరణ జరుగుతున్న క్రమంలో చిన్న ఉత్పత్తిదారులను నాశనం చేయటం ద్వారా ప్రజలను నిరంతరం కార్మికవర్గంలోకి నెడుతుంటుంది. ఫలితంగా కార్మిక రిజర్వు సైన్యం ఏర్పడుతుంది. పెట్టుబడి పోగుపడుతూ ఉండటంతో పని చేసే కార్మికుల సంఖ్య పెరగటంతో పాటు పనులు దొరకని రిజర్వు కార్మిక సైన్యం పరిమాణం కూడా పెరుగుతుంటుంది. దీనితో ఒకవైపున సంపదలు పోగుపడుతుంటే మరోవైపున అనివార్యంగా దరిద్రం పెరుగుతూ ఉంటుంది.

కనీస జీవనోపాధికి అవసరమైన మొత్తం కన్నా ఎక్కువ వేతనాలు ఇస్తే కార్మికవర్గ జనాభా అపరిమితంగా పెరిగిపోతుందని, అందువలన వేతనాలు తక్కువగా ఉంచుతారని ఇంగ్లీష్ సాంప్రదాయ ఆర్థికవేత్తలు చెప్పారు. జనాభా పెరుగుదలపై మాల్థూస్ భావాలను వ్యక్తం చేస్తున్న ఈ మాటలను మార్క్స్ తిరస్కరించాడు. దీనికి ఆధారమైన జనాభా పెరుగుదల సిద్ధాంతం "మానవజాతినే అవమానిస్తుందని" చెప్పాడు.

ఐదవది, పెట్టుబడిదారీ విధానం ఉత్పత్తి దారులను వారి ఉత్పత్తి సాధనాల నుండి దూరం చేస్తుంది. ఈ ఉత్పత్తి సాధనాలు కొద్ది మంది వద్ద కేంద్రీకృతం కావటం వలన రెండు విధాలైన సరుకుల యజమానులు – ఉత్పత్తి సాధనాలు, జీవనాధారాలు చేతిలో ఉన్న ఒక వర్గం, అమ్ముకోవటానికి తమ శ్రమశక్తి మినహా మరేమి లేని వర్గం "ముఖాముఖి సంబంధా లలోకి వస్తాయి".

ఆరవది, ఉత్పత్తి విధానాలను నిరంతరం విప్లవీకరిస్తుండటంతో క్రమంగా కార్మికుల ఉత్పాదకత పెరుగుతుంటుంది. కానీ వేతనాలను చారిత్రకంగా నిర్ధారితమైన కనీస జీవనాధారాల స్థాయిలో ఉంచటానికి, కాలక్రమంలో నిదానంగా పెరుగుతుండటానికి కార్మిక రిజర్వుసైన్యం దోహదం చేస్తుంది. ఒకవైపు వేతనాలు పూర్తిగా వినియోగించుకోబడుతూ ఉండగా, మరోవైపు అదనపు విలువలో కొంత భాగం మాత్రమే వినియోగం జరుగుతుంది. ఆర్థికవ్యవస్థలో ఉత్పత్తి అయిన సరుకులతో పోల్చినపుడు వినియోగానికి డిమాండ్ తక్కువగా ఉండటానికి ఇది దారితీస్తుంది. వినియోగించ బడని అదనపు విలువ అంతా స్థిర పెట్టుబడి, అస్థిర పెట్టుబడులకు జత చేయటం జరిగితే, ఆర్థికవేత్త సే ఊహించినట్లు అపుడు ఉత్పత్తి అయిన సరుకుల విలువకు సరిపడా డిమాండ్ లేదనే సమస్య ఎప్పుడూ ఉత్పన్నం కాదు. కానీ పోగుపడుతున్న మొత్తం ద్రవ్య పెట్టుబడిలో భాగం కావటం, మొత్తం ఉత్పత్తిలో అదనపు విలువ భాగం పెరుగుతుండటం అధికోత్పత్తి సంక్షోభానికి దారితీస్తుంది.

చలనంలో ఉండే పెట్టుబడి (వేరియబుల్ కాపిటల్) కన్నా స్థిర పెట్టుబడి నిష్పత్తి పెరగటం ద్వారా పెట్టుబడి మౌలిక నిర్మాణంలో సంభవించే మార్పులను, వాటి వలన వ్యవస్థలో సంభవించే వివిధ రకాల సంక్షోభాలను గురించి మార్క్స్ చర్చించాడు. పెట్టుబడిదారీ విధానంలో డబ్బును వినియోగించే తీరు వలన తలెత్తే అధికోత్పత్తి సంక్షోభాన్ని గురించి, సంపదను నిల్వ చేసుకోవటం డబ్బుతో ముడిపడి ఉన్నందున తలెత్తే సమస్యలను గురించి సాంప్రదాయ ఆర్థికవేత్తలు ఆమోదించిన ఇంగ్లీష్ ఆర్థికవేత్త సే నిర్ధారణల కన్నా ముందే మార్క్స్ చెప్పాడు. 1930 దశాబ్దంలో వచ్చిన గొప్ప సంక్షోభాన్ని (గ్రేట్ డిప్రెషన్) అర్థం చేసుకోవటానికి, దాని నుండి బయటపడటానికి కీనీషియన్ విప్లవం గా ప్రచారమైన అంశాలను 75 సంవత్స రాలకు ముందే మార్క్స్ విశదీకరించాడు.

పెట్టుబడిదారీ విధానంలోని దోపిడి స్వభావం, ఈ వ్యవస్థ పని చేసే తీరు, దోపిడీ తిరిగి పునరుత్పత్తి అవుతూ ఉండటం, దాని ఫలితంగా తలెత్తే వైరుధ్యాలతో పాటు ఈ వ్యవస్థలోని మౌలిక అంశాలను లోతుగా అవగాహన చేసుకుని, ఇది ఎటువంటి ప్రణాళిక లేకుండా యధాలాపంగా పని చేసే వ్యవస్థ అని మార్క్స్ భావించాడు. కొందరు వ్యక్తులు, సంస్థలు వ్యవహరించే తీరుపై ఆధారపడి పని చేసే వ్యవస్థ, ఆ వ్యక్తులు, సంస్థలు అదే విధంగా వ్యవహరించాలని వత్తిడి చేస్తుంది. అందువలన ఈ వ్యవస్థ ప్రధానంగా తనకు తానుగా పని చేసే వ్యవస్థ. వ్యక్తుల చర్యలు వ్యవస్థ పనితీరును ప్రభావితం చేస్తాయి. వ్యవస్థ పనితీరే ఆ వ్యక్తులు వ్యవహరించే తీరును కూడా నిర్ణయిస్తుంది. ఈ వ్యవస్థ నిర్దేశించిన విధంగా వ్యవహరించని వ్యక్తులు, ఉదాహరణకు పెట్టుబడిని కూడబెట్టుకోలేని పెట్టుబడిదారుని వలె వ్యవస్థలో తమ స్థానాన్ని కోల్పోయి, పక్కకు నెట్టివేయబడతారు. వ్యక్తులుగా చేస్తున్న చర్యలు మొత్తం కలిసి కొన్ని పరిణామాలకు, అనగా పెట్టుబడి కేంద్రీకరణ, అన్నింటినీ సరుకులుగా మార్చటం, నిరుద్యోగ సైన్యాన్ని మరింత ఎక్కువగా పునరుత్పత్తి చేయటం, చిన్న ఉత్పత్తిదారులను మింగివేసే ధోరణి, ఒకవైపు సంపద, మరో వైపున దరిద్రం పోగుపడటానికి దారితీస్తాయి.

మార్క్స్ చేసిన రెండవ అధ్యయనం కూడా అనేక ముఖ్యమైన నిర్ధారణలకు దారితీసింది. ఈ వ్యవస్థలో వ్యక్తులందరూ స్వేచ్ఛగా వ్యవహరిస్తారని చేసే వాదనకు భిన్నంగా, పెట్టుబడిదారీ విధానం ప్రతివారినీ తమ అభిమతానికి భిన్నంగా వ్యవహరించేలా చేస్తుంది. డార్విన్ చెప్పిన విధంగా పెట్టుబడి దారులు ఎవరికి వారు తమ మనుగడ కోసం చేసే పోరాటంలో, వారి అభిమతానికి అనుగు ణంగా వ్యవహరించే అవకాశం ఉండదు. కాబట్టి పెట్టుబడిదారీ విధానంలో పెట్టుబడి దారులు కూడా తమ అభిమతానికి అనుగు ణంగా వ్యవహరించలేరు. " పెట్టుబడి మూర్తీభవించిన వాడిగా", పెట్టుబడి అభీష్టాన్ని నెరవేర్చటానికి సాధనంగా మాత్రమే పెట్టుబడి దారుడు ఉంటాడని మార్క్స్ పేర్కొన్నాడు.

రెండవ అంశం "వ్యవస్థ తన చిత్తం వచ్చినట్లు "స్వేచ్ఛగా" వ్యవహరిస్తుందంటే అర్థం తనకు తానుగా దానిలో మార్పులు రావు. రాజకీయ జోక్యం ద్వారానే ఆర్థిక వ్యవహారా లలో మార్పులు తీసుకురావటం సాధ్యమౌ తుంది. సాధారణంగా పెట్టుబడిదారీ రాజ్యం రాజకీయంగా జోక్యం చేసుకోవటం ద్వారా స్వేచ్ఛగా వ్యవహరించే దాని స్వభావాన్ని మరిం తగా పెంపొందించటానికి, దానిలో సహజం గా ఉన్న లక్షణాలను మరింతగా సాకారం చేయటానికి దారితీస్తుంది. మాట వరుసకు కొన్ని పరిస్థితులలో ఈ వ్యవస్థ తనకు తానుగా పని చేయటంపై పరిమితులను విధిస్తే, "స్వేచ్ఛగా" వ్యవహరించే దాని స్వభావాన్ని రాజకీయ జోక్యం ద్వారా కుంచింపజేయటానికి దారితీ స్తుంది. ఆ విధంగా కుంచింపజేయటం వ్యవస్థ సక్రమంగా పనిచేయకుండా చేస్తుంది. అపుడు దానిని మార్చటానికి, లేదా "స్వతంత్రంగా వ్యవహరించటాన్ని" పునరుద్ధ రించటానికి మరింతగా జోక్యం చేసుకోవటం అవసరం అవుతుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థ "స్వేచ్ఛగా వ్యవహ రించే" తీరు వల్లనే సోషలిజం అవసరం అవుతుంది. ఏ విధమైన సంస్కరణలను అయినా విజయవంతంగా, చిరకాలం కొనసాగే విధంగా అమలు చేయటానికి, "కార్మికులకు స్నేహితునిలా" "సామాజిక బాధ్యత కలిగి నదిగా", అందరి క్షేమాన్ని కోరేదిగా, "సంక్షేమ విధానాలను అమలు చేసేదిగా" పెట్టుబడిదారీ వ్యవస్థ ఉంటే, ఈ వ్యవస్థ స్థానంలో సోషలిస్టు

వ్యవస్థను ఏర్పాటు చేయవటసిన అవసరం ఉండదు. "స్వేచ్ఛగా" వ్యవహరించే ఈ వ్యవస్థ స్వభావం వల్లనే అటువంటి మార్పులకు, ప్రధానమైన సంస్కరణలకు అవకాశం ఉండదు. చిరకాలం కొనసాగే " సంక్షేమ పెట్టుబడిదారి విధానం" దీనితో పొసగక పోవటం వలననే ఈ వ్యవస్థను మార్చవలసిన అవసరం ఏర్పడుతున్నది.

సోషలిజం దీనికి పూర్తిగా భిన్నమైనది. ఏ మాత్రం "స్వేచ్ఛగా" వ్యవహరించేది కాదు. సమాజం తరఫున రాజ్యం జీవనాధారా లన్నింటిపైనా గుత్తాధిపత్యాన్ని వహించటంలో మాత్రమే పెట్టుబడిదారీ విధానం, సోషలిజానికి మధ్య వ్యత్యాసం ఉండదు. ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్న సంస్థలు పెట్టుబడిదారీ సంస్థల వలె మార్కెట్‌లో ఒకదానితో మరొకటి పోటీ పడుతుంటే అపుడు పెట్టుబడిదారీ విధానంలోని అరాచకం, సంక్షోభాలు, నిరుద్యో గంతో పాటు పెట్టుబడిదారీ విధానంలోని అనేక అంశాలు పునరుత్పత్తి అవుతుంటాయి. సోష లిజంలో ఆదాయాలను మరింత సమానంగా పంపకం చేస్తారనే దానికి మాత్రమే రెండు వ్యవస్థల మధ్య వ్యత్యాసం పరిమితం కాదు. నిరుద్యోగ సైన్యం పెరిగే విధానాలను కొనసాగిస్తే కొద్దికాలంలోనే ఆ వ్యత్యాసం కూడా అంతరించిపోతుంది. పెట్టుబడిదారీ విధానానికి సహజమైన అంతర్గత ఆర్థిక వైరుధ్యాలతో సోషలిజం నడవక పోవటంలోనే రెండింటి మధ్య నిజమైన వ్యతాసం ఉన్నది. కాబట్టి కార్మికవర్గం చైతన్యవంతమైన సామూహిక రాజకీయ జోక్యం ద్వారా తమకు అనుగుణమైన ఆర్థిక మార్పులను ప్రవేశపెట్టవచ్చు. సోషలిస్టు వ్యవస్థలో మాత్రమే ఇది సాధ్యమౌతుంది.

సమాజంలోని వ్యక్తులు తమ సహజ లక్షణాలతో వ్యవహరించటాన్ని పెట్టుబడిదారీ విధానం తప్పనిసరి చేస్తున్నపుడు సోషలిజం దీనిని ఏ విధంగా అధిగమించ గలుగుతుంది? పెట్టుబడిదారీ విధానం కార్మికుల మధ్య పోటీని, వారిని చిన్నాభిన్నం చేసి, పరాయీకరణను పెంచతున్నప్పటికీ, "వివిధ రకాలైన "కూట ములు"గా ఏర్పడటానికి కూడా అవకాశం కల్పిస్తుందని మార్క్స్ చెప్పాడు. ఇది దాని అంతర్గత తర్కం పనిచేసే తీరుకు భిన్నంగా ఉంటుంది. ఈ వ్యవస్థకు "బయటి నుండి" న్యాయబద్ధతను కల్పించటం, సిద్ధాంతం, ఆచరణ తదితరాలను సమగ్ర దృక్పథంతో అమలు చేయటం ద్వారా సోషలిస్టు భావ జాలం అభివృద్ధికి అవకాశం కల్పిస్తుంది.

ఉదారవాదం వ్యక్తి స్వేచ్ఛ గురించి నొక్కి చెబుతున్నప్పటికీ, ఈ స్వేచ్ఛకు కొందరు వ్యక్తులు, కొన్ని గ్రూపులు లేదా రాజ్యం ఆటంకం కల్పిస్తున్నట్లు భావిస్తుంది. కానీ ఈ వ్యవస్థే ఆటంకం కల్పిస్తున్నదని అర్థం చేసుకోదు. ఉదారవాదానికీ, మార్క్సిజానికీ మధ్య వ్యత్యాసం ఇక్కడే ఉన్నది. సమాజంలో అన్ని విధాలైన ఆర్థిక సంబంధాలు స్వచ్ఛందంగా ఏర్పడు తున్నాయనే అవగాహనతో ఉంటారు కాబట్టి వ్యక్తులు నిర్దిష్టమైన ఆర్థిక సంబంధాలు ఏర్పరచుకొనేలా వ్యవస్థ నిర్బంధిస్తుందని వారెప్పుడూ భావించరు.

వ్యక్తులు రూపొందించే పథకాలు, వారి కార్యకలాపాలకు ఆటంకంగా పరిణమించ టానికి మాత్రమే ఆర్థిక విధానం పరిమితం కాదని మార్క్స్ స్పష్టం చేశాడు. అందుకు భిన్నంగా తన అంతర్గత లక్షణాలతో పనిచేసే పెట్టుబడిదారీ విధానపు ఉచ్చులో వ్యక్తులు చిక్కుకుంటారు. అందువలన పెట్టుబడిదారీ విధానంలో వ్యక్తి స్వేచ్ఛను సాధించటం సాధ్యం కాదు. పెట్టుబడిదారీ వ్యవస్థ స్థానంలో ఏ విధమైన అంతర్గత లక్షణాలతోనూ పని చేయని సోషలిస్టు వ్యవస్థ ఏర్పడినపుడు మాత్రమే వ్యక్తి స్వేచ్ఛను పొందటం సాధ్యమౌతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉన్న ఈ అంతర్గత అంశాలను అధిగమించటానికి, కులం, లింగం, జాతి తదితర అన్ని విధాలైన అణచివేతల నుండి విముక్తి కావటానికి సోషలిస్టు వ్యవస్థను ఏర్పాటు చేసుకోవలసిన అవసరాన్ని ఇది ముందుకు తెస్తుంది. అన్ని విధాలైన అణచివేత లకు ముగింపు పలకటానికి సోషలిజం తప్పనిసరి అవసరం.

పెట్టుబడి గ్రంథంలో పెట్టుబడిని గురించి మార్క్స్ విశ్లేషణలో కేవలం పెట్టుబడిదారి విధానాన్ని మాత్రమే విశ్లేషించాడు. పెట్టుబడి దారి విధానాన్ని ఆవరించివున్న పూర్వ వ్యవస్థల ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, వాటిని గురించి చర్చించలేదు. మార్క్స్ పెట్టుబడి గ్రంథం రాస్తున్న సమయంలో భారతదేశంపై బ్రిటిష్ వలస విధాన ప్రభావం గురించి విస్తా రంగా చదవటంతో పాటు న్యూయార్క్ డైలి ట్రిబ్యూన్ దినపత్రికలో విస్తృతంగా వ్యాసాలు రాస్తూ వుండటంతో ఈ అంశం ఆసక్తికరంగా ఉన్నది. పెట్టుబడిదారి విధానాన్ని గురించి మార్క్స్ చేసిన అధ్యయనంలో సామ్రాజ్యవాదాన్ని భాగంగా చేయకపోవటం బహుశా ఆ సమయంలో పశ్చిమ యూరప్ దేశాలలో శ్రామికవర్గ విప్లవాలు వస్తాయని భావించి, అందుకు అవసరమైన సన్నాహాలలో మునిగి ఉండటం కారణం కావచ్చు. పశ్చిమ యూరప్‌లో విప్లవావకాశాలు వెనుక పట్టు పట్టటంతో తర్వాతి కాలంలో ఆయన ఇతర ప్రాంతాలపై కేంద్రీకరించాడు. భారతదేశం నుండి ఇంగ్లండ్‌కు సంపద వరదలా ప్రవహించటం గురించి తన మరణానికి రెండు సంవత్సరాల ముందు నరోడ్నిక్ ఆర్థికవేత్త ఎన్ ఎఫ్ డేనియల్ సన్‌కు ఆయన ఒక లేఖ రాశాడు.

ఎట్టుబడిదారి విధానాన్ని గురించి మార్క్స్ చేసిన పరిశీలన ఈ అధ్యయనానికి ముగింపుగా కాకుండా, ప్రారంభంగాభావించాలి. సామ్రాజ్య వాదాన్ని కూడా భాగంగా చేసుకొని మార్క్సిజాన్ని అభివృద్ధి చేయటానికి ఈ అధ్యయనం కొనసాగించటంతో పాటు, తర్వాత జరిగిన మార్పులను అధ్యయనం చేయాల్సిన బాధ్యత అనంతర కాలంలోని మార్క్సిస్టులపై పడింది. లెనిన్ ఆ కర్తవ్యాన్ని నిర్వహించాడు. పెట్టుబడి దారీ విధానం గురించి మార్క్స్ వ్యక్తం చేసిన కొన్ని మౌలిక భావనలు మరింత బలపడటా నికి ఈ పరిణామాలు దోహదం చేశాయి.

ఉదాహరణకు పెట్టుబడిదారీ విధానాన్ని ఆవరించి ఉన్న చిన్న ఉత్పత్తిని మింగివేస్తూ, ఉత్పత్తిదారులను మాత్రం పెట్టుబడిదారీ విధానంలో భాగంగా చేసుకోదు. ఈ అంశాన్ని పరిశీలించటం ఈ వ్యవస్థ ఒకవైపున సంపద లను ఉత్పత్తి చేస్తూ, మరోవైపున దరిద్రాన్ని పెంచుతుందన్న ఆయన లోతైన అవగాహనను మరింతగా బలపరుస్తుంది. పెట్టుబడిదారీ విధానం మొదటగా విజయం సాధించిన దేశాలలో ఆ విధమైన విభజన జరగదంటూ మార్క్స్ విశ్లేషణకు వ్యతిరేకంగా వాదించేవారు పెట్టుబడిదారీ విధానానికి, దాని చుట్టూ ఉన్న ప్రపంచానికీ మధ్య ఉన్న గతితార్కిక సంబంధాన్ని విస్మరిస్తున్నారు. మార్క్స్ మొదట రాసిన వాటి కన్నా ముందుకెళ్ళి చేసిన అధ్యయనం ఆయన భావాలను మరింతగా బలపరుస్తున్నది.

మార్క్స్ విప్లవ ప్రణాళికకు కూడా ఇదే వర్తిస్తుంది. సామ్రాజ్యవాదాన్ని కూడా కలుపు కొని, పెట్టుబడిదారీ విధానాన్ని సమగ్రంగా అధ్యయనం చేసినపుడు విప్లవానికి ఉన్న అవకా శాలు మరింతగా స్పష్టమౌతాయి. అపుడు అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలోని విప్లవాలను గురించి మాత్రమే కాకుండా, పెట్టుబడిదారీ విధానం తక్కువ అభివృద్ధి చెందిన దేశాలలో కూడా కార్మిక-కర్షక ఐక్యత ప్రాతిపదికగా జనతా ప్రజాస్వామ్య సాధన కోసం జరిగే విప్లవాలతో దశల వారీగా సోషలిజం వైపుకు సాగిపో వాలి. పెట్టుబడి దారీ విధానం ఆలస్యంగా అభివృద్ధి అయిన దేశాలలో ఫ్యూడల్ వ్యతిరేక విప్లవాలను ముందుకు తీసుకువెళ్ళటంలో అశక్తత, ఆధునిక ప్రపంచీకరణ కాలంలో కూడా చిన్న ఉత్పత్తిదారులను మింగివేస్తూ, వారిని దరిద్రం లోకి నెట్టి, ఆత్మహత్యలు చేసుకొనే పరిస్థితులను కల్పిస్తున్న ఈ వ్యవస్థ మార్క్స్ భావనలను మరింతగా బలపరుస్తున్నది.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

*

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 21, issue: 12 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# ప్రపంచ సైనిక వ్యయంలో 5వ స్థానంలో భారత్



2025లో ఆయుధాలపై అత్యధికంగా ఖర్చు చేసిన దేశాల్లో భారత్ 5వ స్థానంలో ఉంది. గత ఏడాది మన దేశం మొత్తం 9,210 కోట్ల డాలర్లు (సుమారు 8.75 లక్షల కోట్ల రూపాయలు) ఖర్చు చేసింది. మన పొరుగున ఉన్న పాకిస్థాన్ 1,190 కోట్ల డాలర్ల ఖర్చుతో 31వ స్థానంలో ఉంది. గత ఏడాది ప్రపంచం మొత్తం ఆయుధాలపై చేసిన ఖర్చులో భారత దేశం 3.2 శాతం ఖర్చు చేసి అమెరికా, చైనా, రష్యా, జెర్మనీల తరువాత అయిదో స్థానంలో నిలిచిందని స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రి) ఇటీవల విడుదల చేసిన నివేదికలో తెలిపింది. 2024తో పోలిస్తే గత ఏడాది భారత దేశపు రక్షణ వ్యయం 8.9 శాతం పెరిగిందని నివేదిక వెల్లడించింది.

భారత దేశపు పొరుగు దేశాలు కూడా సైనిక వ్యయాన్ని పెంచినట్లు సిప్రి నివేదిక తెలిపింది. చైనా గత ఏడాది రక్షణ వ్యయాన్ని 7.4 శాతం పెంచింది. 2025లో దాని మొత్తం రక్షణ వ్యయం 33,600 కోట్ల డాలర్లు. ప్రపంచంలో ఆయుధాలపై అత్యధికంగా ఖర్చు చేస్తున్న దేశం అమెరికా. అమెరికా, చైనా, రష్యాలు కలిసి ప్రపంచ సైనిక వ్యయంలో 51 శాతం చేస్తున్నాయి.

ప్రపంచ వ్యాపితంగా అన్ని దేశాలూ కలిసి గత ఏడాది 2,87,700 కోట్ల డాలర్లు ఆయుధాల కోసం ఖర్చు చేశాయనీ, ఇది అంతకు ముందు ఏడాదితో పోలిస్తే14 శాతం పెరిగిందని సిప్రి నివేదిక వెల్లడించింది.

ప్రపంచంలో ఆయుధాల దిగుమతిలో భారత దేశం అగ్రస్థానంలో కొనసాగుతోంది. మొత్తం ప్రపంచ ఆయుధ దిగుమతుల్లో 8.2 శాతం భారత దేశమే దిగుమతి చేసుకుంటున్నది. గత దశాబ్ద కాలంలో భారత దేశం రష్యా నుండి ఆయుధాల దిగుమతులను తగ్గించి ఇజ్రాయిల్, అమెరికా, ఫ్రాన్స్‌ల నుండి దిగుమతులు పెంచింది. 2016-20లో భారత దేశ ఆయుధ దిగుమతుల్లో 51 శాతం వాటా రష్యా నుండి ఉండేది. 2021-25 కాలానికి అది 40 శాతానికి తగ్గిపోయింది.


**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు ..........................................

వీధి ..........................................

గ్రామం ..........................................

మండలం లేదా పట్టణం ..........................................

జిల్లా ..........................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com


Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.